www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 20-11-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 215 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: పంచమి సా. 4.50 తదుపరి షష్ఠి; నక్షత్రం: పునర్వసు మ. 2.50 తదుపరి పుష్యమి; వర్జ్యం: రా. 11.05-12.44; దుర్ముహూర్తం: ఉ. 11.38-12.22; అమృతఘడియలు: మ. 12.26-2.02; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.26; సూర్యాస్తమయం: 5.34 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 20-11-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

విజయవాడ సిటీ**

ప్రపంచంలోనే కాలుష్య నగరం ఢిల్లీ



రాజధానిలో 500 దాటిన గాలి నాణ్యత

యూపీపైనా తీవ్ర ప్రభావం.. పలు చోట్ల వాహనాల ఢీ 2

ఇద్దరు ద్విచక్ర వాహనదారుల మృతి.. పలువురికి గాయాలు

హరియాణా సహా 7 రాష్ట్రాలకు పొగమంచు హెచ్చరికలు

నవంబరు-జనవరి నెలల మధ్య నివాస యోగ్యమే కాదు

ఇంకా ఢిల్లీని రాజధానిగా కొనసాగించాలా?: శశి థరూర్

ఎన్నికల్లో ఓడిపోయిన తర్వాత చట్టాలు, ప్రజాస్వామ్యం గురించి బోధనలు చేస్తున్న జగన్ తన జమానాలో మాత్రం వాటిని కాలరాశారు. చివరికి లాయర్ల సేవల్లోనూ క్విడ్‌ప్రోకోను వాడిన ఘనత జగన్‌దే. కోర్టుల్లోనూ తన మాటే నెగ్గాలని అనుంగు న్యాయవాదులను తెచ్చిపెట్టుకున్నారు. వారికి రాజపోషణ అందించారు. తన మాటే శాసనం అన్నట్టు.. ఎవరి అనుమతి, ఆమోదం అక్కరలేదనుకొని ప్రజాధనాన్ని పణంగాపెట్టి వారికి భారీగా సమర్పించుకున్నారు. అయితే, ఎంత చెల్లించారు? ఏ తరహా కానుకలు సమర్పించారనేది ఇప్పటిదాకా బయటికి తెలియదు. అయితే, ఇటీవల ఓ న్యాయవాది కేసును పరిశీలించినప్పుడు ఆయన విషయంలో రాజపోషణ, నిబంధనల ఉల్లంఘన ఏ స్థాయిలో సాగిందో బయటపడింది.

నచ్చితే కోరినంత మేత!



ఐదేళ్లూ న్యాయ శాఖలో జగన్ 'లా'

అడ్వకేట్లతోనూ క్విడ్ ప్రో కో సేవలు

ప్రభుత్వ కేసుల్లో భారీగా ఫీజులు

చెల్లింపులకు అడ్డగోలు జీవోలు

సీఎం కాకముందే జగన్‌పై కేసులు

వాటిని వాదించేవారికే కీలక పోస్టులు

జగన్ జమానాలో వారికి రాజపోషణ

తాజాగా వెలుగులోకి మరో ఉదంతం

అప్పటి జీవో రద్దు చేసిన న్యాయ శాఖ

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి కావడానికి ముందే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐ, ఈడీ కేసులున్నాయి. ఆ కేసులను వాదిస్తున్న వారే జగన్ జమానాలో అడిషనల్ అడ్వకేట్ జనరల్, అడ్వకేట్ ఆన్‌రికార్డు, పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులయ్యారు. వారు కోర్టుల్లో ఓ వైపు జగన్ కేసులు, మరోవైపు ప్రభుత్వంపై నమోదైన కోర్టు ధిక్కార, ఇతర కేసులను వాదించారు. తన కేసులు వాదించినందుకు జగన్ వారికి ఎంత మేరకు ఫీజులు చెల్లించారు? కానుకలు ఏమిచ్చారు? అన్నవి బయటికి తెలియదు. కానీ, ప్రభుత్వంపై నమోదయిన కోర్టుధిక్కార కేసులపై హైకోర్టులో అడిషనల్ అడ్వకేట్ జనరల్, అడ్వకేట్ ఆన్ రికార్డ్, ప్రభుత్వ ప్లీడర్ (జీపీ) హోదాలో వాదనలు వినిపించినందుకు


మిగతా 14వ పేజీలో...

పోలవరం

గేమ్ చేంజర్!

ఈ ప్రాజెక్టు పూర్తయితే కరువే ఉండదు: సీఎం

2019-24 మధ్య జగన్ సర్కారు విధ్వంసం



డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా గ్రహించలేదు

2027 జూన్ నాటికి ప్రాజెక్టు పూర్తి

గోదావరి-పెన్నా అనుసంధానానికి

రూ.72 వేల కోట్లు కావాలి

4'పీ' విధానంలో సమీకరించే యోచన

ఎడమ కాలువ ద్వారా వర్షాకాలం నాటికి

అనకాపల్లికి గోదావరి జలాలు

బాహుదా వరకు తరలిస్తాం

శాసనసభలో సీఎం చంద్రబాబు వెల్లడి

ప్రధాని మోదీ, నిర్మలకు ధన్యవాదాలు

ఒక వ్యక్తి దుర్మార్గపు ఆలోచనలు రాష్ట్రానికి శాపమయ్యాయి. పోలవరం ప్రాజెక్టులో గత ప్రభుత్వం కేవలం 3.08 శాతం పనులే చేసి.. రూ.వేల కోట్ల నష్టాన్ని మిగిల్చింది.

గత ప్రభుత్వంలో జల వనరుల మంత్రికి డయాఫ్రం వాల్ అంటే తెలియదు. ప్రతి ప్రాజెక్టుకూ ఆ వాల్ కడతారట! టీఎంసీకి, క్యూసెక్కులకు మధ్య తేడా కూడా ఆయనకు తెలియదు.

\- సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు పూర్తయితే.. గేమ్ చేంజర్‌గా మారుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రాష్ట్రంలో కరువును నివారించవచ్చని చెప్పారు. సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం నిర్మాణంపై మంగళవారం అసెంబ్లీలో జరిగిన లఘు చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2027 జూలై నాటికి పోలవరం పూర్తి చేస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బొల్లాపల్లి వద్ద రిజర్వాయరు నిర్మించి..

మిగతా 12వ పేజీలో...

శారదా పీఠానికి జగన్ గురుదక్షిణ

రూ. 300 కోట్ల విలువైన భూమిని

కేవలం రూ. 15 లక్షలకే ఇచ్చేశారు

గత ప్రభుత్వం భూముల కేటాయింపుపై

మండలిలో మంత్రులు అనగాని, అచ్చెన్న ఫైర్

గురుదక్షిణ అనడం సరికాదు: బొత్స

నిబంధనలకు విరుద్ధం కాబట్టి

గురుదక్షిణే అంటారు: అచ్చెన్న

'రుషికొండ'పై మాటల మంటలు

మండలిలో మంత్రులు X బొత్స.. అబద్ధాల పునాదులపైనే ప్యాలెస్ నిర్మాణం

రిసార్ట్ మళ్లీ కడతామన్నారు.. సీఎం క్యాంపు అని జీవో తెచ్చారు.. చివరికి ప్యాలెస్ కట్టేశారు

ప్యాలెస్ కట్టిన రూ.480 కోట్లతో 26 వేల మంది పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వొచ్చు

బహిరంగ చర్చకు సిద్ధమా.. మంత్రులు దుర్గేశ్, అచ్చెన్న సవాల్.. అదేమన్నా ప్రైవేటు భవనమా?: బొత్స 13



కర్నూలు జిల్లా గూడూరు మండలం పెంచికలపాడు సీసీఐ కేంద్రం వద్ద బారులు తీరిన పత్తి లోడ్ వాహనాలు

'తేమ' పరీక్షల్లో పత్తి రైతు చిత్తు

యంత్రాల్లో తేడాతో పెరిగిపోతున్న తేమ శాతం

సర్వర్ సమస్యలతో రోజంతా రైతుల పడిగాపులు

తిరస్కరిస్తే వెనక్కి తీసుకెళ్లడం అదనపు భారం

సీసీఐ నిబంధనలతో దక్కని మద్దతు ధర

అధికారులు, పరిశ్రమల కుమ్మక్కుతోనే సమస్య?

కర్నూలు, గుంటూరు సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పత్తి అమ్మకాల్లో రైతులు చిత్తవుతున్నారు. తేమ శాతం, పింజ పొడవు, సర్వర్ సమస్యలతో సీసీఐ కేంద్రాలు రైతులకు చుక్కలు చూపిస్తున్నాయి. సీసీఐ నిబంధనలతో మద్దతు ధర దక్కక.. ప్రైవేటు పరిశ్రమలకు తీసుకెళ్లి వచ్చిన ధరకు రైతులు పత్తిని అమ్ముకుంటున్నారు. సీసీఐ

మిగతా 9వ పేజీలో...

రోడ్ల నిర్వహణ ప్రైవేటుకు



9

కాంట్రాక్టు కాలపరిమితిపై త్వరలో నిర్ణయం

రహదారులపై టోల్‌గేట్ల ఏర్పాటు ఉత్తదే

కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు

ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం



14

విచారణకు వర్మ డుమ్మా!

షూటింగ్ ఉందని గడువుకు విన్నపం

మళ్లీ నోటీసులకు పోలీసులు రెడీ

మరోసారి హైకోర్టుకు దర్శకుడు

ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్



వివేకా హత్య కేసులో..

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

శివశంకర్‌రెడ్డి, ఆయన కొడుక్కి కూడా

చైతన్యరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చిన ధర్మాసనం

తదుపరి విచారణ మార్చికి వాయిదా.. సునీత, రాజశేఖర్‌రెడ్డి, రాంసింగ్‌లపై ప్రైవేటు కేసులో ఎంపీ కృష్ణారెడ్డికి నోటీసులు

విచారణ ఫిబ్రవరి 24కి వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో వైసీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఆయన కొడుకు చైతన్యరెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తన తండ్రి హత్య కేసులో నిందితులైన అవినాశ్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డికి ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీతారెడ్డి గత నెల 14న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. ఈ కేసులో అప్రూవర్‌గా మారిన వ్యక్తి(షేక్ దస్తగిరి)ని ఏ-4 శివశంకర్‌రెడ్డి (ఏ-5) కొడుకు చైతన్యరెడ్డి జైలుకు వెళ్లి బెదిరించారని ధర్మాసనం దృష్టికి

మిగతా 14వ పేజీలో...

85 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్



పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రులు లోకేశ్, కేశవ్, అచ్చెన్న, నారాయణ, గొట్టిపాటి, భరత్ తదితరులు

రాష్ట్రంలో 10 భారీ పరిశ్రమల ఏర్పాటు.. 34 వేల మందికి పైగా ఉద్యోగ అవకాశం.. ఉద్యోగాల సంఖ్యను బట్టి ప్రోత్సాహకాలు 12

నక్కపల్లిలో ఆర్సెలర్ మిట్టల్-నిప్పాన్ స్టీల్స్.. జాయింట్ వెంచర్‌లో రూ.61,780 కోట్ల పెట్టుబడి.. ఎల్జీ ఎలక్ట్రానిక్స్, డల్లాస్ టెక్నాలజీలు కూడా

వీటికి ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు.. ఎస్ఐపీబీ సమావేశంలో ప్రభుత్వ నిర్ణయం.. భూములు ఇచ్చేందుకు 3 విధానాల ప్రతిపాదన

విశాఖలో న్యాయ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

14

ప్రేమ, పెళ్లి పేరుతో నమ్మించిన తోటి విద్యార్థి

స్నేహితుడి గదికి తీసుకువెళ్లి అఘాయిత్యం

పథకం ప్రకారం వీడియో తీసిన ముగ్గురు స్నేహితులు

ఆ వీడియోతో బెదిరించి సామూహిక అత్యాచారం

తరచూ కలవాలని బెదిరింపులతో బాధితురాలి ఆత్మహత్యాయత్నం.. దాంతో అకృత్యం వెలుగులోకి

పోలీసులకు ఫిర్యాదు.. నిందితుల అరెస్టు

ప్రపంచ యుద్ధం ముప్పు?

రష్యాపై ఉక్రెయిన్ దీర్ఘశ్రేణి క్షిపణి దాడులు

అమెరికా పంపిన అటాకమ్స్ క్షిపణుల ప్రయోగం

రష్యా భూభాగంలో దాడికి బైడెన్ అనుమతి

రష్యా మీద గగనతల దాడి చేస్తే అణు యుద్ధమే

ఉక్రెయిన్ దాడి చేసినా నాటో దాడిగానే పరిగణిస్తాం

కొత్త అణ్వాయుధ విధానం ప్రకటించిన పుతిన్

లెక్క చేయకుండా అదేరోజు దాడికి దిగిన ఉక్రెయిన్

ప్రపంచ యుద్ధం వస్తుందని నాటో దేశాల వణుకు

న్యూఢిల్లీ, నవంబరు 19: ఉక్రెయిన్, రష్యా యుద్ధం కీలక మలుపు తీసుకుంది. యుద్ధం మొదలై వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఉక్రెయిన్ మంగళవారం రష్యా మీద క్షిపణి దాడికి దిగింది. అమెరికా సరఫరా చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులను(అటాకమ్స్)ను రష్యా భూభాగం మీదకు ప్రయోగించింది. 300 కిలోమీటర్ల దూరం వరకు లక్ష్యాన్ని ఛేదించగల మొత్తం 6 క్షిపణులను ప్రయోగించగా, ఐదింటిని రష్యా మధ్యలోనే కూల్చేసింది. ఆరో క్షిపణిని కూడా మధ్యలోనే

మిగతా 2వ పేజీలో...



రష్యా దిశగా దూసుకెళ్తున్న ఉక్రెయిన్ క్షిపణులు

వెయ్యి రోజుల యుద్ధం.. కోటి తగ్గిన ఉక్రెయిన్ జనాభా

పసిడి రుణాలకూ ఈఎంఐ!

నెలవారీ వాయిదాల్లో అసలు, వడ్డీ చెల్లించొచ్చు

బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల సన్నాహాలు 10

రోడ్లపై రక్త చరిత్ర

2023లో గంటకు 20 మంది దుర్మరణం

ప్రమాదాలపై కేంద్ర రవాణా శాఖ నివేదిక

ఢిల్లీలో గంటకు సగటున 55 దుర్ఘటనలు 2

నేడే 'మహా' పోలింగ్

ఝార్ఖండ్‌లో తుది దశ, యూపీలో ఉప ఎన్నికలు

బెడిసి కొట్టిన ఈవో స్కెచ్

- మందడం గ్రూప్ ఆలయాల ఫిక్స్‌డ్ డిపాజిట్లు అర్ధంతరంగా విత్ డ్రా
- రూ. 4.20 కోట్లు కొట్టేయడానికి వ్యూహం
- వ్యక్తిగత ఖాతాకు బదిలీకి బ్యాంకు అధికారుల నో
- తప్పక మళ్లీ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన ఈవో

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాంతంలోని మందడం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ డబ్బు మళ్లించేయడానికి ఈవో స్కెచ్ వేశారు. కానీ ఎక్కడో బెడిసి కొట్టింది. అర్ధంతరంగా విత్ డ్రా చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను మళ్లీ బ్యాంకుల్లో డిపాజిట్ చేసి గుట్టు చప్పుడు కాకుండా కూర్చున్నారు. ఈ స్కామ్ ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. మందడం గ్రూప్ ఆఫ్ టెంపుల్స్‌లో సీఆర్‌డీఏ పరిధి లోని నెక్కల్లు, అనంతవరం గ్రామాల్లో మూడు ఆలయాలున్నాయి. వీటికి సంబంధించిన భూములను ప్రభుత్వం భూసేకరణ కింద తీసుకుంది. దాని కోసం ఆలయాలకు రూ.5కోట్లు చెల్లించింది. ఈ నిధులను అప్పటి ఈవో ఆలయాల పేరుతో ముందు రూ.1.5 కోట్లను, తర్వాత రూ.3.5 కోట్లను ఎఫ్‌డీలుగా వేశారు. ఈ రూ.3.5 కోట్ల ఎఫ్‌డీ ద్వారా వచ్చే వడ్డీని 3నెలలకు ఒకసారి డ్రా చేసుకుని, ఆలయాల నిర్వహణకు వినియోగించాలని నిర్ణయించారు. తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. అప్పుడే కొత్తగా వచ్చిన ఈవో సత్యనారాయణ రెడ్డి రూ.3.5 కోట్ల ఎఫ్‌డీని అర్ధంతరంగా విత్ డ్రా చేశారు. వడ్డీ సహా రూ.4.20 కోట్లు వచ్చింది. కొద్ది కాలానికే ఈ నిధులను మూడు ఆలయాల పేరుతో వేర్వేరుగా ఎఫ్‌డీలు వేసేశారు. అక్టోబర్‌లో ఆయన బదిలీపై వెళ్లిన తర్వాత విషయం బయటపడటంతో అధికారులు అలెర్ట్ అయ్యారు.

రూ. 8 లక్షలు వడ్డీ నష్టం..

అసలు ఎఫ్‌డీలు ఎందుకు విత్ డ్రా చేశారు. ఎందుకు మళ్లీ ఎఫ్‌డీ చేశారన్నదానిపై అనుమానాలు రేకెత్తాయి. ఆయన ఉద్దేశపూర్వకంగానే ఎఫ్‌డీలు విత్ డ్రా చేసి ఉంటారని, తన వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించేందుకు బ్యాంక్ అధికారులు అనుమతి ఇవ్వకపోడంతో మళ్లీ ఎఫ్‌డీలు చేసి ఉంటారని భావిస్తున్నారు. ఎఫ్‌డీ గడువు ముగియక ముందే విత్‌డ్రా చేయడం వల్ల దాదాపు రూ.8లక్షల వరకూ వడ్డీ నష్టం వచ్చిందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ వ్యవహారంపై ముగ్గురు సభ్యులతో గుంటూరు డీసీ విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ కమిటీ విచారణ చేస్తోంది.

ఎట్టకేలకు విద్యార్థులకు టెన్త్ సర్టిఫికెట్లు

- మంత్రి లోకేశ్ చొరవతో కదిలిన యంత్రాంగం

ఎర్రగొండపాలెం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు 3నెలలుగా సర్టిఫికెట్లు అందక పడుతున్న కష్టాలను సామాజిక మాధ్యమంలో ఓ వ్యక్తి చేసిన ఫిర్యాదుపై విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తక్షణమే స్పందించడంతో సమస్య పరిష్కారమైంది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడు గ్రామంలోని జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సెలవులో ఉండటంతో ఆ పాఠశాలలో పదోతరగతి ఉత్తీర్ణులైన 67 మంది విద్యార్థులు 3నెలలుగా టీసీ, మార్కుల మెమో, ఇతర సర్టిఫికెట్లు అందక ఇబ్బంది పడుతున్నారు. సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు రోజూ పాఠశాలకు వచ్చి, వెనుతిరిగి వెళ్తూ పడుతున్న బాధలను గ్రామానికి చెందిన యువకుడు వెగినాటి చైతన్య ఫొటోలు తీశారు. ఆ ఫొటోలను 'ఎక్స్'లో ఉంచి మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. మంత్రి స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబుకూ ఆ సమాచారాన్ని మంత్రి పంపారు. దీంతో విద్యాశాఖ అధికారులు, టీడీపీ నాయకులు పాఠశాలకు వెళ్లి సమస్యను పరిష్కరించారు. 43 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు, మార్క్స్ మెమోలు అందించినట్లు ఎంఈవో 2 మంగ్లీనాయక్ తెలిపారు. మిగిలిన విద్యార్థులకు సర్టిఫికెట్లు బుధవారం ఇస్తామన్నారు. సమస్యను పరిష్కరించినందుకు చైతన్య, విద్యార్థుల తల్లిదండ్రులు 'ఎక్స్'లో మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కేరళలో చిక్కుకుపోయిన అయ్యప్ప భక్తులు

- మంత్రి లోకేశ్ చొరవతో సమస్య పరిష్కారం

వెదురుకుప్పం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం గొడుగుచింతకు చెందిన 37మంది 15న బస్సులో శబరిమలకు బయల్దేరారు. కేరళలోని త్రిచూర్ జిల్లా కున్నంకులం వద్ద ముందు వెళుతున్న కారును వీరి బస్సు ఢీకొంది. కారు వెనుక భాగం దెబ్బతినడంతో బస్సులోని భక్తులను మంగళవారం ఉదయం సమీప పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి తమకు అయ్యప్ప దర్శన సమయమని చెప్పినా పట్టించుకోలేదు. దీంతో కిరణ్ నాయుడు అనే భక్తుడు తమ పరిస్థితిని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఈ విషయం తెలిసిన మంత్రి లోకేశ్ పోలీసులతో మాట్లాడి వారిని దర్శనానికి పంపించే ఏర్పాట్లు చేశారు. మంగళవారం సాయంత్రం వారంతా శబరిమలకు బయల్దేరారు. తమకు అందిన సాయంపై మరో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

మనవరాలిపై హత్యాచారం కేసు.. నిందితుడికి జీవిత ఖైదు

ఏలూరు క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రెండున్నరేళ్ల వయస్సు ఉండే మనవరాలిపై అత్యాచారం, ఆపై హత్య చేసి, సాక్ష్యాలు తారుమారు చేసిన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష పడింది. రూ.12వేల జరిమానా కూడా న్యాయస్థానం విధించింది. ఈ మేరకు ఏలూరు జిల్లాలోని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పోక్సో చట్టం ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.ఉమాసునంద మంగళవారం తీర్పు వెలువరించారు. బాధితురాలి కుటుంబానికి ప్రభుత్వం రూ.2లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గణపవరం మండలానికి చెందిన నిందితుడు.. 2017 మార్చి 29వ తేదీ రాత్రి ఇంటి ఆరుబయట మంచంపై పడుకుని ఉన్న రెండున్నర సంవత్సరాల మనవరాలిని ఎత్తుకుపోయి, దగ్గరలోని చెట్ల పొదల్లో అత్యాచారం చేశాడు. తర్వాత పక్కనే ఉన్న పంటబోదె బురదలో తొక్కి పాపను చంపేశాడు. ఆ తర్వాత ఏమీ ఎరగనట్లుగా కుటుంబసభ్యులతోనే కలిసే ఉన్నాడు. పోలీసు దర్యాప్తులో పాప తాతయ్యే హంతకుడని తేలడంతో ఆయన్ను అరెస్టు చేశారు.

టీఎం కృష్ణకు 'సంగీత కళానిధి' అవార్డుకు బ్రేక్

చెన్నై, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మద్రాసు మ్యూజిక్ అకాడమీ 2024 సంవత్సరానికిగాను ప్రముఖ గాత్ర విద్వాంసుడు టీఎం కృష్ణకు ఇవ్వదలచిన 'సంగీత కళానిధి' అవార్డుకు మద్రాస్ హైకోర్టు బ్రేక్ వేసింది. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మనవడు శ్రీనివాసన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు మంగళవారం ఈ మేరకు స్టే విధించింది. 2004లో ఎమ్మెస్ సుబ్బులక్ష్మి మరణానంతరం మద్రాసు మ్యూజిక్ అకాడమీ ప్రముఖ ఆంగ్ల పత్రిక నిర్వాహకులతో కలిసి ఆమె పేరుతో ఏటా ప్రతిభావంతులైన కర్నాటక సంగీత విద్వాంసులకు 'సంగీత కళానిధి' అవార్డును ప్రదానం చేస్తోంది. ఈ యేడాది ఈ అవార్డుకు టీఎం కృష్ణను ఎంపిక చేసింది. అయితే తన బామ్మ సుబ్బులక్ష్మి కీర్తిప్రతిష్ఠలకు భంగం కలిగించేలా గతంలో విమర్శలు చేసిన టీఎం కృష్ణకు ఆమె పేరుతో అవార్డు ఇవ్వకూడదని శ్రీనివాసన్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్రన్.. ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పేరుతో టీఎం కృష్ణకు అవార్డును ప్రదానం చేయడాన్ని నిలుపుదల చేశారు. టీఎం కృష్ణకు మరో పేరుతో అవార్డు ప్రదానం చేసుకోవచ్చని సూచించారు.

ప్రొఫెసర్ సాయిబాబా స్మృత్యర్థం ఏర్పాటైన ఫిల్మ్ ఫెస్టివల్‌ను అడ్డుకున్న ఆర్ఎస్ఎస్

జైపూర్, నవంబరు 19: ప్రొఫెసర్ సాయిబాబా, పాలస్తీనా చిన్నారుల స్మృత్యర్థం రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహించిన '9వ ఉదయ్‌పూర్ ఫిల్మ్ ఫెస్టివల్'ను ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు అడ్డుకున్నాయి. నగరంలోని రవీంద్రనాథ్ ఠాగూర్ మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో మూడు రోజుల చలన చిత్రోత్సవాన్ని జరపటానికి నిర్వాహకులు అన్ని అనుమతులు తీసుకొని శుక్రవారం ప్రారంభించారు. రెండోరోజైన శనివారం.. పలువురు సంఘ్ కార్యకర్తలు అక్కడికి వచ్చి.. సాయిబాబా మీద, పాలస్తీనా మీద చిత్రాలు ప్రదర్శించటం దేశ వ్యతిరేకమని, దేశ ప్రజల్ని క్షమాపణ కోరుతూ వీడియో విడుదల చేయాలంటూ వీరంగం వేశారు. ఫిల్మ్ ఫెస్టివల్‌ను బలవంతంగా అడ్డుకున్నారు. దీంతో చలనచిత్రోత్సవాన్ని నగరంలోనే మరో చోట ఏర్పాటు చేసిన ఓ తాత్కాలిక గుడారంలోకి మార్చుకొని కార్యక్రమాన్ని కొనసాగించారు.

ప్రపంచ యుద్ధం ముప్పు?

(మొదటి పేజీ తరువాయి)

పేల్చేసినప్పటికీ శకలాలు సైనిక శిబిరం మీద పడ్డాయని, అగ్నిప్రమాదం తప్ప ప్రాణనష్టమేమీ జరగలేదని రష్యా ప్రకటించింది. సరిహద్దుకు 115 కిలోమీటర్ల ఆవల ఉన్న రష్యా ఆయుధ డిపోను పేల్చేశామని ఉక్రెయిన్ ప్రకటించింది. రెండు నెలల్లో పదవి నుంచి దిగిపోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్‌లో మోహరించిన అటాకమ్స్‌ను రష్యా భూభాగం మీద ప్రయోగించేందుకు అనుమతి ఇస్తూ ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయం ఇప్పటికీ అధికారికంగా ప్రకటించనప్పటికీ ఆదివారమే విషయం బయటకు వచ్చింది. ఇప్పటిదాకా అటాకమ్స్‌ను ఉక్రెయిన్ భూభాగంలో ఉన్న రష్యా సైనికుల మీద ప్రయోగించడానికి ప్రయోగించడానికి మాత్రమే అమెరికా అనుమతి ఇచ్చింది. ఇప్పుడు ఏకంగా రష్యా భూభాగం మీద కూడా క్షిపణి దాడి చేయడానికి బైడెన్ అనుమతించారు. బైడెన్ చర్య మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీస్తుందనే ఆందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. కాబోయే అధ్యక్షుడు ట్రంప్ తనయుడు జూనియర్ ట్రంప్ కూడా ఇది మూడో ప్రపంచ యుద్ధాన్ని తీసుకొచ్చే చర్యేనని మండిపడ్డారు. రెండు నెలల్లో దిగిపోతున్న అమెరికా దేశాధ్యక్షుడు ప్రపంచ భద్రతనే ప్రమాదంలోకి నెట్టారని హంగేరీ విదేశాంగ మంత్రి ధ్వజమెత్తారు. బైడెన్ నిర్ణయం ఆదివారమే వెలువడినప్పటికీ రష్యా మంగళవారం స్పందించింది. ఉక్రెయిన్ యుద్ధం మొదలై వెయ్యి రోజులు పూర్తి అయిన సందర్భంగా తన అణ్వాయుధ ప్రయోగ విధానాన్ని సమీక్షిస్తూ కొత్త విధానాన్ని ప్రకటించింది. తన మీద విమానాలు, క్షిపణులు, డ్రోన్లు వేటితో గగనతల దాడులు చేసినా తన సార్వభౌమాధికారాన్ని సవాలు చేసినట్లుగానే భావిస్తామని చెప్పింది. కొత్త విధానం ప్రకారం అణ్వాయుధ శక్తి లేని (ఉక్రెయిన్ లాంటి) దేశం ఏదైనా అణ్వాయుధ సంపత్తి ఉన్న (అమెరికా లాంటి) దేశం సాయంతో దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా మీద ప్రయోగిస్తే దాన్ని రెండు దేశాలు కలిసి(ఉక్రెయిన్-అమెరికా) చేసిన దాడిగా పరిగణించాలని నిర్ణయించారు. ఉక్రెయిన్ రష్యా మీద కాని, దాని మిత్రదేశం బెలారస్ మీద కాని అణ్వాయుధాలతో కానీ సంప్రదాయ ఆయుధాలతో కానీ దీర్ఘ శ్రేణి క్షిపణలను ప్రయోగిస్తే రష్యా సార్వభౌమాధికారం మీద జరిగిన దాడిగా పరిగణిస్తారు. అప్పుడు అణ్వాయుధ ప్రయోగానికి సంబంధించి అన్ని అవకాశాలను పరిశీలించే అధికారం రష్యాకు ఉందని అందులో పేర్కొన్నారు. ఏదైనా కూటమిలో ఒక దేశం దాడి చేసినా మొత్తం కూటమి దాడి చేసినట్లుగా పరిగణిస్తామని చెప్పారు. అంటే, అమెరికా ప్రోద్బలంతో ఉక్రెయిన్ దాడి చేస్తే మొత్తం నాటో కూటమి యుద్ధం భయాన్ని చవిచూడాలన్న మాట. రష్యా ఇంతటి భీకర ప్రకటన చేసినప్పటికీ ఉక్రెయిన్ లెక్క చేయలేదు. అమెరికా ఇచ్చిన అనుమతితో రష్యా భూభాగం మీదకు క్షిపణులను ప్రయోగించింది. రష్యా కొత్త అణు విధానాన్ని ప్రకటించిన రోజే దాన్ని ఉక్రెయిన్ సవాలు చేయడం గమనార్హం.



పౌరులకు నాటో దేశాల హెచ్చరికలు

బైడెన్ అనుమతి, రష్యా హెచ్చరికల నేపథ్యంలో నాటోలో భాగంగా ఉన్న నార్వే, స్వీడన్, ఫిన్లాండ్, డెన్మార్క్ దేశాల్లో యుద్ధ భయాలు మొదలయ్యాయి. యుద్ధం తలెత్తితే ఏం చేయాలనే విషయమై తమ పౌరులను అప్రమత్తం చేయడం మొదలు పెట్టాయి. కొన్ని దేశాలు నివాస ప్రాంతాల్లో కరపత్రాలు చల్లుతుండగా, కొన్ని దేశాలు పౌరులకు నేరుగా ఈమెయిల్స్ పంపుతున్నాయి.మొత్తం జనాభా కోసం ఎప్పుడో భూగర్భ షెల్టర్లు నిర్మించిన స్వీడన్ మూడు రోజులకు సరిపడా రేషన్‌తో చెప్పినప్పుడు షెల్టర్లలో పోవడానికి సిద్ధంగా ఉండాలని పౌరులకు సమాచారం ఇచ్చింది.

ఉక్రెయిన్ జనాభా కోటి తగ్గిపోయింది

కీవ్, నవంబరు 19: ఉక్రెయిన్ రష్యా యుద్ధానికి వెయ్యి రోజులు పూర్తయ్యాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత యూరప్ ఎదుర్కొన్న అత్యంత తీవ్రమైన యుద్ధం ఇదే. ఈ యుద్ధంలో ఇరువైపులా పది లక్షల మంది చనిపోవడమో, తీవ్రంగా గాయపడటమో జరిగింది. 21వ శతాబ్దంలో ఇప్పటివరకు చవిచూసిన అత్యంత తీవ్రమైన యుద్ధం కూడా ఇదే. ఉక్రెయిన్‌లో నగరాలు, పట్టణాలు, గ్రామాలు నేలమట్టమై శిథిలాలుగా మిగిలాయి. ఉక్రెయిన్ సైన్యంలో 80 వేల మంది చనిపోయారు. నాలుగు లక్షల మంది గాయపడి కదలలేని పరిస్థితుల్లో ఉన్నారు. రష్యా వైపు సైన్యంలో మరణాలు రెండు లక్షల వరకు ఉంటాయని అంచనా. క్షతగాత్రులు నాలుగు లక్షల వరకు ఉంటారు. నిజానికి రెండు దేశాల్లోనూ యుద్ధం లేని సమయంలోనే జనాభా తరుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారు. యుద్ధంతో పరిస్థితి మరింత ఘోరంగా తయారైంది. ఉక్రెయిన్‌లో ప్రజలు 12 వేల మంది చనిపోయారు. 25 వేల మంది గాయపడ్డారు. యుద్ధం మొదలైన తర్వాత ఉక్రెయిన్‌లో పిల్లల్ని కనేవారు మరింత తగ్గిపోయారు. రెండున్నరేళ్ల క్రితం ఉన్న జననాల రేటు మూడోవంతు పడిపోయింది. యుద్ధాల వల్ల కాకుండా సహజ మరణాలు, వలసలు, జననాల రేటు తగ్గిపోవడం కారణంగా ఉక్రెయిన్‌లో గత రెండున్నర ఏళ్లలో కోటి మంది జనాభా తగ్గిపోయారు. నాలుగు కోట్ల మంది ఉన్న జనాభా మూడు కోట్లు అయ్యారు. ఏకంగా 67 లక్షల మంది వలస వెళ్లారు. ఉక్రెయిన్ ఆర్థిక వ్యవస్థ మూడోవంతు కుంచించుకుపోయింది. ఆస్తి నష్టం 13 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా.



కల్కి ఆలయం, కల్వరి టెంపుల్ వివరాలు ఇవ్వండి

- అధికారులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ చట్ట నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన కల్కి దేవాలయం, కల్వరి టెంపుల్‌లను మూసివేయాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాలలో పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఆ వ్యాజ్యాలలో ప్రతివాదులకు నోటీసుల జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి జిల్లా, వరదయ్యపాళెం మండలం, బాతలవాల్లం గ్రామ పంచాయతీ పరిధిలో స్థానిక పంచాయతీ అనుమతి లేకుండా కల్కి దేవాలయాన్ని నిర్మించారని పేర్కొంటూ అదే గ్రామానికి చెందిన ముని చంద్రశేఖర్, మరో 6 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కల్కి దేవాలయాన్ని మూసివేయాలని కోరారు. ఈ వ్యాజ్యం మంగళవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున న్యాయవాది జడ శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. ఈ వ్యాజ్యంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రతివాదులకు కోర్టు నోటీసులు జారీచేసింది.

కల్వరి టెంపుల్‌కు అనుమతుల్లేవు

అలాగే గుంటూరు జిల్లా, నంబూరులో ఎలాంటి అనుమతులు లేకుండా కల్వరి టెంపుల్‌ను నిర్మించారని పేర్కొంటూ విజయవాడకు చెందిన పి.సురేష్‌కుమార్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పంచాయతీ అనుమతి లేకుండా నిర్మించిన కల్వరి టెంపుల్‌ను మూసివేయాలని, ఈ మేరకు అధికారులను ఆదేశించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. వ్యాజ్యంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

అమెరికాకు మన విద్యార్థులు ఇచ్చింది.. అక్షరాలా రూ.లక్ష కోట్లు!

- అగ్రరాజ్యంలో 3.31 లక్షల మంది భారతీయుల విద్యాభ్యాసం
- 15 ఏళ్ల తర్వాత చైనాను దాటి నెంబర్‌వన్ స్థానంలో మనం

వాషింగ్టన్, నవంబరు 19: గతేడాది అమెరికా ఆర్థిక వ్యవస్థకు భారతీయ విద్యార్థులు 1,180 కోట్ల డాలర్లు అందించారు. ఇది దాదాపు రూ.లక్ష కోట్లకు సమానం. కచ్చితంగా చెప్పాలంటే రూ.99,581 కోట్లు. అమెరికాలో చదువుకుంటున్న విదేశీ విద్యార్థుల్లో భారతీయులే అత్యధికం. వారి సంఖ్య 3,31,692. గతేడాది కంటే ఇది 23% అధికం. సంఖ్యాపరంగా చైనాను (ఆ దేశ విద్యార్థులు 2.7 లక్షలు) కూడా ఈసారి మనం అధిగమించాం. గతంలో అమెరికాలో విదేశీ విద్యార్థుల పరంగా భారత్ నెంబర్‌వన్ స్థానంలో ఉండేది. కానీ, చైనా ఆ స్థానాన్ని కైవసం చేసుకుంది. 15 ఏళ్ల తర్వాత తిరిగి భారత్ అగ్రస్థానంలో నిలిచింది. 2023-24 విద్యాసంవత్సరానికి సంబంధించి విడుదలైన ఓపెన్‌డోర్స్ నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. అమెరికాలోని 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్' అనే సంస్థ ప్రభుత్వ సహకారంతో సర్వే జరిపి ఈ నివేదికను విడుదల చేస్తుంది. తాజాగా వచ్చిన నివేదిక ప్రకారం, ఉన్నత విద్యాభ్యాసం కోసం అమెరికాకు వచ్చిన భారతీయ విద్యార్థుల్లో 64.5% మంది ప్రభుత్వ విద్యాసంస్థల్లో చేరారు. ఇక సబ్జెక్టుల వారీగా చూస్తే.. ఐటీ తదితర ఇంజనీరింగ్ కోర్సుల్లో 67.4% మంది, బిజినెస్ మేనేజిమెంట్‌లో 11.2% మంది, సైన్స్ కోర్సుల్లో 5.4% మంది విద్యనభ్యసిస్తున్నారు. భారత విద్యార్థుల సంఖ్య గతేడాదితో పోల్చితే 23% పెరగగా, చైనా విద్యార్థుల సంఖ్య 4% తగ్గటం విశేషం. మరోవైపు, 2023లో అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థుల్లో 6% మంది (11 లక్షల మందికిపైగా) విదేశాల నుంచి వచ్చిన వారు. వీరంతా కలిసి ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు 5 వేల కోట్ల డాలర్ల (రూ.4,21,953 కోట్లు) భారీ మొత్తాన్ని అందజేశారు. అమెరికాలో విదేశీ విద్యార్థులు చదువుకుంటున్న టాప్-3 రాష్ట్రాల్లో కాలిఫోర్నియా, న్యూయార్క్, టెక్సాస్ ఉన్నాయి. కాగా, బ్రిటన్‌లోని విదేశీ విద్యార్థుల్లో 1.7 లక్షల మందితో భారతీయులే నెంబర్‌వన్ స్థానంలో ఉన్నారు.

25 నుంచి పార్లమెంటు

- డిసెంబరు 20 దాకా సమావేశాలు
- 'ఒక దేశం-ఒకే ఎన్నిక', వక్ఫ్ బిల్లులే కీలకం

న్యూఢిల్లీ, నవంబరు 19: పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈ నెల 25న ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 20 వరకు జరుగనున్నాయి. వక్ఫ్ సవరణ బిల్లు, 'ఒక దేశం-ఒకే ఎన్నిక బిల్లులను ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది. వీటిని కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ నెల 23న మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్‌డీఏ, ఇండీ కూటమి ప్రతిష్ఠాత్మకంగా తలపడుతున్నాయి. మహారాష్ట్రలో ఎన్‌డీఏ పక్షాల ఆధ్వర్యంలో మహాయుతి ప్రభుత్వం నడుస్తుండగా.. జార్ఖండ్‌లో జేఎంఎం, కాంగ్రెస్ ప్రధాన పక్షాలుగా ఇండీ కూటమి అధికారంలో ఉంది. జార్ఖండ్‌లో ఎలాగైనా పాగా వేయాలని బీజేపీ భావిస్తుండగా.. మహారాష్ట్రలో తమ గెలుపు ఖాయమని కాంగ్రెస్, ఎన్‌సీపీ, ఉద్ధవ్ శివసేన ధీమాతో ఉన్నాయి. ఎవరు గెలుస్తారో 23న తేలనున్న నేపథ్యంలో శీతాకాల సమావేశాలకు ప్రాధాన్యం ఏర్పడింది. 24వ తేదీ ఆదివారం 11 గంటలకు పార్లమెంటు భవనంలో అఖిల పక్ష సమావేశం జరగనుంది. ఈ విషయాన్ని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించారు. స్వతంత్ర భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లయిన సందర్భంగా ఈ నెల 26వ తేదీన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. సంవిధాన్ సదన్‌లోని సెంట్రల్ హాలులో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు.

రహదారుల రక్త చరిత్ర!

గంటకు 20 మంది దుర్మరణం

- 2023లో రోడ్డు ప్రమాదాలపై కేంద్ర రవాణాశాఖ నివేదిక



న్యూఢిల్లీ, నవంబరు 19: దేశవ్యాప్తంగా రహదారులు రక్తమోడుతున్నాయని కేంద్ర రోడ్డు రవాణా శాఖ ఆందోళన వ్యక్తం చేసింది. రోడ్డు ప్రమాదాల కారణంగా గంటకు 20 మంది ప్రాణాలు కోల్పోతున్నట్లు తెలిపింది. ఈ మేరకు 2023 సంవత్సరంలో దేశవ్యాప్తంగా జరిగిన రోడ్డు ప్రమాదాలపై తాజాగా ఓ నివేదికను వెలువరించింది. దీని ప్రకారం గత ఏడాది 4,80,583 రోడ్డు ప్రమాదాలు జరిగినట్లు తెలిపింది. 2022 సంవత్సరంతో పోల్చుకుంటే 2023లో 4.2 శాతం మేరకు ప్రమాదాలు పెరిగాయని వివరించింది. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీ రహదారులు మృత్యు మార్గాలుగా మారాయని కేంద్రం ఆవేదన వ్యక్తం చేసింది. ఢిల్లీలో సగటున గంటకు 55 చొప్పున వాహనాలు ఢీ కొంటున్నాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన నగరాలలో జరుగుతున్న ప్రమాదాల విషయానికి వస్తే ఢిల్లీలో అత్యధికంగా 1,457 మంది రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రాణాలు కోల్పోయారు. ఇక, దేశంలో రోజుకు 26 మంది చిన్నారులు ప్రమాదాల్లో జీవితాలను కోల్పోతున్నారు. గత ఏడాది 9,489 మంది ప్రాణాలు కోల్పోయారు.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- 2023లో రోడ్డు ప్రమాదాల కారణంగా 1,72,890 మంది చనిపపోయారు. 4,62,825మంది గాయపడ్డారు.
- 2022తో పోల్చుకుంటే మృతులు 2.6 శాతం, గాయాలపాలైన వారు 4.4 శాతం చొప్పున పెరిగారు.
- రాష్ట్రాల పరంగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో 23,652 మంది, తమిళనాడులో 18,347 మంది, మహారాష్ట్రలో 15,366 మంది రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు. ప్రధాన నగరాల్లో చూస్తే ఢిల్లీలో 1,457 మంది చనిపోగా, తర్వాత స్థానాల్లో బెంగళూరు(915 మంది), జైపూర్(849 మంది) ఉన్నాయి.
- రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న రాష్ట్రాల్లో తమిళనాడు తొలిస్థానంలో ఉంది. ఈ రాష్ట్రంలో 2023లో 67,213 ప్రమాదాలు జరిగాయి.
- మితిమీరిన వేగం కారణంగా 68.1 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో ద్విచక్ర వాహనదారులే దాదాపు సగం మంది ఉన్నారు. మొత్తం మృతుల్లో వీరు 44.8 శాతం మంది ఉన్నారు.
- రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్న వారిలో పాదచారులు 20% మంది ఉన్నారు.
- రహదారుల లోపం కారణంగా 4.9 శాతం మంది, వాహనాలు ఢీ కొనడం ద్వారా 59.3 శాతం మంది ప్రాణాలు కోల్పోతున్నారు.
- రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్న వారిలో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వారే ఎక్కువగా ఉంటున్నారు. వీరిలో పురుషులే ఎక్కువగా ఉంటున్నారని నివేదిక వెల్లడించింది.
- రహదారులపై మృతి చెందుతున్న వారిలో పురుషుల సంఖ్య 85.2 శాతంగా ఉండగా, మహిళల సంఖ్య 14.8 శాతంగా ఉంది.
- రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారిలో గ్రామీణులు 68.4 శాతం మంది ఉండగా, పట్టణ ప్రాంతాలకు చెందిన వారు 31.5 శాతం మంది ఉన్నారు.
- ప్రపంచ రహదారుల గణాంకాలు-2020 ప్రకారం రోడ్డు ప్రమాదాల్లో భారత్ తొలిస్థానంలో ఉంది.

నేడే 'మహా' పోలింగ్

న్యూఢిల్లీ, నవంబరు 19: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. శాసనసభలోని మొత్తం 288 స్థానాలకు బుధవారం పోలింగ్ జరగనుంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. నవంబరు 23, శనివారం ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 9,70,25,119 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. కాగా, శివసేన(ఉద్ధవ్ ఠాక్రే వర్గం), ఎన్‌సీపీ(శరద్ పవార్ వర్గం), కాంగ్రెస్ పార్టీ కలిసి మహావికాస్ అఘాడీ పేరుతో ఈ ఎన్నికల్లో పోటీ చేస్తోంది. అలాగే, శివసేన(ఏక్‌నాథ్‌శిండే), ఎన్‌సీపీ(అజిత్‌పవార్), బీజేపీ కలిసి మహాయుతి పేరుతో పోటీ చేస్తున్నాయి. 149 నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థులు పోటీలో ఉండగా 101 స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పోటీలో ఉన్నారు. శివసేన(ఉద్ధవ్ ఠాక్రే వర్గం) 95, ఎన్‌సీపీ(శరద్ పవార్ వర్గం) 86, శివసేన(ఏక్‌నాథ్‌శిండే) 81, ఎన్‌సీపీ(అజిత్‌పవార్) 59 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఇది కాక, బీఎస్పీ 237 స్థానాల్లో పోటీ చేస్తుండగా ఎంఐఎం 17 స్థానాల్లో పోటీ పడుతోంది. మొత్తంగా 4,136 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. ఒక్క ముంబైలోనే 30వేల మందికిపైగా పోలీసులు ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు.

ఝార్ఖండ్‌లో తుది దశ పోలింగ్

ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి రెండో, తుది దశ ఎన్నికల పోలింగ్ బుధవారం జరగనుంది. 38 శాసనసభ స్థానాలకు బుధవారం ఓటింగ్ నిర్వహించి నవంబరు 23న ఓట్లు లెక్కిస్తారు. 1.23 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కాగా, ఝార్ఖండ్‌లోని 43 స్థానాలకు సంబంధించిన పోలింగ్(తొలి దశ ఎన్నికలు) నవంబరు 13న జరిగింది. మరోవైపు, బీజేపీ, శివసేన ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న యూపీలోని 9 శాసనసభ స్థానాల ఉపఎన్నికకు పోలింగ్ కూడా బుధవారమే జరగనుంది. 23న ఓట్లను లెక్కిస్తారు. కాంగ్రెస్ ఈ పోటీకి దూరంగా ఉంది.

ఈడ వేసినం.. ఆడా ఓటేస్తం!

ఆసిఫాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈడ ఓటు వేసినం.. ఆడా ఎన్నికల్లోనూ ఓటేస్తం... మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు వివాదంలో ఉన్న 12 గ్రామాల్లోని ఓటర్ల ఉత్సాహమిది. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలోని 12 గ్రామాలు.. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా రాజురా నియోజకవర్గం జీవతి తాలూకా పరిధిలో కూడా ఉన్నాయి. ఈ 12 గ్రామాల్లోని ఓటర్ల కోసం మహారాష్ట్ర ఎన్నికల సంఘం పరందోళి, అంతాపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అంతాపూర్‌లో 1,612 మంది, పరందోళి పోలింగ్ కేంద్రంలో 1,422 మంది ఓటు వేయనున్నారు.

కెనడాలో విద్యార్థుల పని గంటలు 24కి పెంపు

న్యూఢిల్లీ, నవంబరు 19: తమ దేశంలో ఉండి చదువుకునే విదేశీ విద్యార్థుల పని గంటల విషయంలో కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్‌తోపాటు ఇతర విదేశీ విద్యార్థులకు క్యాంపస్ వెలుపల వారంలో 20 గంటలు పనిచేసుకునే వెసులుబాటు ఉండేది. అయితే ఈ నెల 8వ తేదీ నుంచి దీన్ని 24 గంటలకు పెంచుతున్నట్లు కెనడా ప్రకటించింది. ఇది ఆ దేశంలో ఉండి చదువుకునే విద్యార్థులకు మేలు చేయనుంది. వారు తమ చదువులు కొనసాగిస్తూనే మరింత ఎక్కువ సమయం పనిచేసేందుకు అవకాశం ఉంటుంది. అలాగే పని గంటలు పెరిగితే విద్యార్థుల చదువుపై ప్రభావం చూపొచ్చనే ఆందోళన కూడా వ్యక్తమవుతోంది.

ఢిల్లీ డేంజర్

- 500 దాటిన గాలి నాణ్యత
- ప్రపంచంలోనే కాలుష్య నగరంగా దేశ రాజధాని

న్యూఢిల్లీ/లఖ్‌నవూ, నవంబరు 19: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. విజిబులిటీ స్థాయులు దారుణంగా పడిపోతున్నాయి. గాలి నాణ్యత(ఏక్యూఐ) కూడా కొన్ని చోట్ల 500 మార్కును దాటింది. సగటు గాలి నాణ్యత 494గా ఉంది. ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరంగా ఢిల్లీ రికార్డుకెక్కింది. ఎంతలా అంటే.. రెండో స్థానంలో ఉన్న బంగ్లాదేశ్ రాజధాని ఢాకాతో పోలిస్తే.. ఢిల్లీలో 4 రెట్ల అధిక కాలుష్యం కొనసాగుతోంది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఎక్స్‌లో తీవ్రంగా స్పందించారు. "ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేశ రాజధానిగా ఢిల్లీ కొనసాగాల్సిన వసరం ఉందా?" అని ప్రశ్నించారు. "ఈ విపత్కర పరిస్థితిని కొన్నేళ్లుగా చూస్తున్నాం. నవంబరు-జనవరి నెలల మధ్య అసలు ఈ నగరం నివాసయోగ్యంగానే ఉండడం లేదు. మిగతా సమయాల్లోనూ జీవనం కొనసాగించడం అంతంతమాత్రమే..! ఈ పరిణామాల మధ్య ఢిల్లీని ఇంకా రాజధానిగా కొనసాగించాలా?" అంటూ ట్వీట్ చేశారు. కాగా.. వాయుకాలుష్య తీవ్రత, విజిబులిటీ దారుణంగా ఉండడంతో ఢిల్లీలో 22 రైళ్లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. గాలి నాణ్యత పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోనూ దారుణంగా తయారైంది. మంగళవారం ఉదయం నోయిడాలో ఈస్టర్న్-పెరిఫెరల్ ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. డజన్ల కొద్దీ వాహనదారులు గాయపడ్డారు. పానిపట్ నుంచి మథుర వెళ్తున్న ఓ బస్సు.. రోడ్డు పక్కన పార్క్ చేసిన ట్రక్కులను ఢీకొన్న ఘటనలో పలువురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. మరోవైపు.. మధ్యప్రదేశ్, ఢిల్లీ, హరియాణా, యూపీ, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలకు భారత వాతావరణ శాఖ పొగమంచు హెచ్చరికలను జారీ చేసింది. హరియాణాలో గాలి నాణ్యత పడిపోవడంతో.. బడులు మూసివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, రాజస్థాన్‌లో చలి తీవ్రత పెరిగింది. సికార్‌లోని ఫతేపూర్‌లో కనిష్ఠ ఉష్ణోగ్రత 6.5 డిగ్రీలుగా నమోదయ్యాయి.



22 నుంచి హాయ్ లైఫ్ ఆభరణాల ప్రదర్శన

విజయవాడ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హాయ్‌లైఫ్ ఆభరణాల ప్రదర్శనను ఈనెల 22, 23, 24 తేదీల్లో విజయవాడలోని నోవాటెల్ విజయవాడ వరుణ్ హోటల్‌లో నిర్వహించనున్నట్టు హాయ్ లైఫ్ జ్యూవెల్స్ సంస్థ ప్రతినిధి అశోక్ గచండే మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా టాప్ జ్యూవెలర్స్ రూపొందించిన ఆభరణాలను ప్రదర్శన, అమ్మకానికి ఉంచనున్నట్టు పేర్కొన్నారు. వివాహాది శుభకార్యాలకు, రోజువారీగా ధరించేందుకూ ఆభరణాలను ఆకర్షణీయంగా రూపొందించినట్టు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సత్యసాయి ఆధ్యాత్మిక విద్య అందరికీ ఆదర్శం

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నంద
- పుట్టపర్తిలో ఘనంగా మహిళా దినోత్సవం



సత్యసాయి మహా సమాధి వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జస్టిస్ నంద

పుట్టపర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి సంస్థలు అందిస్తున్న ఆధ్యాత్మిక విద్యా విధానం అందరికీ ఆదర్శమని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యపల్లి నంద అన్నారు. మహిళలు సామాజిక, ఆధ్యాత్మిక భావాలతో ఉన్నత స్థానాలను అధిష్ఠిస్తున్నారని ఆమె అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సాయి కుల్వంత్ మందిరంలో సత్యసాయి జయంతి వేడుకల్లో రెండో రోజు మంగళవారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి విద్యాసంస్థల అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థులు వేద పారాయణ, మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి.. సాయి కుల్వంత్‌కు చేరుకున్నారు. అనంతరం జస్టిస్ నంద జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. 1995 నవంబరు 19న మొదటిసారి భగవాన్ సత్యసాయి మహిళా దినోత్సవాన్ని ప్రారంభించారని తెలిపారు. ఆధ్యాత్మిక, బాలవికాస్ విద్యా సంస్థల్లో వేలాది మంది మహిళలు బోధకులుగా తమ వంతు సేవలు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. నేటి సమాజంలో మహిళలు ఆర్థిక, సామాజిక రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధంచారని న్యాయమూర్తి తెలిపారు.

రేపు శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా విడుదల

తిరుమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆర్జితసేవా టికెట్ల ఫిబ్రవరి నెల కోటాను టీటీడీ గురువారం విడుదల చేయనుంది. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవ టికెట్లను గురువారం ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్ ద్వారా విడుదల చేయనున్నారు. కాగా, మరికొన్ని ఆర్జితసేవా టికెట్లకు సంబంధించి ఎలక్ట్రానిక్ డిప్ కోటాను టీటీడీ ఇప్పటికే ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. వీటిని భక్తులు బుధవారం ఉదయం 10 గంటల వరకు నమోదు చేసుకోవచ్చు. ఇక, అంగ ప్రదక్షిణ టికెట్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్న వారి కోసం ప్రత్యేక దర్శన టోకెన్లు విడుదల చేయనున్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను విడుదల చేయనున్నారు.

పెద్ద దర్గాను దర్శించుకున్న వైఎస్ షర్మిల



కడప పెద్ద దర్గా విశిష్టతను షర్మిలకు వివరిస్తున్న దర్గా ప్రతినిధులు

కడప కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంగళవారం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులమతాలకతీతంగా రాష్ట్ర ప్రజలంతా సుఖ, శాంతులతో ఉండాలని ప్రార్థించానని తెలిపారు. ప్రజల మధ్య సోదరభావాన్ని, సఖ్యతను పెంపొందించడంలో ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మానవ సేవే మాధవ సేవ అనే రీతిగా దర్గాలో పేదల కోసం చేపట్టే ఉచిత వైద్యసేవలు, ఉచిత భోజన వసతి, సేవలను కొనియాడారు.

శబరిమలకు 18 ప్రత్యేక రైళ్లు

- డిసెంబరు 6 నుంచి జనవరి 1 వరకు అందుబాటులోకి
- నేటి నుంచి అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శబరిమల అయ్యప్పను దర్శించుకునే భక్తుల కోసం 18 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే ప్రకటించింది. డిసెంబరు 6వ తేదీ నుంచి జనవరి 1 వరకు ఈ రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. హైదరాబాద్(మౌలాలి) నుంచి కొల్లాంకు డిసెంబరు 6, 13, 20, 27 తేదీల్లో, మచిలీపట్నం నుంచి కొల్లాంకు డిసెంబరు 2, 9, 16, 23, 30 తేదీల్లో ప్రత్యేకరైళ్లు నడుస్తాయని వెల్లడించారు. అలాగే తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి మౌలాలికి డిసెంబరు 8, 15, 22, 29 తేదీల్లో, కొల్లాం నుంచి మచిలీపట్నంకు డిసెంబరు 4, 11, 18, 25, జనవరి ఒకటవ తేదీల్లో ప్రత్యేక రైళ్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ రైళ్లకు అడ్వాన్స్ బుకింగ్ బుధవారం ఉదయం 8 గంటల నుంచి ప్రారంభమవుతుంది.



కాకినాడలో క్రియ పిల్లల పండుగ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కాకినాడ జేఎన్‌టీయూలో వచ్చే నెల 28, 29న క్రియ పిల్లల పండుగ

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిసెంబరు 28, 29 తేదీల్లో కాకినాడ జేఎన్టీయూలో క్రియ పిల్లల పండుగ నిర్వహించనున్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఈ మేరకు పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. దీనిలో 11వ రాష్ట్రస్థాయి అంతర పాఠశాలలల సాంస్కృతిక పోటీలు జరుగుతాయి. విద్యార్థులకు నాటికలు, శాస్త్రీయ నృత్యం, కోలాటం, పాటలు, పోస్టర్ ప్రజెంటేషన్, కథా రచన, చిత్రలేఖనం, బుర్రకథ, జానపద నృత్యం, విచిత్ర వేషధారణ, కథ చెప్పడం, వాద్య సంగీతం తదితర పోటీలు నిర్వహిస్తారు. 400 పాఠశాలల నుంచి సుమారు 12వేల మంది విద్యార్థులు పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూక్రియఆన్‌లైన్.ఓఆర్‌జీ ద్వారా స్కూల్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వామపక్షాల ధర్నా



విద్యుత్ చార్జీలు తగ్గించాలని విజయవాడలో ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

విజయవాడ(ధర్నాచౌక్), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించేంత వరకు తమ పోరాటం చేస్తామని వామపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. ప్రధాని మోదీకి లొంగి ప్రజలపై భారం మోపుతున్నారని మండిపడ్డాయి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో సర్దుబాటు చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ పది వామపక్షాల ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ మాజీ సీఎం జగన్, ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రధాని మోదీకి లొంగి ఆదానీతో లాలూచీ పడి ప్రజలపై భారం వేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటికే రూ. 6 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని విమర్శించారు. మరో రూ.11,820 కోట్ల భారం వేసేందుకు విద్యుత్ నియంత్రణ మండలి అభ్యంతరాలు తెలియజేయాలని కోరగా వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, వర్తక, వాణిజ్య సంఘాలు అభ్యంతరాలు తెలియజేశాయన్నారు.



గుంటూరు జిల్లా మందపాడు పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

రెండేళ్లుగా బిల్లులు ఇవ్వట్లేదు!

- రాష్ట్రంలో 153 పీహెచ్‌సీలు కట్టాం
- రూ.130 కోట్ల బకాయిలు చెల్లించాలి
- ఆరోగ్య కేంద్రాల వద్ద కాంట్రాక్టర్ల ఆందోళన

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా 153 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నిర్మించిన తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ స్టేట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ బిల్డింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఏబీసీఏ) ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు మంగళవారం రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపట్టారు. కాంట్రాక్టర్లు తాము నిర్మించిన పీహెచ్‌సీల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఆందోళన చేశారు. కొవిడ్ సమయంలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా పీహెచ్‌సీల నిర్మాణం చేపట్టామని, రెండేళ్లు గడిచిపోతున్నా తమకు మాత్రం బిల్లులు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చాలా మంది అప్పులు చేసి పనులు చేశారని, వారంతా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాంట్రాక్టర్లు వాపోయారు. 153 పీహెచ్‌సీలను కొత్తగా నిర్మించామని, మరో 956 పీహెచ్‌సీలకు మరమ్మతులు చేశామని పేర్కొన్నారు. వీటికి సంబంధించి సుమారు రూ.130 కోట్లు వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. మరో 88 పీహెచ్‌సీలు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటికి కూడా బిల్లులు చెల్లించడం లేదని, ఎన్నిసార్లు అధికారులను కలిసి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాంట్రాక్టర్లు వాపోయారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తమ బాధను అర్థం చేసుకుని సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

ఆన్ డ్యూటీగా సమ్మె కాలం

- ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వైద్యులు

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గతంలో తాము చేసిన పది రోజుల సమ్మె కాలాన్ని డ్యూటీ పీరియడ్‌గా పరిగణిస్తూ ప్రభుత్వం జీతాలు విడుదల చేయడంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సచివాలయానికి వచ్చిన వైద్యుల సంఘం నేతలు డా.ఎం.వినోద్, డా.కె.రాహుల్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మార్పు కోసం...

శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిస్సనాయకే సోమవారం కొత్తమంత్రివర్గాన్ని నియమించారు. ప్రధానిగా హరిణి అమరసూర్యను కొనసాగించి, రక్షణ, ఆర్థికం వంటి కొన్ని కీలకమైన శాఖలు తన వద్దే ఉంచుకున్నారు. ఇరవైఒక్కమందితో కూడిన చిన్న మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయడమంటే, ఖర్చులు తగ్గిస్తానని ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమే నని, ముప్పైమంది మంత్రులతో దేశాన్ని ఏలగలిగే అవకాశం ఉండికూడా, ఆయన ఈ సంఖ్యకే పరిమితం కావడం లంక ఆర్థికస్థితిపట్ల ఆయనకున్న భయాన్ని తెలియచేస్తోందని ఆయన పార్టీ జేవీపీ చెప్పుకుంటోంది. మంత్రివర్గంలో కొత్తమొఖాలు అనేకం. ముఖ్యంగా ఐదుగురు ప్రొఫెసర్లకు పదవులు దక్కడం విశేషం. మత్స్యశాఖమంత్రి రామలింగం తమిళంలో ప్రమాణస్వీకారం చేసి, అధ్యక్షులవారు మైనారిటీలకూ సముచిత ప్రాతినిధ్యం కల్పించారని గుర్తుచేశారు. మహిళాశిశు సంక్షేమశాఖ కూడా తమిళ మూలాలున్న ఓ మహిళకు దక్కింది. అనురకుమారను తమ అధ్యక్షుడుగా ఇటీవలే ఎన్నుకున్న శ్రీలంక ప్రజలు రెండునెలల్లోనే జరిగిన పార్లమెంటరీ ఎన్నికల్లో సైతం తిరుగులేని మెజారిటీని కట్టబెట్టిన విషయం తెలిసిందే.

పతనావస్థలో ఉన్న దేశాన్ని దిస్సనాయకే తిరిగి నిలబెట్టగలడన్న నమ్మకం ప్రజల్లో ఉంది. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) అలయెన్స్‌కు జనం తిరుగులేని బలాన్ని ఇచ్చారు. కేవలం ముగ్గురు ఎంపీలున్న ఆయన ఇప్పుడు మూడువంతులు దాటిన మెజారిటీతో దేశాన్ని ఏలబోతున్నారు. 220 స్థానాలున్న సభలో ఆయన కూటమికి 160 కట్టబెట్టి, ప్రజలు అవధులు లేని అధికారాలు ఇచ్చారు. ప్రస్తుత ఎన్నికల విధానాన్ని రూపొందించుకున్న 1978 తరువాత, ఒక సంకీర్ణం ఇంతటి ఘనంగా నెగ్గుకురావడం ఎన్నడూ లేదు. మతాలు, జాతుల పరంగా చీలిపోయి, ముస్లింలు, తమిళులు, సింహళీయుల మధ్య అవిశ్వాసం అధికంగా ఉండే లంక సమాజం ఈ ఎన్నికల్లో అద్భుతమైన ఐక్యతను ప్రదర్శించింది. అటు తమిళులు, ఇటు ముస్లింలు కూడా దిస్సనాయకే నాయకత్వం వహిస్తున్న ఒక సింహళపార్టీని, దాని కూటమిని ఇంతగా నమ్మడం ఆశ్చర్యం. అన్ని రకాల వివక్షలనూ, విభేదాలను పక్కనబెట్టి దేశప్రజలంతా ఒక్కటై తనకు బ్రహ్మరథం పడతారని దిస్సనాయకే కూడా ఊహించి వుండరు. తమిళుల కంచుకోటలను సైతం ఆయన బద్దలు కొట్టి, సంప్రదాయ తమిళపార్టీలను మట్టికరిపించిన తొలి సింహళపార్టీగా చరిత్ర సృష్టించారు.

లంక తమిళులు దిస్సనాయకేను ఇంతగా విశ్వసిస్తుంటే, వైగో మాత్రం ఈ పరిణామం వారికి తీవ్రమైన నష్టంచేస్తుందని, భారతప్రభుత్వం వెంటనే దిస్సనాయకే మీద ఒత్తిడితెచ్చి తమిళుల ప్రయోజనాలను పరిరక్షించాలని అంటున్నారు. దశాబ్దాల నాటి జనతా విముక్తి పెరుమన ప్రవర్తనను గమనించినప్పుడు సింహళ జాత్యహంకార పార్టీగా అది ఎన్నడూ తన తమిళవ్యతిరేకను దాచుకోలేదు, వారికి దక్కవలసిన అధికారాలూ ప్రయోజనాలూ దక్కనివ్వలేదు. భారత్–లంక ఒప్పందాన్ని అది తీవ్రంగా వ్యతిరేకించింది, తమిళులను ఊచకోతలను సమర్థించింది, వారికి ఏ విధమైన హక్కులూ ఉండకూడదని పోరాడింది. కానీ, ఇటీవల ఆ పార్టీ వైఖరిలోనూ, నాయకత్వంలోనూ మార్పువచ్చింది. దిస్సనాయకేను మార్క్సిస్టు అనేకంటే, ఆచరణవాది అనడం సముచితమని విశ్లేషకుల అభిప్రాయం. విమర్శకులు మాత్రం అవకాశవాది అంటారు.

దేశం అన్ని విధాలుగా దెబ్బతినివున్న స్థితిలో ప్రజలు దశాబ్దాలుగా రాజకీయాల్లో పాతుకుపోయి ఉన్న రాజపక్సేలు, విక్రమసింఘేలు, ప్రేమదాసలను ఏ మాత్రం విశ్వసించలేదని, వారిని అవమానకరంగా తరిమికొట్టారని ఈ ఫలితాలు తెలియచేస్తున్నాయి. రాజపక్సేలకు వ్యతిరేకంగా రెండేళ్ళ క్రితం సాగిన ప్రజాఉద్యమం (అరగాలయ)లో ఇప్పటి ఎన్‌పిపి భాగస్వామ్య పక్షాలు కీలకభూమిక నిర్వహించిన విషయం తెలిసిందే. ఒక సమూలమైన మార్పు, కొత్త రాజకీయ సంస్కృతికి హామీ పడుతూ సాగిన ఈ ఉద్యమం తమిళులను, ముస్లింలను దగ్గరకు తీసుకుంది, వారిలో విశ్వాసాన్ని నెలకొల్పింది. లంకప్రజలు ఇప్పుడు ఎన్నడూ లేనంత సంఘటితంగా ఉన్నారు. శ్రీలంకను ఒడ్డునపడేయడానికి దిస్సనాయకేకు విస్తృతమైన అధికారాలు ఇచ్చారు. అప్పుల ఊబిలో మునిగి, ప్రధానంగా చైనా కబంధ హస్తాల్లో చిక్కుకొనివున్న లంకను కాపాడాల్సిన బాధ్యత ఆయనమీద ఉంది. తమిళులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు, భారత్‌తో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం ఆయనకు మరింత అవసరం.

బంగ్లా చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నారని జార్ఖండ్ సర్కార్‌ను మోదీ ప్రభుత్వం నిందిస్తోంది. మరి ఆ అక్రమ వలసకారులు మన దేశ భూభాగంలో అడుగుపెడుతుండగా, సరిహద్దు సమీప భూభాగాలపై అజమాయిషీ ఉన్న కేంద్రం, ఎందుకు అడ్డుకోలేకపోయింది?

రాజకీయ అస్త్రాలుగా 'చొరబాట్లు'

దేశ సరిహద్దుల భద్రత అనేది ప్రపంచంలోని ఏ దేశానికైనా అత్యంత కీలకం, ప్రాధాన్యమున్న అంశం. ఒక్క భూమార్గంలోనే కాకుండా జల, ఆకాశ మార్గాలలో కూడా పహారా కాస్తుంటారు. ముంబాయి, న్యూఢిల్లీల కంటే కూడా ఎక్కువగా జార్ఖండ్ – పశ్చిమ బెంగాల్ గగనంలో ఎగిరే ప్రతి పక్షిపై సైతం భారత వాయుసేన కన్నేసి ఉంచుతుంది అంటే ఆశ్చర్యం కలుగుతుంది. దేశ సరిహద్దులను కాపాడటం సాయుధ బలగాల విధి. ఈ దృష్ట్యా భారతదేశ సరిహద్దుల భద్రత అనేది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశం.

సరిహద్దుల ఆవలి వైపు నుండి ఎవరైనా అక్రమంగా మన మాతృభూమికి అడ్డదారిన వస్తున్నారంటే అది ఒక రకమైన భద్రతా వైఫల్యం. కేంద్రంలో గత పదేళ్లుగా నరేంద్ర మోదీ ప్రభుత్వం అక్రమ చొరబాటుదారుల విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావిస్తోంది. ప్రత్యేకించి ఎన్నికల సందర్భంగా చొరబాటుదారుల గురించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ ఆ తర్వాత మిన్నకుండిపోతుంది! సరిహద్దుల్లోని అస్సోం, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో ఘుస్పెటియా (చొరబాటుదారులు)ల గురించి కేంద్ర హోం మంత్రి అమిత్ షా పదే పదే ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇప్పుడు సరిహద్దు రాష్ట్రాలు దాటి వాటిని ఆనుకుని ఉన్న రాష్ట్రాలలో కూడ చొరబాటుదారులు అనే ఒక అంశాన్ని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా, బీజేపీ శ్రేణులు ఎన్నికల ప్రచారాస్త్రంగా వాడుకుంటున్నారు. జార్ఖండ్ శాసనసభ ఎన్నికలలో కేవలం బంగ్లాదేశ్ చొరబాటుదారులు అనే ఏకైక అంశం ఆధారంగా బీజేపీ అగ్రనాయకత్వం ప్రచారం చేస్తుండడం

గల్ఫ్ లేఖ

ఆశ్చర్యం కలిగిస్తోంది. దేశంలో కెల్లా ఎక్కువ ఖనిజ సంపద ఉన్న రాష్ట్రంగా ఉన్నా పేదరికంలో మగ్గుతున్న జార్ఖండ్‌లో అభివృద్ధి, సంక్షేమంకు బదులుగా చొరబాటుదారులు అనే అంశాన్నే కమల నాథులు ప్రచారాస్త్రంగా ఉపయోగించుకుంటున్నారు.

ప్రాంతీయ రాజకీయ పక్షాలకు సైద్ధాంతిక విరోధి అయిన బీజేపీ జార్ఖండ్ రాష్ట్రంలోని బలీయమైన జె.యం.యం.ను రాజకీయంగా నిలువరించడానికి విస్తృతంగా చేస్తున్న చొరబాటుదారుల ప్రచారం, ఒక రకంగా, దేశ సరిహద్దులపై నిరంతరం పహరా కాస్తూ మాతృభూమి రక్షణకై ప్రాణాలు అర్పించే వీర జవాన్‌లను అవమానపరచడమే కాదూ? అంతర్జాతీయ సరిహద్దులు కలిగిన రాష్ట్రాలలో సాధారణంగా, సరిహద్దులకు సమీపంలో ఉన్న భూభాగం కేంద్ర ప్రభుత్వ అజమాయిషీలో ఉంటుంది. ఆ విధంగా





పశ్చిమ బెంగాల్‌లో బంగ్లాదేశ్ సరిహద్దుకు 50 కిలోమీటర్ల దూరం వరకు భారత భూభాగం రాష్ట్ర ప్రభుత్వ అధీనంలో కాకుండా కేంద్ర హోం శాఖ అధీనంలో ఉంటుంది. మరి బంగ్లాదేశ్ చొరబాటుదారులు అమిత్ షా అజమాయిషీలోని 50 కిలోమీటర్ల దూరాన్ని సురక్షితంగా దాటితే గానీ మమత బెనర్జీ రాష్ట్రానికి, ఆ తరువాత దాన్ని దాటి జార్ఖండ్‌కు చేరుకోలేరు కదా.

అక్రమంగా, అడ్డదారిన ఒక్క జార్ఖండే అని ఏమిటి, దేశ వ్యాప్తంగా ఏ రాష్ట్రానికి అయినా ఎవరైనా విదేశీయులు వస్తే నిస్సందేహంగా అడ్డుకోవాలి, ఈ విషయంలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. అయితే చొరబాటుదారులకు ఆశ్రయం కల్పిస్తున్నారని జార్ఖండ్ సర్కార్‌ను నిందిస్తున్న కేంద్రం, మరి చొరబాటుదారులు దేశ భూభాగంలో అడుగుపెడుతుండగా ఎందుకు అడ్డుకోలేకపోయింది? ఇదీ ఇప్పుడు అడగవలసిన ప్రశ్న.

అధికారికంగా, దర్జాగా వీసా పొంది భారత్‌లోకి అడుగుపెట్టే అవకాశం ఉన్నప్పుడు అడ్డదారిన ఎవరు, ఎందుకు వస్తారు? ఇక అధికారికంగా గమనిస్తే, ప్రపంచంలోకెల్లా అత్యధిక భారతీయ వీసాలు పొందే దేశం బంగ్లాదేశ్. ఆశ్చర్యం ఏమిటంటే అత్యంత సన్నిహిత దేశానికి మాత్రమే వీసా రుసుం చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది, బంగ్లాదేశీయులు ఒక్క రూపాయి కూడ చెల్లించవల్సిన అవసరం లేకుండా భారతీయ వీసా పొందె అవకాశాన్ని మోదీ సర్కారు కల్పించింది. ఈ రకంగా సందర్శక వీసాలు పొందినవారు తమ దేశానికి తిరిగి వెళ్లిపోతారు. అయితే ఒకవేళ ఆఫ్రికన్ల తరహా భారతదేశంలో తిష్ఠ వేస్తే వారిని గుర్తించి, పట్టుకుని వెనక్కి పంపే నిఘా వ్యవస్థ ఎంత వరకు పని చేస్తుందనేది కూడా ఒక ప్రశ్నే.

ఆదివాసీ తెగల సంఖ్య తగ్గిపోతుందని బీజేపీ చేస్తున్న వాదన సరైనదే. అయితే ఈ పరిస్థితి ఒక్క జార్ఖండ్‌కే పరిమితం కాలేదు. తెలుగునాట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఛత్తీస్‌గఢ్ దాకా గిరిజనుల ప్రాబల్యం అన్ని ప్రాంతాలలోనూ తగ్గిపోయింది. కారణ మేమిటి? అటవీ ప్రాంతాలలో అభివృద్ధి కొరవడి జీవనోపాధికై మైదాన ప్రాంతాలకు వలసలు వెళ్లడం వలన గిరిజనుల జనాభా తగ్గిపోతోంది.

కేవలం బెంగాలీ భాష మాట్లాడుతున్నందుకు భూమి పుత్రులు అయిన స్థానికులను కూడ మతం ఆధారంగా బంగ్లాదేశీయులు అని ముద్ర వేస్తున్నారు. ఇది ఆందోళనకరం. జార్ఖండ్ ఓటర్లలో సగభాగంగా ఉన్న ఆదివాసీ, ముస్లిం ఓటర్లలో అత్యధికులు హేమంత్ సోరెన్ నాయకత్వానికి బాసటగా నిలుస్తున్నారన్న రాజకీయ అక్కసుతో బీజేపీ నాయకత్వం బంగ్లా చొరబాటుదారుల అంశాన్ని ప్రస్తావిస్తుందని విమర్శకులు చేస్తున్న వాదనలో సహేతుకత ఉంది.

చొరబాటుదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి, దీనిపై ఎవరికీ ఆక్షేపణ లేదు. అయితే చొరబాట్లను ప్రతి ఎన్నికలలో ఒక రాజకీయ అంశంగా ప్రస్తావించడం దేనిని సూచిస్తుంది? చొరబాట్లను నిర్మూలించలేమనే కాదా? ఇది ఓటర్లకు ఒక తప్పుడు సంకేతం పంపుతుంది. అంతే కాదు, దేశ సరిహద్దుల రక్షణకు నిరంతరం అప్రమత్తంగా శ్రమించే వీర జవాన్ల త్యాగాలను అవమానించడమే అవుతుంది.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

హస్తినలో తెలుగు నేతల హల్‌చల్



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'తెలుగుదేశం కేంద్రంలో కీలక పాత్ర పోషించడం ఇది మొదటిసారి కాదు. 1989లో ఎన్టీఆర్ హయాంలో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషించాం. 1996–1998 మధ్యలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలోనూ, ఆ తర్వాత ఆరున్నర సంవత్సరాలు వాజపేయి ప్రభుత్వంలోనూ తెలుగుదేశం ప్రధాన భూమిక నిర్వహించింది. పార్లమెంట్‌లో ఒకప్పుడు ప్రతిపక్ష పాత్ర పోషించిన ఏకైక ప్రాంతీయ పార్టీ తెలుగు దేశం. ఆ సమయంలో బీజేపీకి రెండు సీట్లు లభిస్తే తెలుగుదేశంకు 30 సీట్లు లభించాయి' అని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత వారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. నిజంగా అవి దేశ రాజధానిలో తెలుగువారికి సంబంధించి బంగారు రోజులు. తొలుత ఎన్టీఆర్‌ను, తర్వాత చంద్రబాబునాయుడును కలుసుకునేందుకు జాతీయ స్థాయి నేతలు ఆసక్తి ప్రదర్శించిన రోజులవి. యునైటెడ్ ఫ్రంట్ రోజుల్లో చంద్రబాబునాయుడు బస చేసే ఏపీ భవన్ ఫ్రంట్ ప్రధాన కార్యాలయంలా ఉండేది. వాజపేయి కూడా అనేక కీలక అంశాలపై ఆయనతో చర్చించేవారు. తరుచూ రాష్ట్ర సమస్యలను పరిష్కరించేందుకేకాక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకోసం చంద్రబాబు తరుచూ వచ్చి సుడిగాలిలా కేంద్ర మంత్రులను కలిసేవారు. ఆయన పవర్ పాయింట్ ప్రజంటేషన్లు పారిశ్రామికవేత్తలను ఆకర్షించేవి. ఎన్నోసార్లు ఆయన జాతీయ స్థాయిలో జరిగిన మీడియా సదస్సుల్లో పాల్గొనేవారు.

దాదాపు రెండు దశాబ్దాల తర్వాత మరోసారి తెలుగుదేశం పార్టీకి జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఏర్పడింది. హిందుస్థాన్ టైమ్స్ మాత్రమే కాదు, మరో జాతీయ పత్రిక 'ఇండియా టుడే' కూడా దేశంలో అత్యంత శక్తిమంతులైన పది మంది నాయకుల్లో ఒకరుగా చంద్రబాబును గుర్తించింది. తెలుగుదేశంకు చెందిన 16 మంది ఎంపీలు లేకపోతే మోదీ ప్రభుత్వం మెజారిటీకి చేరువలోకి వచ్చేది కాదని ఇండియా టుడే పేర్కొంది. దేశంలో అత్యంత సీనియర్ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు బూడిదలోంచి పునరుత్థానమయ్యే ఫీనిక్స్ పక్షిలా మళ్లీ జాతీయ స్థాయిలో ప్రత్యక్షమయ్యారని ఆ పత్రిక ప్రశంసించింది. ఆయన హయాంలో స్థాపించిన ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆయన కలలు కంటున్న స్వర్ణాంధ్రప్రదేశ్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించింది.


చంద్రబాబునాయుడు మాదిరి ఢిల్లీలో చర్చకు వచ్చిన తెలుగు రాష్ట్రాల అధినేతలు తక్కువే. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో 33 మంది ఎంపీలు రాష్ట్రం నుంచి గెలిచినప్పటికీ ఆయన రాష్ట్ర రాజకీయాలకే పరిమితమయ్యేవారు. జాతీయ సదస్సుల్లో ఆయన ఏనాడూ పాల్గొనలేదు. యూపీఏ హయాంలో భాగస్వామిగా ఉన్న కేసీఆర్ కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ ఏనాడూ జాతీయ స్థాయిలో తన ముద్ర వేసేందుకు ప్రయత్నించలేదు. కేంద్ర మంత్రిగా ఆయన తన మంత్రిత్వశాఖకు కూడా పెద్దగా హాజరు కాలేదు. ఆ విషయం పార్లమెంట్‌లో కూడా చర్చనీయాంశమైంది. ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో ఆయన ఢిల్లీ వచ్చి జాతీయ మీడియాతో మాట్లాడిన సందర్భాలు అతి తక్కువ. ఫెడరల్ ఫ్రంట్ గురించి మాట్లాడినప్పుడు, పార్టీని బీఆర్ఎస్‌గా మార్చినప్పుడు కూడా జాతీయ మీడియా అంతగా చర్చించలేదు. ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో కేసీఆర్ రోజుల తరబడి తుగ్లక్ రోడ్ నివాసంలో ఉన్నప్పటికీ ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. నిజానికి తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీషు భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగిన శక్తి ఉన్నప్పటికీ ఢిల్లీలో మీడియాతో ఎందుకు మాట్లాడడం లేదని నేను ఒకసారి అడిగితే ఆయన ఆ అవసరం లేదని కొట్టిపారేశారు. 22 మంది ఎంపీలు ఉన్నప్పటికీ వైసీపీ అధినేత జగన్ కూడా కేసీఆర్ మాదిరి కూపస్థమండూకంలా వ్యవహరించారు. ఏపీలో అభివృద్ధి గురించి మాట్లాడేందుకు కానీ, పెట్టుబడులను ఆహ్వానించేందుకు కానీ ఆయన ఏనాడూ ప్రయత్నించలేదు. వ్యక్తిగత ప్రయోజనాలకోసం, కేసుల కోసం మాత్రమే ఆయన నరేంద్రమోదీ, అమిత్ షాలను కలుసుకునేందుకు వచ్చేవారు. వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్న విజయసాయిరెడ్డి మోదీ దృష్టిలో పడేందుకు మాత్రమే తాపత్రయపడేవారు. మిగతా ఎంపీలు కూడా అస్తిత్వం లేనట్లే ఉండేవారు. పోనీ గత అయిదేళ్లలో ఏ-1, ఏ-2లపై ఉన్న కేసుల్లో ఒక్క సెక్షన్ అయినా తగ్గించుకోగలిగారా అంటే అదీ లేదు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే తెలుగు రాష్ట్రాల్లో మరో ముఖ్యమైన నేతగా గుర్తింపు పొందిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల కూడా ఢిల్లీలో రాజకీయ వర్గాలు, మీడియా ఆసక్తి ప్రదర్శించడం. కేసీఆర్‌ను ఓడించడంలో రెండుసార్లు రాష్ట్ర కాంగ్రెస్ నేతలు విఫలమైన తర్వాత రేవంత్‌రెడ్డి వెలుగులోకి రాగలిగారు. అనతి కాలంలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన వృద్ధ నేతలు తమ స్వంత రాష్ట్రాల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తేలేక చతికిలపడ్డ సమయంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చి ఆ పార్టీకి భవిష్యత్తుపై ఆశ కల్పించారు. బీజేపీ 240 సీట్లు దాటదని సార్వత్రిక ఎన్నికల ముందు ఇండియా టీవీ రజత్ శర్మ షోలో ప్రకటించిన తర్వాత జాతీయ మీడియా దృష్టిలో పడ్డారు. రేవంత్ హిందీ, ఇంగ్లీషుల్లో అనర్గళంగా మాట్లాడుతూ ఎదురు దాడులు చేయగలగడంతో కాంగ్రెస్ పార్టీ ఆయనను మహారాష్ట్రలో స్టార్ కాంపైనర్‌గా కూడా మోహరించింది. తెలంగాణలో కాంగ్రెస్ హయాంలో పథకాలను అమలు చేయడం లేదన్న మోదీ ఆరోపణలను ఆయన తిప్పికొట్టడమే కాక, మహారాష్ట్రకు రావల్సిన ప్రాజెక్టులను గుజరాత్ తరలించుకుపోవడాన్ని ఎత్తి చూపి బీజేపీ ఆగ్రహానికి గురయ్యారు. కాంగ్రెస్ రాజకీయాల్లో జాతీయ స్థాయిలో భవిష్యత్తు ఉన్న నేతల్లో ఒకరుగా ఆయన ఇప్పటికే గుర్తింపు పొందారు.

ఈ రీత్యా ఢిల్లీలో చాలా కాలం తర్వాత తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇద్దరు ముఖ్యమంత్రులు ఒకరు ఎన్డీఏలోనూ, మరొకరు కాంగ్రెస్‌లోనూ కీలకపాత్ర పోషిస్తుండడం గమనార్హం. కాని ఢిల్లీలో ఎంతగా గుర్తింపు పొందినప్పటికీ చంద్రబాబుతో పోలిస్తే రేవంత్‌కు ఉన్న అవరోధాలు ఎన్నో. ఇది ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీకీ ఉన్న తేడా లాంటిది. చంద్రబాబు మాదిరి రేవంత్ ఢిల్లీలో ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించడం లేదు. అంతేకాక చంద్రబాబు ఒక ప్రాంతీయ పార్టీ అధినేత. పూర్తి పార్టీ ఆయన పట్టులో ఉంటుంది. వైసీపీలో ఎవరైనా విమర్శించినా, ఆఖరుకు సోషల్ మీడియాలో దుమ్మెత్తిపోసినా అందుకు బలమైన జవాబు ఇచ్చేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. చంద్రబాబు తనకు కావల్సిన టీమ్‌ను ఏర్పర్చుకోగలరు. అధికార యంత్రాంగంపై పట్టుబిగించగలిగిన శక్తి ఆయనకు ఉన్నది. కాంగ్రెస్ అనే ఒక పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో రేవంత్ ఉన్నారు. కనుక రాష్ట్ర పార్టీపై ఆయన పట్టు అంతగా బిగించలేకపోతున్నారు. రేవంత్‌ను ఎవరైనా విమర్శిస్తే అంతే స్థాయిలో విరుచుకుపడే సీనియర్ నేతలు పెద్దగా లేరు. అంతేకాక ప్రత్యర్థులు విమర్శిస్తుంటే అందుకు ఒకటి రెండు విమర్శలు జోడించి ఢిల్లీకి చేరవేసేవారు ఎక్కువగా ఉంటారు. అధికారులను, టీమ్‌ను ఎంచుకోవడంలో కూడా చంద్రబాబుకున్న సౌలభ్యం ఆయనకు లేదు. ఏది ఎక్కడి నుంచి లీక్ అవుతున్నదో కూడా చెప్పడం కష్టం. అయినప్పటికీ తనకున్న పరిమితులను అధిగమించేందుకు ఆయన ప్రయత్నిస్తూనే ఉన్నారు. 'కాంగ్రెస్ ప్రస్తుత ఫార్మాట్‌ను మార్చాల్సిన అవసరం ఉన్నది. ట్వంటీ ఓవర్ల మాచ్‌లో ఆడాల్సినట్లు ఆడే బదులు ఇంకా టెస్ట్ మ్యాచ్ మాదిరి ఆడుతున్నాం' అని కాంగ్రెస్ పార్టీలో ఉన్న లోపాల గురించి ఎక్స్‌ప్రెస్ అడ్డా షోలో ధైర్యంగా చెప్పగలగడం రేవంత్‌కే సాధ్యమైంది.

చంద్రబాబు, రేవంత్‌ల తర్వాత ఢిల్లీలో బీఆర్ఎస్ నేత కేటీఆర్ ప్రవేశించి రంగంలోకి దిగడం మరో ఆసక్తికరమైన పరిణామం. అమృత్ టెండర్లు, లగచర్ల ఘటనల గురించి ఆయన గత వారం రోజుల్లో రెండుసార్లు ఢిల్లీలో జాతీయ మీడియాలో మాట్లాడారు. ఆశ్చర్యకరంగా కేటీఆర్‌కు జాతీయ మీడియా కీలక ప్రాధాన్యత నిచ్చింది. కనీసం డజన్ ఛానళ్లు ఆయనతో ముఖాముఖి ఇంటర్వ్యూలు చేశాయి. ఆయన కూడా ఇంగ్లీషు, హిందీలో అనర్గళంగా మాట్లాడగలరు. మహారాష్ట్ర ఎన్నికల సమయంలో ఆయన రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డిలను విమర్శించడం, అదే సమయంలో రాష్ట్ర బీజేపీ నేతలు కూడా లగచర్ల ఘటనపై విరుచుకుపడడం యాదృచ్ఛికం కాదు. నిజానికి కేసీఆర్ హయాంలో కూడా మల్లన్నసాగర్ వంటి ఘటనలు జరిగినప్పటికీ కాంగ్రెస్, బీజేపీ నేతలు ఢిల్లీలో పెద్దగా మాట్లాడలేదు సరికదా, జాతీయ మీడియాలో సైతం చర్చకు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోవడం, ఢిల్లీ మద్యం కుంభకోణంలో అప్రతిష్ఠపాలు కావడం, తమ పుట్టల్లో పాములేమున్నాయా అని రేవంత్‌రెడ్డి సర్కార్ త్రవ్వే యత్నం చేయడంతో బీఆర్ఎస్ జీవన్మరణ సమస్యలో పడింది. అందువల్ల కేటీఆర్ ఢిల్లీలో ప్రవేశించి ఊరూవాడ ఏకం చేసి మద్దతు కోసం ప్రయత్నించడంలో ఆశ్చర్యం లేదు. కాంగ్రెస్ కంటే ఎక్కువగా సోషల్ మీడియాపై కేటీఆర్ పట్టు బిగించినట్లు స్పష్టమవుతోంది. గత రెండు నెలలుగా కేసీఆర్ ఏమి చేస్తున్నారో తెలియకపోవడంతో పార్టీ పగ్గాలు పూర్తిగా కేటీఆర్ చేతుల్లోకి వచ్చాయన్న విషయం స్పష్టమవుతోంది. అయితేనేం, కనీసం నాలుగు సంవత్సరాలు ఆయన పోరాడక తప్పదు. కాని మహారాష్ట్ర ఎన్నికల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం పూర్తిస్థాయి దృష్టి కేంద్రీకరిస్తే తెలంగాణ రాజకీయాలు మరో మలుపు తిరిగే అవకాశాలున్నాయి. ఇంటగెలిచిన తర్వాతే రచ్చ గెలుచుకోగలమని చంద్రబాబు ఎప్పుడో గ్రహించారు. రేవంత్ ఇంకా తెలుసుకోవాల్సి ఉన్నది.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)



akbar

> గత రెండు నెలలుగా కేసీఆర్ ఏమి చేస్తున్నారో తెలియకపోవడంతో పార్టీ పగ్గాలు పూర్తిగా కేటీఆర్ చేతుల్లోకి వచ్చాయన్న విషయం స్పష్టమవుతోంది. అయితేనేం, కనీసం నాలుగు సంవత్సరాలు ఆయన పోరాడక తప్పదు. మహారాష్ట్ర ఎన్నికల తర్వాత బీజేపీ జాతీయ నాయకత్వం పూర్తి స్థాయి దృష్టి కేంద్రీకరిస్తే తెలంగాణ రాజకీయాలు మరో మలుపు తిరిగే అవకాశాలున్నాయి. ఇంటగెలిచిన తర్వాతే రచ్చగెలుచుకోగలమని చంద్రబాబు ఎప్పుడో గ్రహించారు. రేవంత్ ఇంకా తెలుసుకోవాల్సి ఉన్నది.

పిల్లలకు స్థైర్యం నేర్పుదాం!

1959 నవంబర్ 20న బాలల హక్కుల ఒప్పందాన్ని ఆమోదించిన సందర్భంగా ఐక్యరాజ్యసమితి ఆ తేదీని 'ప్రపంచ బాలల దినోత్సవం'గా గుర్తించింది. ఈ ఏటి బాలల దినోత్సవాన 'భవిష్యత్తును వినండి' అంటూ పెద్దలకు పిలుపునిచ్చారు. బాలల ఆలోచనలకు, ప్రాధాన్యతలకు అనుకూలంగా పెద్దల చర్యలు ఉండాలంటే మరి వారు పిల్లలు చెప్పేది వినాల్సిందే!

ఏ దేశానికైనా అత్యంత విలువైన ఆస్తి పిల్లలే. భారత జనాభాలో 40 శాతం మంది 18 ఏళ్ల లోపు బాలలే. అయితే, జాతీయ నేర రికార్డుల బ్యూరో లెక్కల ప్రకారం, 2022లో బాలలపై 1,62,449 నేరాలు నమోదయ్యాయి. అంటే ప్రతి నాలుగు నిమిషాలకు పిల్లలపై ఒక నేరం జరుగుతున్నది. 2021తో పోలిస్తే సాధారణ నేరాలు 4.5శాతం తగ్గాయి. కానీ బాలలపై నేరాలు మాత్రం 8.7శాతం పెరిగాయి. మరోవైపు విద్యార్థుల ఆత్మ హత్యలు కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. 2022లో పది వేల మంది బాలలు ఆత్మ హత్య చేసుకున్నారు!

ఇలాంటి పరిస్థితుల్లో మనం బాలలకు వ్యాకరణంలా, గణితంలా స్థైర్యాన్ని కూడా బోధించక తప్పదు. చిన్నతనం నుండే అపారమైన సవాళ్లను అధిగమించిన వ్యక్తుల స్ఫూర్తిదాయక జీవిత చరిత్రలు బాలలను సాహసవంతులుగా మార్చగలవు. వారిని వారు రక్షించుకోవటమే కాదు, ఇతరులనూ కాపాడగలిగే స్థైర్యాన్ని నింపగలవు. ఇలాంటి స్థైర్యాన్ని ప్రదర్శించిన వారిని ప్రభుత్వమూ విధిగా గుర్తించాలి. ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వాలు సాహస బాలలను గుర్తించి అవార్డులతో సత్కరించాలి. వారి సాహస గాథలను ప్రచారం చేయాలి. బాలకృష్ణుడి వలె ప్రమాదాల నుంచి క్షేమంగా తప్పుకొనే నైపుణ్యాన్ని బాలలకు నేర్పించాలి.

ఉదాహరణకు నేరాలు ఒంటరి బాలలపై జరుగుతాయి. కాబట్టి పిల్లలు స్నేహితులతో కలిసి తిరగడం కీలకం. ఒక్కరు తోడున్నా నేరం జరిగే అవకాశాలు బాగా తగ్గుతాయి. 'వద్దు' అని స్థిరంగా చెప్పగలగటం, 'కాపాడండి' అని గట్టిగా అరవడం, వేగంగా పరుగెత్తడం, చొరవతో సాయం కోరడం... వంటివి పిల్లలకు నేర్పాలి. బాలల వయసు బట్టి ఈ నైపుణ్యాల బోధన ఆధారపడి ఉండాలి. అలాగే 100, 1098 వంటి హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయడం, సహాయక ఏప్‌లను వినియోగించడం సాధ్యమైనంత త్వరగా పిల్లలకు నేర్పాలి. జట్టుగా ఆడే ఆటల్లో పాల్గొనటం, సేవా కార్యక్రమాలలో భాగస్వాములవడం కూడా బాలల్లో స్థైర్యాన్ని నింపుతాయి. బాలల పత్రికలు, బాలల చలన చిత్రాల పాత్ర కూడా ఎంతో కీలకం.

ఇప్పుడు ఉమ్మడి కుటుంబాలు లేవు. కాబట్టి ఏ సమస్య వచ్చినా పిల్లలు తల్లిదండ్రులకు మాత్రమే చెప్పుకోగలరు. నిస్సంకోచంగా అలా చెప్పుకునే అవకాశం వారికి ఉండాలి. అందుకు తగ్గట్టుగా తల్లిదండ్రులు పిల్లలతో స్నేహంగా మెలగాలి. "భారతదేశం నా మాతృభూమి" అనీ "నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను" అనీ ప్రతి రోజూ మన స్కూళ్లలో పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞను బాలలు పలుకుతారు. కానీ మరి తల్లిదండ్రుల మాటేమిటి? ఐస్‌లాండ్ వంటి కొన్ని దేశాలలో తల్లిదండ్రులకూ ప్రతిజ్ఞను తప్పనిసరి చేశారు. పిల్లలకు తగు సమయం కేటాయిస్తామని, వారు మంచి పనులు చేసినప్పుడు ప్రశంసిస్తామని, అవసరమైనప్పుడు 'నో' చెప్పినా స్వీకరిస్తామని, పిల్లలు తగిన ఆహారమూ నిద్రా వ్యాయామమూ లభించేట్టు చూస్తామని తల్లిదండ్రులు ప్రతిజ్ఞ చేస్తారు. ఇందువల్ల ఐస్‌లాండ్‌లో పదహారేళ్ల లోపు యువతలో 1998 నుంచి 2016 మధ్యలో తాగుడు అలవాటు 42 శాతం నుంచి 5 శాతానికి, సిగరెట్ అలవాటు 23 శాతం నుంచి 3 శాతానికి, గంజాయి అలవాటు 17 శాతం నుంచి 7 శాతానికీ తగ్గిపోయింది.



> "భారతదేశం నా మాతృభూమి" అనీ "నా తల్లిదండ్రుల్ని, ఉపాధ్యాయుల్ని, పెద్దలందర్నీ గౌరవిస్తాను" అనీ ప్రతి రోజూ మన స్కూళ్లలో పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞను బాలలు పలుకుతారు. కానీ మరి తల్లిదండ్రుల మాటేమిటి? ఐస్‌లాండ్ వంటి కొన్ని దేశాలలో తల్లిదండ్రులకూ ప్రతిజ్ఞను తప్పనిసరి చేశారు.

లైంగిక నేరాల నుంచి బాలలను రక్షించేందుకు తెచ్చిన పోక్సో చట్టం 2012, నిబంధన 3(5) ప్రకారం సమగ్రమైన బాలల పరిరక్షక విధానాన్ని రూపొందించి, రాష్ట్రంలోని అన్ని సంస్థలలోనూ అది అమలయ్యేట్టు చూడాలి. పోక్సో చట్టం సెక్షన్ 19 ప్రకారం ఏదైనా సంస్థ పరిధిలో బాలలపై నేరం జరిగినా, జరిగే అవకాశం ఉన్నా ఆ సంస్థ యజమాని వెంటనే పోలీసు స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలి. తప్పనిసరిగా రిపోర్ట్ చేయాల్సిన బాధ్యతను నిర్వర్తించడంలో వారు విఫలమైతే వారికి ఏడాది జైలు శిక్ష విధించవచ్చు. పోక్సో చట్టం నిబంధన 3(4) ప్రకారం బాలలు సందర్శించే అన్ని సంస్థలు, పాఠశాలలు, క్రెష్‌లలో సిబ్బందికి, ఉపాధ్యాయులకు ఏమైనా నేర చరిత్ర ఉన్నదా అని పోలీసు శాఖ చేత క్రమబద్ధంగా తనిఖీ చేయాలి. పోక్సో చట్టం కింద పడే శిక్షల తీవ్రత గురించి అవగాహన పెంచితే నేరాలు తగ్గవచ్చు.

పోక్సో చట్టం ప్రకారం ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానాలు దేశవ్యాప్తంగా విధిస్తున్న తీవ్రమైన కఠిన శిక్షల గూర్చి తెలిసిన వారెవరైనా పిల్లలను హింసించాలన్న ఆలోచనకే భయపడతారు. 18 ఏళ్ళ లోపు బాలలపై లైంగిక హింసకు పాల్పడితే ఇరవై ఏళ్ళ వరకు జైలు శిక్ష విధిస్తారు. ఈ నేరం చేసింది బంధువులు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాల సిబ్బంది, వసతి గృహ సిబ్బంది ఐతే మరణ శిక్షకు కూడా ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే కొన్ని రాష్ట్రాలలో ప్రత్యేక న్యాయస్థానాలు త్వరితంగా విచారణ పూర్తి చేసి నేరస్థులకు మరణశిక్షలు విధించాయి.

భారత ప్రభుత్వ లైంగిక నేరస్థుల జాతీయ డేటాబేస్‌లో 10.69 లక్షల మంది లైంగిక నేరస్థుల వివరాలు– పేర్లు, చిరునామాలు, ఫోటోలతో సహా పోలీస్ శాఖకు అందుబాటులో ఉన్నాయి. ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి కొద్ది దేశాలలో మాత్రమే ఈ అవకాశం ఉన్నది. అమెరికాలోనైతే ఈ నేరస్థుల సమాచారం సామాన్యులకు కూడా అందుబాటులో ఉన్నది. భారత్ కూడా ఈ దిశగా ముందడుగు వేయాలి. బాలల హక్కులను పరిరక్షించడం సమిష్టి బాధ్యత.

■ శ్రీనివాస్ మాధవ్
(నేడు ప్రపంచ బాలల దినోత్సవం)

అమెరికా అంటే డాలర్లే కాదు, పుస్తకాలు కూడా!

ప్రతి సంవత్సరమూ నవంబర్‌లో తెలుగు రాష్ట్రాలలో గ్రంథాలయ వారోత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగా పుస్తకాలతో సంబంధం లేని కార్యక్రమాలను మాత్రమే నిర్వహిస్తున్నారు. ముగ్గుల పోటీలు, క్విజ్, డ్రాయింగ్ పోటీలు, కవి సమ్మేళనాలు, అష్టావధానాలు, సన్మానసత్కార సభలు వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వాస్తవానికి ఈ వారం రోజులైనా పుస్తకం విలువ తెలియజేసే కార్యక్రమాలు జరిగితే బాగుంటుంది. గ్రంథాలయంలో ఉన్న పుస్తకాల ప్రదర్శన జరగాలి. గ్రంథాలయ పుస్తకాలను కొత్తతరానికి పరిచయం చేసే విధంగా స్కూల్ పిల్లలను, కాలేజీ యువకులను గ్రంథాలయాలకు రప్పించాలి. పిల్లల పుస్తకాలను పిల్లలకు చూపించాలి. కానీ ఇవేమీ జరగటం లేదు.

ప్రతి సంవత్సరం గ్రంథాలయాలలో వేసవి శిబిరాలు జరుగుతున్నాయి. అక్కడ కూడా పుస్తకాలకు సంబంధించిన కార్యక్రమాలు మినహాయించి మిగిలిన అన్ని రకాల విద్యలు నేర్పిస్తున్నారు. గ్రంథాలయాలలో ప్రతి ఆదివారం 'వీ లవ్ రీడింగ్' ప్రోగ్రామ్ జరుగుతుంది. ఈ కార్యక్రమంలో నిజానికి పిల్లల చేత పుస్తకాలు చదివించడం పుస్తకాలకు సంబంధించిన పోటీలు నిర్వహించడం చేయాలి కానీ మొక్కుబడిగా ఫోటోలు తీసి పంపిస్తున్నారు. నిజానికి పాఠశాలల్లో కూడా ఈ వారోత్సవాలు నిర్వహిస్తే ఎంతో బాగుంటుంది. కానీ చెప్పేదేముంది, పాఠశాలల్లో జరగాల్సిన కార్యక్రమాలే జరపలేకపోతున్నారు, ఇక ఈ గ్రంథాలయ వారోత్సవాలను వారెందుకు పట్టించుకుంటారు.

మేము 'మరో గ్రంథాలయ ఉద్యమం' మొదలుపెట్టినప్పటి నుంచి రాష్ట్ర గ్రంథాలయశాఖ డైరెక్టర్ నుంచి జిల్లా గ్రంథాలయ అధికారుల వరకు అందరినీ కలిశాం. పాఠశాలలను గ్రంథాలయాలకు అనుసంధానం చేసి పిల్లలను పుస్తకాల వైపు ఎలా ఆకర్షించాలో వివరంగా తెలిపే మెమొరాండంను ఆయా అధికారులకు ఇచ్చాం. కానీ దానికి ఎలాంటి ప్రతిస్పందనా లేదు. స్థానిక గ్రంథాలయ ఉద్యోగులు పాఠకులకు సంబంధించిన ఎలాంటి కార్యక్రమాలను చేపట్టకపోగా ప్రభుత్వం నిర్ణయించిన కార్యక్రమాలను కూడా తూతూ మంత్రంగా చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు భాషా పరంగానూ పుస్తక పఠనపరంగానూ మన స్థాయి అంతకంతకూ దిగజారిపోతున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. పై అధికారుల నుంచి జిల్లా గ్రంథాలయ అధికారుల వరకు అవినీతి ఊబిలో కూరుకుపోయారు. గ్రంథాలయాలను కూడా ఆదాయ మార్గాలుగా చేసుకుని చందాలు పోగు చేసుకుంటున్నారు. ఉద్యోగాన్ని నిమిత్తమాత్రంగా మాత్రమే చేస్తున్నారు. గ్రంథాలయ ఉద్యోగ విలువలను పూర్తిగా మర్చిపోయారు. అన్ని శాఖల్లాగే ఈ శాఖలో కూడా అవినీతి పేరుకుపోయింది. ప్రభుత్వాలకు పట్టించుకునే అవసరం ఎలాగూ లేదు. పోనీ మేధావులు, విద్యావంతులు, భాషాభిమానులు కూడా గ్రంథాలయాల ఊసే పట్టించుకోవడం లేదు.

మనం మన పిల్లలు బాగా చదువుకుని అమెరికాకు వెళ్ళి డాలర్లు సంపాదించుకోవాలని కలలు కంటున్నాము. కానీ అదే అమెరికాలో ప్రభుత్వం గ్రంథాలయాలకు ఎంతో గొప్ప ప్రాధాన్యతను ఇస్తుంది. ప్రభుత్వ నిధులతో పాటు, ప్రజల నుంచి కూడా వచ్చే విరాళాలతో ఎంతో అద్భుతంగా అమెరికాలోని గ్రంథాలయాలు పని చేస్తున్నాయి. అక్కడ పిల్లల కోసం అనేక రకాల కార్యక్రమాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు రకరకాల పిల్లల పుస్తకాలను ఇంటికి తీసుకువెళ్ళి పిల్లలకు చదివి వినిపిస్తున్నారు. పుస్తకాల షాపులలో స్టోరీ టెల్లింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. పాఠశాలల్లోనూ పిల్లలకు పుస్తకాలు చదివించే అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. పిల్లలు తప్పనిసరిగా పుస్తకాలు చదివి వాటిని గురించి థీసిస్ రాయాలి. మనం అమెరికా దేశాన్ని డబ్బు సంపాయించడానికి ఒక ఆదర్శంగా మాత్రమే చూస్తున్నాం. కానీ విజ్ఞానాభివృద్ధి కోసం అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను ఇసుమంతైనా ఆదర్శంగా తీసుకోలేకపోతున్నాము.

అమెరికాలో ఉండే వివిధ తెలుగు సంస్థలు పలు తెలుగు భాషా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. కానీ అవి కూడా అమెరికాలోని పుస్తక పఠన సంస్కృతిని ఆంధ్రా తెలంగాణ ప్రాంతాలకు తెచ్చేందుకు ఏమీ చెయ్యలేకపోతున్నాయి. అమెరికా దాకా అక్కర్లేదు. కనీసం మన దక్షిణాది రాష్ట్రాలు కేరళ, తమిళనాడు, కర్ణాటకలనైనా ఆదర్శంగా తీసుకుని గ్రంథాలయాల గురించి మనం పట్టించుకోవాల్సిన అవసరముంది. లేదంటే మన పిల్లలు సెల్‌ఫోన్, సోషల్ మీడియా, డ్రగ్స్ దుష్ప్రభావాలకు బలవుతూనే ఉంటారు.



> మనం అమెరికా దేశాన్ని డబ్బు సంపాయించడానికి ఒక ఆదర్శంగా మాత్రమే చూస్తున్నాం. కానీ విజ్ఞానాభివృద్ధి కోసం అక్కడ జరుగుతున్న కార్యక్రమాలను ఇసుమంతైనా ఆదర్శంగా తీసుకోలేకపోతున్నాము.

• మంచికంటి



• కేక్ మిక్సింగ్

సెమీ క్రిస్మస్ వేడుకను పురస్కరించుకుని హయత్ ప్లేస్ హోటల్‌లో కేక్ మిక్సింగ్ కార్యక్రమం మంగళవారం ఉత్సాహంగా జరిగింది. డ్రైఫ్రూట్స్, వైన్, గ్రేప్‌జ్యూస్‌తో కేక్ తయారీకి అవసరమైన మిక్సింగ్‌ను యువత, చిన్నారులు తయారు చేశారు. ఈ మిక్సింగ్‌ను 40 రోజులు నిల్వ ఉంచి న్యూఇయర్‌కు కేక్ తయారు చేయనున్నట్లు హయత్ ప్లేస్ హోటల్ చైర్మన్ ఆర్వీ స్వామి తెలిపారు.



• ఫ్లాట్లు కేటాయిస్తామని

రూ.5కోట్లకు టోకరా



వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి వ్యవహారాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకంలో ఫ్లాట్లు ఇప్పిస్తామంటూ నాటి గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అనుచరులు పేదల నుంచి కోట్ల రూపాయలు వసూలు చేశారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నాటి నుంచి కనిపించకుండా తిరుగుతున్నారు. మోసపోయామని తెలుసుకున్న బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం పేరుతో మోసం

నిందితులు మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరులు

- ఆయన అండదండలతోనే అవినీతి వ్యవహారం!?
- పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ నగర పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, న్యూ వాంబే కాలనీలో పక్కా గృహాలు ఇప్పిస్తామంటూ విజయవాడ పెజ్జోనిపేటకు చెందిన ప్రత్తిపాటి చందు, ప్రత్తిపాటి కల్యాణి, కొల్హాటి హరిబాబు, కొల్హాటి నాగరాజు, కొల్హాటి తిరుమలరావు తదితరులు ప్రజలను నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల పేర్లతో నకిలీ ఆర్డర్లు సృష్టించి రూ.5 కోట్ల రూపాయలు వరకు వసూలు చేసినట్లు సమాచారం. ఎన్నికల ముందు జోగి అనుచరురాలుగా చలామణి అయిన కల్యాణి సీఎస్ నీలం సహాని, కలెక్టర్ ఢిల్లీరావు, సీసీ శివశంకర్ చాలా క్లోజ్ అని నమ్మించింది. జోగి రమేష్ కేంద్ర ప్రభుత్వం నుంచి 500 ఇళ్లకు జేఎన్ఎన్‌యూఆర్ఎం సొసైటీ పేరు మీద అనుమతి తీసుకువచ్చారని పైఐదుగురు ప్రచారం చేశారు. సీఎస్‌తో జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల ఫ్లాట్లు కేటాయిస్తున్నట్లు ఈ మెయిల్ చాటింగ్స్, వాట్సాప్ చాటింగ్స్ చూపి పేదల వద్ద నుంచి కోట్లు వసూళ్లు చేశారు. నకిలీ పత్రాలు, కేంద్ర ప్రభుత్వ అనుమతులు చూపించి డబ్బులు దండుకున్నారు. విజయవాడలోనే కాకుండా ప్రకాశం, నెల్లూరు జిల్లాలో ఉన్న పేదల నుంచి పెద్ద ఎత్తున డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. 2024లో తమ ప్రభుత్వమే వస్తుందని ఎన్నికల కోడ్ అమలులో ఉంది కనుక ఫలితం రాగానే వారందరికీ ఇళ్ల పట్టాలు ఇస్తామని నమ్మబలికారు. తర్వాత ఎన్నికల ఫలితాలు రాగానే ముఖం చాటేశారని బాధితులు ఆరోపిస్తున్నారు.

గుండెపోటుతో బాధితురాలు మృతి

ఈ స్కామ్‌లో మోసపోయామని తెలియగానే ఒక మహిళ గుండె పోటుతో మృతి చెందింది. ఈ గ్యాంగ్ వెనుక ఒక పబ్లిక్ ప్రాసిక్యూటర్, అతని భార్య ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో వ్యక్తి రూ.3లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. డబ్బులు పోవడం, ఫ్లాట్ రాకపోవడంతో బాధితులు ఈ ఐదుగురిని నిలదీయడం మొదలుపెట్టారు. ఈ విషయం తెలుసుకున్న జోగి రమేష్ ఒక వ్యక్తితో మాట్లాడినట్లు తెలిసింది. ప్రత్తిపాటి చందు, ప్రత్తిపాటి కల్యాణి, కొల్హాటి హరిబాబు, కొల్హాటి నాగరాజు, కొల్హాటి తిరుమలరావు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు సమాచారం. బాధితులు రెండు రోజులుగా అజిత్‌సింగ్‌నగర్ పీఎస్ చుట్టూ తిరుగుతున్నా ఫిర్యాదు చేయడానికి మీనమేషాలు లెక్కిస్తున్నారు. తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని పోలీసులు చెబుతున్నారు. కొంతమంది గూగుల్ పే, ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేయగా, కొంతమంది చేతికి డబ్బులు అందజేసినట్లు బాధితులు పేర్కొంటున్నారు. ఈ డబ్బులను కల్యాణి భర్త చందు వసూలు చేసినట్లు ఎక్కువ మంది చెబుతున్నారు. వీళ్లంతా మాజీ మంత్రి జోగి రమేష్‌కు అనుచరులని బాధితుల్లో కొందరు ఆరోపిస్తున్నారు.

లారీ స్టాండ్‌లో అక్రమ వసూళ్లు

- వీఎంసీ ఆదాయానికి గండి
- కార్పొరేషన్ అధికారులకు వాటా

8లో



దుర్గగుడి ఘాట్ రోడ్డులో 21 వరకు రాకపోకలు బంద్

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొండ పటిష్టతకు చేపడుతు న్న చర్యల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నుంచి ఈ నెల 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఘాట్ రోడ్డులో రాకపోకలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో కె.ఎస్.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీఐపీలు, వీవీఐపీలు, సిబ్బంది, భక్తులు అందరూ కూడా కనకదుర్గానగర్ నుంచి లిఫ్ట్ మార్గంలో కొండపైకి రావాలని విజ్ఞప్తి చేశారు. వినాయకుడి, స్నానాల రేవు నుంచి కనకదుర్గానగర్‌కు రూట్ తెలుపుతూ సూచికలు ఏర్పాటు చేస్తున్నామని, ఉచిత బస్సు సౌకర్యం కూడా ఉందని తెలిపారు.



అసైన్డ్ లబ్ధిదారుల్లో అసహనం

పదేళ్లు పూర్తిచేసుకున్న భూములకు యాజమాన్య హక్కుల కల్పనలో జాప్యం

- గత వైసీపీ ప్రభుత్వంలో 10 శాతం మందికే లబ్ధి
- కూటమి ప్రభుత్వంపైనే మిగిలిన వారి ఆశలు
- ప్రభుత్వం ఏర్పడి 3 నెలలు దాటినా పట్టించుకోకపోవడంపై ఆందోళన
- నిషేధిత భూముల జాబితాలోకి కండీషన్డ్ పట్టాలు

చట్టప్రకారం నిర్ణీత గడువు పూర్తి చేసుకున్న అసైన్డ్ భూముల లబ్ధిదారులు యాజమాన్య హక్కుల కల్పనలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో గజిట్ నోటిఫికేషన్ ఇచ్చినా తమ వారి ప్రయోజనాల కోసమే ఉపయోగిం చుకుందని ఆరోపిస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా సామాన్యుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తే నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే తమ ఇళ్ల స్థలాలు, భూములకు యాజమాన్య హక్కులు కల్పించి ఆదుకోవాలని కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పదేళ్ల పాటు అసైన్డ్ ఇళ్ల పట్టాలు చేతులు మారకుండా ఉన్న వాటికి యాజమాన్య హక్కులు కల్పించేలా గత టీడీపీ ప్రభుత్వంలో ఉత్తర్వులు ఇచ్చారు. కానీ క్షేత్రస్థాయిలో ఎక్కడా అమల్లోకి రాలేదు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా పదేళ్లు దాటిన ఇళ్ల పట్టాలు, 20 ఏళ్లు దాటిన సాగుభూములకు సంబంధించి చేతులు మారకుండా ఉంటే ఆయా లబ్ధిదారులకు యాజమాన్య హక్కులు కల్పించేందుకు ఏకంగా గజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఈ గజిట్ నోటిఫికేషన్ ప్రకారం ప్రభుత్వ పెద్దలు తమకు కావాల్సిన పదిశాతం మందికి సంబంధించి యాజమాన్య హక్కులు కల్పించడం తద్వారా రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. మిగిలిన 90 శాతంపైగా అర్హత కలిగిన నిరుపేదల దగ్గర దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. దీంతో గత ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి అసైన్డ్ పట్టాదారులు బుద్ధి చెప్పారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరగానే.. తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న ఆశతో వీరు ఉన్నారు. అయితే ఈ విషయంపై కూటమి ప్రభుత్వం తాత్సారం చేయడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రభుత్వానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆదాయం సముపార్జించుకునే అంశాలలో ఈ అంశం ఉన్నా కూడా.. నిర్లక్ష్యం చేయటంపై పట్టాదారులు పెదవి విరుస్తున్నారు. యాజమాన్య హక్కులు కల్పించటం ద్వారా పట్టాదారులు తమ కుటుంబ సభ్యులకు గిఫ్ట్‌డీడ్‌లు రాసుకునే అవకాశం ఉంటుంది. దీంతో అది కాస్తా కమర్షియల్ ఆస్తిగా మారిపోతుంది. ప్రభుత్వానికి ఆదాయం కూడా వస్తుందని ఈ దిశగా అధికారులు వివరించటం లేదని కూడా సామాన్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అత్యున్నత న్యాయస్థానాలు సైతం అసైన్డ్ భూముల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించమని అనేక తీర్పులు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు కోర్టులను ఆశ్రయిస్తున్నారు.

కండీషన్డ్ పట్టాలన్నీ మళ్లీ నిషేధిత భూముల జాబితాలోకి..

ఫ్రీ హోల్డ్ భూముల ఉదంతం తర్వాత.. కృష్ణాజిల్లా పరిధిలో కండీషన్డ్ పట్టా భూములు కూడా మళ్లీ నిషేధిత భూముల జాబితాలోకి చేర్చటంతో లబ్ధిదారులు ఘొల్లుమంటున్నారు. ఏమిటీ అన్యాయమని ప్రశ్నిస్తున్నారు. తప్పులు జరిగితే పరిశీలించి వాటిని తొలగించాలి కానీ, అందరి భూములను విచారణ పూర్తయ్యే వరకు 22ఏలో పెట్టడమేమిటని ప్రశ్నిస్తున్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే కండీషన్డ్ పట్టాలకు నాటి బ్రిటీష ప్రభుత్వం అమ్మకాలు, కొనుగోళ్లకు అనుమతులు ఇవ్వటం జరిగింది. ఆ విధంగా చేతులు మారుతూ వస్తున్నాయి. 1954లో భారత ప్రభుత్వం కూడా అమ్మకాలు, కొనుగోళ్లకు అవకాశం కల్పిస్తూ మిగతా 6లో..

ఎట్టకేలకు అరెస్టులు!



గన్నవరం మాజీ ఎమ్మెల్యే వంశీ అనుచరులు 8 మంది అరెస్టు

- వీరిలో వంశీ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి మోహనరంగా
- కారసనేనిపై దాడి కేసులో అదుపులోకి తీసుకున్న వారికి 14 రోజుల రిమాండ్

విజయవాడ/గన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు టీడీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులను ఎట్టకేలకు పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో వంశీ ముఖ్య అనుచరుడు ఓలుపల్లి మోహనరంగా, మరో ఏడుగురు వైసీపీ నాయకులు ఉన్నారు. ఈ ఏడాది జనవరి 21న గన్నవరం విమానాశ్రయం పార్క్ ఎలైట్ హోటల్ వద్ద పొలం విషయమై మాట్లాడేందుకు పిలిచి టీడీపీ నాయకుడు కాసరనేని రంగబాబుపై దాడి చేసిన కేసులో వీరిని పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు అరెస్టులు ప్రారంభించారు. అరెస్టు చేసిన వారిని కంకిపాడు పోలీసుస్టేషన్‌కు తరలించారు. రాత్రి గన్నవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడ వారి దగ్గర నుంచి పోలీసులు రిపోర్టు తీసుకున్నట్లు తెలిసింది. రాత్రి 11 గంటల తర్వాత న్యాయాధికారి ఎదుట హాజరు పరిచారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకూ వాదనలు జరిగాయి. వచ్చే నెల 3వ తేదీ వరకు రిమాండ్ విధించడంతో వారిని గన్నవరం సబ్‌జైలుకు తరలించారు. అరెస్టు అయిన వారిలో రంగాతోపాటు గన్నవరం ఎంపీపీ అనగాని రవి, భీమవరపు యతీంద్ర రామకృష్ణ (రాము), మేచినేని వెంకటేశ్వరరావు(బాబు), సూరపనేని అనీల్, మాజీ సర్పంచి గొన్నూరి సీమయ్య, గుర్రం అంజయ్య(నాని), నిరంజన్ ఉన్నారు.

అధికారం ఉందని చెలరేగిపోయారు..

గన్నవరం నియోజకవర్గం నుంచి 2019లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన వంశీ ఆరు నెలల్లోపే వైసీపీలో చేరిపోయారు. ఆ తర్వాత నుంచి నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డారు. 2023 ఫిబ్రవరిలో ఏకంగా గన్నవరం టీడీపీ కార్యాలయంపై వంశీ అనుచరులు దాడి చేసి బీభత్సం సృష్టించారు. అదే ఏడాది జూన్‌లో గన్నవరం టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావును లక్ష్యంగా చేసుకుని వంశీ, ఆయన అనుచరులు వేధింపులకు దిగారు. గన్నవరం మండలం వెదురుపావులూరు పరిధిలో వెంకటేశ్వరరావు వారసత్వంగా సాగు చేసుకుంటున్న భూమిని స్వాధీనం చేసుకునేలా రెవెన్యూ అధికారులను ఉసిగొల్పారు. ఆ స్థలంలో ఉన్న షెడ్లను కనీసం నోటీసు కూడా ఇవ్వకుండా కూల్చివేయించారు. ఈ వేడి సద్దుమణగకముందే గతేడాది డిసెంబరులో టీడీపీ వాణిజ్య విభాగం నాయకుడు, ప్రసాదంపాడు ఉపసర్పంచి గూడవలి నరసింహారావు(నరసయ్య) ఇంటిపై అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. ఆయనకు చెందిన మూడు కార్లను ధ్వంసం చేశారు. 2024 జనవరిలో కాసరనేని రంగబాబుపై వంశీ అనుచరులు దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో రంగబాబు తీవ్రంగా గాయపడ్డారు. కాళ్లు, చేతులు విరిగిపోయి సుమారు నెల రోజులకుపైగా ఆస్పత్రిలో ఉన్నారు. ఈ దాడులపై అప్పట్లో కేసులు నమోదైనా వైసీపీ ప్రభుత్వ పెద్దల ఒత్తిళ్లతో ఒక్క కేసు ముందుకు సాగలేదు. ఎట్టకేలకు రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో పాత కేసులను పోలీసులు ఇప్పుడు మళ్లీ వెలుగులోకి తెచ్చి అరెస్టులను ప్రారంభించారు. ఈ దాడుల వెనుక కీలక సూత్రధారిని కూడా త్వరలో అరెస్టు చేయనున్నారు.

అందరూ అందరే..

తాజాగా పోలీసులు అరెస్టు చేసిన వారిలో వంశీ ముఖ్య అనుచరుడు రంగా గత ఐదేళ్లలో చెలరేగిపోయారు. నియోజకవర్గంలో గ్రావెల్ అక్రమ తవ్వకాలు మొదలు టీడీపీ నాయకులను వేధించడం వరకు అన్నింటా ఆయన ముందుండేవారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి సమయంలోనూ ఆయన ముందుండి విధ్వం సం సృష్టించారు.

- యతీంద్ర రామకృష్ణ వైసీపీ హయాంలో గన్నవరం నియోజకవర్గంలో పేకాట శిబిరాల నిర్వహణ చూసుకునేవారు. భారీ ఎత్తున పేకాట శిబిరాలు నిర్వహించడం, కోడిపందేలు ఆడించడం చేసేవారు.
- వైసీపీ నాయకుడు మేచినేని బాబుపై ముస్తాబాదలో ప్రైవేటు వ్యక్తుల స్థలాన్ని ఆక్రమించారన్న ఆరోపణలు ఉన్నాయి. తమ స్థలాన్ని ఆక్రమించారని గన్నవరం పోలీసుస్టేషన్‌లో బాధితులు కేసు పెట్టినా, వైసీపీ ప్రభుత్వం ఉండటంతో బాధితులకు న్యాయం జరగలేదు. ఇప్పటికీ వారు పోరాడుతూనే ఉన్నారు. ముస్తాబాద పరిధిలోని కాముడి చెరువును ఆక్రమించుకుని సాగు చేస్తుంటే స్థానికులు ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వ అధికారులు స్పందించి ఆ భూమి ప్రభుత్వ భూమి అని బోర్డు పెట్టి సరిపెట్టేశారు.
- గన్నవరం సమీపంలోని రాకీ ఎవెన్యూస్‌లో అసలు యజమానులను వంశీ సాయంతో బెదిరించి దాన్ని తన స్వాధీనంలోకి తెచ్చుకున్నారని గుర్రం అంజయ్య (నాని)పై ఆరోపణలు ఉన్నాయి. పాత యజమానుల హయాంలో రాకీ ఎవెన్యూస్‌లో భవన నిర్మాణాలు చేసిన మేస్త్రీలు, ఇతర పనుల వారికి కోట్లాది రూపాయలు ఎగ్గొట్టారని బాధితులు నేటికీ ఆందోళన చేస్తున్నారు. అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న వంశీ అండ చూసుకునే వీరందరికీ చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా బెదిరింపులకు దిగారన్న ఆరోపణలు నానిపై ఉన్నాయి.

జిల్లాలో 559 గోకులాలు

- పాడి రైతులకు భరోసా
- పశువులకు షెడ్ల నిర్మాణం
- లబ్ధిదారుల వాటాకు 'ఉపాధి' నిధులు అనుసంధానం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : స్థలం ఉన్నా నీడ ఉండదు. చెట్ల నీడలో కట్టినా వర్షాలు వచ్చినప్పుడు మాత్రం తడిసి ముద్ద కావాల్సిందే. నీడ కోసం పాకలు వేసినా ఏడాది లోపు పాడైపోతున్నాయి. చిన్న, సన్నకారు పాడి రైతుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ఇటువంటి పరిస్థితుల్లో పాడి రైతుకు అండగా నిలవాలని ప్రభుత్వం భావించింది. ఎన్టీఆర్ జిల్లాలో గోకులం పేరుతో షెడ్లను నిర్మి స్తోంది. పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఈ గోకులాలు నిర్మాణ మవుతున్నాయి. జిల్లాలో మొత్తం 475 గోకులాలు నిర్మించాలని పశుసంవర్థకశాఖ ప్రతిపాదనలు రూపొందించింది. చిన్న,సన్నకారు పాడి రైతుల నుంచి మంచి స్పందన రావడంతో మొత్తం 559 గోకులాలు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. వాటికి జిల్లా కలెక్టర్ పరిపాలనా అనుమతులు కూడా మంజూరు చేశారు. ఈ పథకంలో లబ్ధిదారులకు సొంతంగా స్థలం ఉండాలి. వారికి ఉన్న పశువుల సంఖ్యను బట్టి షెడ్లు నిర్మిస్తారు. ఈ పథకంలో లబ్ధిదారుడి వాటాగా పది శాతం చెల్లించాలి. మిగిలిన 90శాతం నిధులను గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఖర్చు చేస్తారు. ఇబ్రహీంపట్నం రాయనపాడులో జరుగుతున్న గోకులాల నిర్మాణపు పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో వాటిని ప్రారంభింప చేయాలన్న యోచనలో అధికారులు ఉన్నారు. ఈ నెలలో గానీ, డిసెంబరులో గానీ డిప్యూటీ సీఎం పర్యటన జిల్లాలో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఆ పర్యటనలో గోకులాల షెడ్యూల్‌ను చేర్చాలని అధికారులు భావిస్తున్నారు.

ఇదీ గోకులం

గోకులం పథకంలో రెండు, నాలుగు, ఆరు పశువులు ఉన్న వారికి ప్రత్యేకంగా షెడ్లను నిర్మిస్తారు. పశువుల సంఖ్యను బట్టి గోకులం అంచనా విలువ ఉంటుంది. రెండు పశువులు ఉన్న షెడ్ యూనిట్ విలువ రూ.1.15లక్షలు. ఇందులో లబ్ధిదారుడి వాటాగా రూ.11,500 చెల్లించాలి. మిగిలిన రూ.1,03,500లను ప్రభుత్వం భరిస్తుంది. నాలుగు పశువుల షెడ్‌కు అంచనా విలువ రూ.1.85 క్షలు ఉండగా, దీనికి లబ్ధిదారులు రూ.18,500 చెల్లించాలి. మిగిలిన రూ.1,66,500లను ప్రభుత్వం వెచ్చిస్తుంది. ఆరు పశువులు ఉన్న షెడ్ నిర్మాణానికి రూ.2.30 లక్షలను ఇస్తారు. ఇందులో లబ్ధిదారుల వాటాగా రూ.23వేలు చెల్లిస్తే, మిగిలిన రూ.2.7లక్షలను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది. పశువులకే కాకుండా గొర్రెలు, మేకలకు ప్రత్యేకంగా షెడ్లు నిర్మిస్తున్నారు.

- 20 జీవాలు ఉన్న షెడ్ నిర్మాణానికి రూ.1.30లక్షలు వెచ్చిస్తారు. ఇందులో లబ్ధిదారులు రూ.39వేలు భరించాలి. మిగిలిన రూ.91వేలను ప్రభుత్వం భరిస్తుంది.
- 50 జీవాలు ఉన్న షెడ్ నిర్మాణానికి రూ.2.30లక్షలు ఇస్తారు. ఇందులో లబ్ధిదారుల వాటాగా రూ.69వేలు చెల్లించాలి. మిగిలిన రూ.1.61లక్షలను ప్రభుత్వం ఖర్చు చేస్తుంది.
- 100 కోళ్లు ఉండే షెడ్ నిర్మాణానికి రూ.87 వేలు వెచ్చిస్తారు. ఇందులో లబ్ధిదారులు రూ.26,100 చెల్లిస్తే, మిగిలిన మొత్తాన్ని రూ.60,900 ప్రభుత్వం భరిస్తుంది.
- 200 కోళ్లు ఉండే షెడ్‌కు రూ.1.32లక్షలు ఖర్చు చేస్తారు. ఇందులో లబ్ధిదారుల మిగతా 6లో..



అంబాపురం పంచాయతీ పరిధిలోని పంటపొలాల్లో జేసీబీలతో తవ్వకాలు

హై టెన్షన్!



- విజయవాడ బైపాస్ రోడ్డుతో పెరిగిన ఎత్తు
- భారీ వాహనాలకు హైటెన్షన్ వైర్లు తగిలే ప్రమాదం
- హైటెన్షన్ విద్యుత్తు స్తంభాలు మార్చాలని నిర్ణయం
- రైతులకు సమాచారం ఇవ్వకుండా తవ్వేస్తున్న కాంట్రాక్ట్ సంస్థ
- ఆందోళనలకు దిగుతున్న విజయవాడ రూరల్ రైతులు
- పరిహారం లేకుండా తవ్వితే ఆత్మహత్యలే శరణ్యమంటున్న రైతులు

(విజయవాడ రూరల్, ఆంధ్రజ్యోతి)

విజయవాడ బైపాస్ రోడ్డు పనుల్లో భాగంగా జరుగుతున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ల డైవర్షన్ పనులు విజయవాడ రూరల్ గ్రామ రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. హైటెన్షన్ విద్యుత్ స్తంభాలు ఏర్పాటు విషయంలో కాంట్రాక్ట్ సంస్థ దూకుడుగా వ్యవహరించడం, సమాచారం లేకుండా పచ్చని పంట పొలాల్లో తవ్వకాలు చేపడుతుండటంతో ఆయా గ్రామ రైతులు ధర్నాలకు దిగుతున్నారు. పంటలను ధ్వంసం చేసి తవ్వకాలు జరుపుతూ పరిహారం ఊసెత్తకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. వేసిన పంటలను కోల్పోయి పరిహారం ఎప్పుడు ఇస్తారు, ఎవరు ఇస్తారో తెలియక అయోమయంలో ప్రభుత్వ కార్యాలయాలు.. కాంట్రాక్ట్ సంస్థ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

● పెరిగిన ఎత్తు.. హైటెన్షన్‌తో ముప్పు

విజయవాడ బైపాస్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలను ఆనుకుని రోడ్డు పనులు జరుగుతున్నాయి. గొల్లపూడి నుంచి చిన్న అవుటుపల్లి వరకు జరుగుతున్న బైపాస్ రోడ్డు పనులు తుది దశకు వచ్చాయి. అయితే ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ నుంచి నున్న గ్రామంలోని ఎన్టీపీఎస్ వరకు విద్యుత్ హైటెన్షన్ వైర్లు దశాబ్దాల కాలం నుంచి ఉన్నాయి. బైపాస్ రోడ్డును ఎత్తులో నిర్మించడంతో పలు చోట్ల విద్యుత్ హైటెన్షన్ వైర్లు బైపాస్ రోడ్డుపై వెళ్లే భారీ వాహనాలకు తాకే ప్రమాదం ఏర్పడింది. సమస్యను అధిగమించేందుకు కాంట్రాక్ట్ సంస్థ విద్యుత్ వైర్ల డైవర్షన్ పనులు చేపట్టింది. ఈ పనుల్లో భాగంగా ప్రస్తుతం ఉన్న స్థానాల నుంచి హైటెన్షన్ స్తంభాలను మారుస్తున్నారు. ఇలా మార్చే క్రమంలో ఇతర రైతుల పొలాల్లో హైటెన్షన్ స్తంభాలు పడుతుండటంతో ఆ రైతులు గగ్గోలుపెడుతున్నారు. తమకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండా.. కనీస సమాచారం లేకుండా పొలాలను తవ్వేయడం ఏమిటని వారు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను నిలదీస్తున్నారు. దీంతో ఇక్కడ తరచూ రైతులకు, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులకు గొడవలు జరుగుతున్నాయి. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తుండంతో పరిస్థితి మరింత దిగజారుతోంది.

● నెల రోజులుగా తవ్వకాలు

హైటెన్షన్ వైర్ల డైవర్షన్ పనుల్లో భాగంగా పలు గ్రామ పంచాయతీల పరిధిలో కాంట్రాక్ట్ సంస్థ నెల రోజులుగా పొలాల్లో తవ్వకాలు ప్రారంభించింది. కొత్తూరు తాడేపల్లి, జక్కంపూడి, అంబాపురం, పాతపాడు, నున్న తదితర గ్రామ పంచాయతీల పరిధిలోని పొలాల్లో జరుగుతున్న తవ్వకాలు పనులు రైతులను ఆగ్రహానికి గురిచేస్తున్నాయి. కాంట్రాక్ట్ సంస్థ తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తమ పొలాల్లో తవ్వకాలు చేపడుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేమని అడిగితే సంస్థ ఇంజనీర్లు దౌర్జన్యం చేస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఎప్పుడో రెండేళ్ల క్రితం స్థలాలు అవసరమని అప్పటి అధికారులు చెప్పారని దానిపై తాము అభ్యంతరాలు కూడా తెలిపామని, అయినా రెండేళ్ల తర్వాత ఇప్పుడు వచ్చి తవ్వకాలు చేపడుతున్నారని ఈ కారణంగా తాము కోట్లాది రూపాయలు విలువ చేసే పొలాలను కోల్పోతున్నామని రైతులు బోరుమంటున్నారు.



డైవర్షన్ పనులతో నష్టపోతున్నాం

- సత్యనారాయణరాజు, రైతు

హైటెన్షన్ వైర్ల డైరక్షన్ పనులతో భారీగా నష్టపోతున్నాం. రైతులు నష్టపోకుండా సమస్య పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను కలిసి వినతిపత్రాలు ఇచ్చాం. అధికారులు సమస్యను పరిశీలిస్తామని చెబుతున్నా ఈలోపే కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధులు పొలాల్లో తవ్వకాలకు సిద్ధపడిపోతున్నారు. డైవర్షన్ కారణంగా కొత్తూరు తాడేపల్లి గ్రామ పరిధిలో 50 ఎకరాల వ్యవసాయ భూములు విద్యుత్ వైర్ల బారిన పడి రైతులు నష్టపోయే పరిస్థితి.



నోటీసు ఇవ్వలేదు, పరిహారం ఊసేలేదు

- కంది గోపాలకృష్ణ, నున్న గ్రామ కౌలు రైతు

13 ఎకరాల పొలం కౌలుకు తీసుకుని పంట వేసుకున్నాను. రోడ్డు పనుల్లో రెండు ఎకరాలు పోగా ఇప్పుడు ఎకరం పంటలో కొత్తగా విద్యుత్ స్తంభాలను వేశారు. స్తంభాల ఏర్పాటు సమయంలో భారీ వాహనాలు పంట పొలాలను తొక్కేసాయి. మరి కొన్ని చోట్ల పంటకు నీళ్లు రాకుండా కాంట్రాక్ట్ సంస్థ అడ్డుకట్టలు వేసేశారు. ఆ కారణంగా పొలం చాలా వరకు ఎండిపోయింది. నష్టపరిహారం అడిగితే కాంట్రాక్ట్ సంస్థ సిబ్బంది, ఇంజనీర్లు దౌర్జన్యం చేస్తున్నారు.



మాకు చావే శరణ్యం

- సాంబశివరావు, రైతు

పది ఎకరాల పొలంలో ఏడు ఎకరాలు బైపాస్ రోడ్డుకు పోయింది. ఇప్పుడు మిగిలిన పొలంలో ఎకరం వరకు కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తామని అంటున్నారు. ఎలా బతకాలో అర్థం కావడం లేదు. ఇలా అయితే నాకు చావే శరణ్యం. విద్యుత్ స్తంభాల డైవర్షన్ పనుల్లో ఎవరు పొలాలను నష్టపోకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.



పిల్లల చదువు కోసం ఉంచిన పొలంలో విద్యుత్ వైర్లు

- ప్రసాద్ రైతు

మార్కెట్ విలువ ప్రకారం ఎకరం పొలం సుమారు రూ. 6 కోట్లు పైమాటే ఉంది. పిల్లల చదువులు, భవిష్యత్ కోసం పొలం ఉపయోగపడుతుందని అనుకున్నాం. కాని నా రెండు ఎకరాల పొలంలో హైటెన్షన్ విద్యుత్ వైర్లు, స్తంభాలు వేస్తామంటున్నారు. ఇలా అయితే మా భవిష్యత్తు ఏం కావాలి? కనీసం నష్టపరిహారం ఎంత ఇస్తారు, ఎప్పుడు ఇస్తారు అనే స్పష్టత కూడా మాకు ఇవ్వడం లేదు.

అసెంబ్లీ వేదికగా

కృష్ణా, గుంటూరు డీసీసీబీల్లో అవినీతిపై విచారణ చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



గన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ల కాలంలో కృష్ణాజిల్లా, గుంటూరు జిల్లా డీసీసీబీల్లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం సహకార సంఘాల కోసం రూ.308 కోట్లు కేటాయించినందుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు సహకార సంఘాలు ఒక బలమైన శక్తిగా ఉన్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గతంలో సహకార సంఘ శాఖ వేరుగా ఉన్నప్పటికి ప్రస్తుతం వేరొక శాఖలో విలీనం చేయడం జరిగిందన్నారు. విలీనం అయ్యాక సహకార సంఘాలు నిర్వీర్యమయ్యాయని భావిస్తున్నానని పేర్కొన్నారు. అవకాశాన్ని బట్టి తిరిగి సహకార సంఘ శాఖను పునరుద్ధరించాలని కోరారు. రెండేళ్లకు ఒకసారి సహకార సంఘాల్లో ఆడిటింగ్ నిర్వహించి అవినీతికి తావు లేకుండా చూడాలన్నారు. తాను కేడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా 13నెలల పదవీ కాలంలో రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. రూ.5200 కోట్ల టర్నోవర్ బ్యాంకును రూ.9వేల కోట్లకు తీసుకువెళ్లి దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిపానన్నారు. కేవలం డబ్బులు దండుకునేందుకు మాత్రమే బ్యాంకు సాఫ్ట్‌వేర్ బాగానే ఉన్నా మరో కంపెనీ నుంచి సాఫ్ట్‌వేర్‌ను కొనుగోలు చేశారని ఆరోపించారు. ఇవే కాకుండా ఎటువంటి టెండర్లు, సీఆర్డీఏ అనుమతులు లేకుండా బ్యాంకు భవనాల నిర్మాణం చేపట్టారని, ఉద్యోగ నియామకాల్లో అవకతవకలకు పాల్పడ్డారని ఆయన విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని మండిపడ్డారు. తాను పదవీకాలంలో ఉన్న 13 మాసాల కాలంతో పాటు గత ఐదేళ్లలో గుంటూరు, కృష్ణాజిల్లా డీసీసీబీల్లో జరిగిన అవినీతి అవకతవకలపై విచారణ జరిపించాలని సంబంధిత మంత్రిని ఎమ్మెల్యే కోరారు.

సాగునీటి పథకాలను ఆదుకోండి

- ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య



నందిగామ : నదుల అనుసంధానం, భారీ సాగునీటి పథకాలు నిర్మించి రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుదని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య అన్నారు. వేదాద్రి, కంచల ఎత్తిపోతల పథకంతో పాటు నియోజకవర్గ పరిధిలోని పలు ఎత్తిపోతల పథకాల మరమ్మతులకు నిధులు ఇవ్వాలని అసెంబ్లీ సమావేశాల్లో ఆమె జలవనరుల శాఖను కోరారు. ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. నియోజకవర్గంలోని పలు పథకాలకు నిధుల అవసరం ఉందని, తక్షణమే సాయం చేయాలని కోరారు. మునేటి వరదలకు దెబ్బతిన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయించి రైతులకు అందించాలని కోరారు.

దివిప్రాంత సమస్యలపై.. : మండలి



అవనిగడ్డ : దివిసీమ ఉప్పెన సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మంగళవారం దివి ప్రాంత సమస్యలను ప్రస్తావించారు. తీవ్ర ఉత్పాతాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కరకట్టలు పూర్తిగా బలహీనపడ్డాయని, సముద్రపు మట్టాలు పెరిగి ఉప్పునీరు పంట పొలాల్లోకి చేరుతుందని, అవుట్ ఫాల్ స్లూయిస్ పూర్తిగా దెబ్బతిన్నాయని, తుఫాన్ షెల్టర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని, ప్రభుత్వం వెంటనే విపత్తుల నిర్వహణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తాగునీటి సమస్యపై.. : వెనిగండ్ల



గుడివాడ : గత పాలకుల నిర్లక్ష్యంతో నియోజకవర్గంలో తాగునీటి ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వెనిగండ్ల రాము కోరారు. పట్టణంలో పైపులైన్‌ల వ్యవస్థను నాశనం చేసారని, పబ్లిసిటీ కోసం ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేశారని ఆరోపించారు. చిన్న పంపుల చెరువుకు గండి పడితే గత పాలకులు పూడ్చకుండా వదిలేసారని ఆరోపించారు. అమృత్ ఫేజ్-2లో ప్రతిపాదించిన మూడు ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణానికి అనుమతులివ్వాలని కోరారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీయూజీబీసీ) నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కోరారు.

మండలి సేవలు చిరస్మరణీయం

- నంగేగడ్డలో కృష్ణారావు విగ్రహావిష్కరణలో వక్తలు



మండలి వెంకట కృష్ణారావు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యేలు రామకృష్ణ, బుద్ధప్రసాద్, నారాయణరావు

నాగాయలంక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : దివిసీమకు మండలి వెంకట కృష్ణారావు చేసిన సేవలు చిరస్మరణీయమని కూటమి నేతలు పేర్కొన్నారు. 1977 ఉప్పెన బాధితులకు అండగా ఉండి దివిసీమ పునర్నిర్మాణానికి ఎనలేని కృషి చేశారని అతిథులు కొనియాడారు. దివిసీమ గాంధీ, మాజీమంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు విగ్రహాన్ని నంగేగడ్డలో మాజీ సర్పంచ్ బావిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా, మంగళవారం ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణలు ప్రారంభించారు. దివిసీమలో మండలి చేసిన అభివృద్ధిని శ్లాఘించారు. కార్యక్రమానికి కొనకళ్ల అధ్యక్షత వహించగా కూటమి నేతలు, అభిమానులు పాల్గొన్నారు. తొలుత ఉప్పెనలోని మృతులకు కొద్దిసేపు మౌనం పాటించారు.

ఏపీ పవర్ యూనియన్ నాయకుడి బదిలీ

ఇబ్రహీంపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏపీ పవర్ యూనియన్ నాయకుడు, ఎన్టీటీపీఎస్ ఏడీఈ అన్నే శ్రీనివాస కుమార్‌ను సీలేరు బదిలీ చేస్తూ జెన్కో ఎండీ చక్రధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్టీటీపీఎస్‌లో ఇంజనీర్ల బదిలీ పర్వం కొనసాగుతూనే ఉంది. ఇప్పటి వరకు మొత్తం 105 మందిపై బదిలీ వేటు పడింది. వైసీపీ సానుభూతిపరులుగా ఉండటంతో పాటు తరచూ యూనిట్ల ఉత్పత్తి ఆగిపోవడం, సరైన సమయానికి వాటిని రిపేరు చేయలేకపోవడం, విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై వేటు వేస్తు వస్తున్నారు. ఈక్రమంలో చాలా మందిపై బదిలీ వేటు పడింది.

క్రీడలపైనా దృష్టి సారించాలి : డీఈవో

మచిలీపట్నం టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని డీఈవో పీవీజే రామారావు అన్నారు. జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం రాత్రి ఉమ్మడి కృష్ణాజిల్లాల అండర్ 14 (బాలురు), 17 (బాలురు, బాలికల) పోటీలను డీఈవో ప్రారంభించారు. అండర్ 14 బాలుర జట్లు 13, అండర్ 17 బాలురు 13, బాలికలు 13 జట్లు రిజిస్టర్ చేయించుకున్నాయి. టోర్నమెంట్‌లో భాగంగా కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను డీఈవో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ, పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులకు పోటీతత్వం అలవరచేందుకు కృషి చేయాలన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాల బాక్సింగ్ పోటీలు మచిలీపట్నంలో నిర్వహించడం ముదావహమన్నారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అజయ్‌కుమార్, దాసరి శ్రీనివాసరావు, జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ కె.ఝాన్సీలక్ష్మి, డీవైఈవో శేఖర్ సింగ్, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు హసీంబేగ్ తదితరులు మాట్లాడారు.

జిల్లాలో 559 గోకులాలు

(5వ పేజీ తరువాయి)

వాటాగా రూ.39,600 చెల్లించాలి. మిగిలిన రూ.92,400 ప్రభుత్వం భర్తిస్తుంది.

నిబంధనలు ఇలా

గోకులం పథకంలో పశువులకు, గొర్రెలు, మేకలు, కోళ్లకు షెడ్లు నిర్మించాలనుకున్న వారికి సొంతంగా స్థలం ఉండాలి. ఆధార్‌కార్డు, ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు ఉండాలి. పశుసంవర్ధశాఖ వద్ద ఉన్న దరఖాస్తును పూర్తి చేసి ఈ ఫొటోస్టాట్ కాపీలను జత చేసి అందజేయాలి. దరఖాస్తులు సంబంధిత పశుసంవర్ధక శాఖ వైద్యుల వద్దకు పంపుతారు. వారు లబ్ధిదారులకు ఇళ్లకు వెళ్లి పశువులు ఉన్నాయా లేదా అని పరిశీలించి ధ్రువీకరణపత్రం ఇస్తారు. నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉంటే షెడ్ల నిర్మాణానికి అనుమతులు ఇస్తారు.

అస్సైన్డ్ లబ్ధిదారుల్లో అసహనం

(5వ పేజీ తరువాయి)

ఉత్తర్వులు ఇచ్చింది. దీనిని ఆధారంగా చేసుకుని కిందటి వైసీపీ ప్రభుత్వం కండీషన్డ్ పట్టాలను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాల్సిందిగా ఆదేశాలు ఇచ్చింది. దీనిపై ముందే సమాచారం ఉండటంతో వైసీపీ పెద్దలు కొందరు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి లాభపడ్డారు. మిగిలిన 90 శాతం మంది అర్హులే అయినప్పటికీ విచారణ పేరుతో అందరి భూములు కూడా నిషేధిత భూముల జాబితాలోకి చేరిపోయాయి. ఎన్టీఆర్ జిల్లాలో కండీషన్డ్ పట్టాలు పెద్దగా లేవు. కృష్ణా జిల్లాలో మాత్రం పెద్ద సంఖ్యలో కండీషన్డ్ పట్టాలు ఉన్నాయి. అవనిగడ్డ, మచిలీపట్నం, కోడూరు, నాగాయలంక, నందివాడ మండలాల్లో పెద్ద సంఖ్యలో కండీషన్డ్ పట్టాలు కాస్తా నిషేధిత భూముల జాబితా 22ఏలోకి చేరిపోయాయి. కండీషన్డ్ పట్టాల బాధితులు కూడా కూటమి ప్రభుత్వంపై అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వీలైనంత త్వరగా ఈ సమస్యలను తేల్చటం వల్ల సామాన్య ప్రజలకు వెసులుబాటుగా ఉంటుంది.

అప్పుల వాళ్ల వేధింపులతో టీడీపీ నేత ఆత్మహత్య

- వైసీపీ ప్రభుత్వంలో వేధింపుల పర్వం
- రూ.20 లక్షల బాకీకి రూ.2 కోట్ల పొలం రాయించుకున్నారు
- జగన్ ప్రోగ్రాం కన్వీనర్ తలశిల రఘురాం హస్తం
- టీడీపీ వచ్చినా ఏం చేయడం లేదని మనస్థాపం
- పిల్లల్ని వేధిస్తున్నారు.. మనస్థాపంతో గడ్డిమందు తాగి ఆత్మహత్య



కారెంపూడి రవీంద్ర (ఫైల్‌ఫొటో)

గొల్లపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా టీడీపీ నేత కేవలం 20 లక్షల బాకీ ఉంటే రూ.2 కోట్ల విలువగల పొలం అన్యాయంగా రాయించుకున్నారు. అందుకు వైసీపీ మాజీ ఎమ్మెల్సీ, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రోగ్రాం కన్వీనర్ తలసిల రఘురాం వైసీపీ నేతకు పూర్తి అండదండలు అందించి బలవంతంగా అధికార దర్పంతో రాయించేసి టీడీపీ నేతకు తీరని అన్యాయం చేశాడు. మూడేళ్ల తర్వాత తిరిగి పొలం బకాయి పోను మిగిలింది ఇస్తామని నమ్మబలికారు. అయితే ఇప్పటి వరకు ఏం న్యాయం చేయకపోగా వేధింపులు ఆపలేదు. వైసీపీ నాయకులు వికృత క్రీడకు బలైన టీడీపీ నేత దయనీయ గాథ ఇది.

● అప్పుల వాళ్ల వేధింపులతో తీవ్ర మనస్తాపం చెంది గొల్లపూడికి చెందిన టీడీపీ నేత కారెంపూడి రవీంద్ర (45) గడ్డిమందు సేవించి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈఘటన మూడు రోజుల క్రితం జరిగింది. రవీంద్ర ఆత్మహత్యకు ముందు చేసిన సెల్ఫీ వీడియోతో వైసీపీ నేత తలసిల రఘురాం చేసిన దారుణం బయటకు వచ్చింది. రవీంద్ర రూ.20 లక్షల బాకీ ఉంటే రూ.2 కోట్ల పొలాన్ని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రోగ్రాం కన్వీనర్, మాజీ ఎమ్మెల్సీ గొల్లపూడికి చెందిన తలసిల రఘురాం సమక్షంలో బాకీ తీసుకున్న వ్యక్తులు రాయించుకున్నారు. మూడేళ్ల తర్వాత తిరిగి ఇస్తామని చెప్పి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈక్రమంలో తనకు ఇవ్వాల్సిన వారు డబ్బు తిరిగి ఇవ్వకుండా వేధిస్తుంటే తాను ఇవ్వాల్సిన వారు మాత్రం ఇళ్లకు వచ్చి పిల్లల వద్ద కుటుంబం గురించి చులకనగా మాట్లాడుతుంటే తన కుమారుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. టీడీపీ వచ్చినా కొందరు వ్యక్తులు రవీంద్రపై వేధింపులు ఆపడం లేదు. దీంతో మూడు రోజుల క్రితం కంచికచర్ల మిక్ కళాశాల సమీపంలో తన కారులోనే గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



● టీడీపీ నేత కారెంపూడి రవీంద్ర అంత్యక్రియల్లో మాజీమంత్రి ఉమామహేశ్వరరావు పాల్గొని పాడె మోశారు. తొలుత రవీంద్ర పార్థివ దేహానికి ఉమా పూలమాలలతో పాటు టీడీపీ జెండా కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇళ్లు

- జాప్ ఆవిర్భావ సభలో స్వచ్ఛాంధ్ర చైర్మన్ పట్టాభి



ఆటోనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అర్హులైన జర్నలిస్టులందరికీ ఇల్లు మంజూరు చేస్తామని, అతి తర్వలోనే ఈ శుభవార్త జర్నలిస్టులకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెబుతారని రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్ర మిషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి రామ్ అన్నారు. మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో 32వ జాప్ యూనియన్ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత జాప్ 32వ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టాభి మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం జాప్ వ్యవస్థాపక అధ్యక్షులు ఉప్పాల లక్ష్మణ్ మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. కరోనాలో 136 మంది జర్నలిస్టులు మరణించారని, వారి కుటుంబాలకు రూ.5 లక్షలు ఇస్తానని గత సీఎం చెప్పి మాట తప్పారని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని జీవో ఇచ్చి చేతులు దులుపుకున్నారని, జర్నలిస్టులను విస్మరించిన ఏకైక ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి నిలిచిపోతారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు అండగా నిలుస్తామని చెప్పడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 20 సూత్రాల అమలు చైర్మన్ లంక దినకర్, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రజిని, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో మందుబాబుల హల్‌చల్!

- భయభ్రాంతులకు గురైన స్థానికులు

వన్‌టౌన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి) : గాంధీనగర్‌లో మందుబాబుల ఆగడాలు రోజురోజుకు మితిమీరుతున్నాయి. పోలీసులు వారి పై శాఖాపరమైన చర్యలు తీసుకోవటంలో కొంత వెనకడుగు వేయటం వలన వారు మరింత రెచ్చిపోతున్నారు. జనసంచారం రద్దీగా ఉండే ప్రాంతంలోనే మందుబాబులు ఒకరి పై ఒకరు దాడులకు పాల్పడుతున్నారు. దీంతో పాదచారులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం రాత్రి గాంధీనగర్ ఐలాపురం సెంటర్ వద్ద సుమారు ఏడు, ఎనిమిది మంది మందుబాబులు డబ్బుల వ్యవహారంలో గొడవపడి రెండు వర్గాలుగా విడిపోయారు. మద్యం మత్తులో ఓ వర్గం మరో వర్గంలోని ఇద్దరి పై తీవ్రంగా గొడవపడి కొట్టారు. దీంతో రెండు వర్గాలు రోడ్డుమీద బాహాబాహీకి దిగాయి. రోడ్డు మధ్యలోనే మందుబాబులు కొట్టుకోవటంతో అక్కడ ఏమి జరుగుతుందో తెలియక వాహనాల్లో వెళ్లేవారు ఆశ్చర్యంగా నిలబడి చూశారు. స్థానికులు, పాదచారులు మాత్రం వారు కొట్టుకోవటంతో భయభ్రాంతులకు గురి అయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న సత్యనారాయణపురం, గవర్నర్‌పేట పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లేసరికి కొందరు మందుబాబులు అక్కడి నుంచి పరారయ్యారు. గొడవ పడిన వారు బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ సభ్యులని పలువురు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆయా పోలీసు స్టేషన్ల అధికారులు నిత్యం రద్దీగా ఉండే గాంధీనగర్, హనుమాన్‌పేట ప్రాంతాలలో మందుబాబులతో పాటు, గంజాయి, బ్లేడ్ బ్యాచ్ సభ్యుల పై నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



గాంధీనగర్‌లో రోడ్డుపైనే కొట్టుకుంటున్న మందుబాబులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

- పోలీస్ స్పోర్ట్స్‌మీట్ ప్రారంభించిన జిల్లా న్యాయాధికారి

మచిలీపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగించడంతోపాటు, క్రమశిక్షణ అలవరుస్తాయని జిల్లా ప్రధానన్యాయాధికారి అరుణసారిక అన్నారు. మచిలీపట్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో స్పోర్ట్స్‌మీట్-2024ను మంగళవారం ఆమె ఎస్పీ ఆర్.గంగాధరరావు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇటీవల వరదల సమయంలో పోలీసులు ప్రజలకు చేసిన సేవలు అభినందనీయమన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ, రెండురోజులపాటు పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో వ్యక్తిగత విభాగాలతోపాటు కబడ్డీ, వాలీబాల్, టగ్‌ఆఫ్‌వార్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోలీసులు విధులతోపాటు క్రీడాస్ఫూర్తితో వ్యవహరించాలన్నారు.

దేవస్థానం భూమి కబ్జా చేయలేదు

- నిబంధనల ప్రకారమే కౌలుకు తీసుకున్నా
- అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అంబాపురంలోని శ్రీదాసాంజనేయ దేవస్థానానికి చెందిన ఎకరం పది సెంట్లు భూమిని దేవస్థానం నిబంధనల ప్రకారమే కౌలుకు తీసుకున్నాను తప్ప, కబ్జా చేయలేదని అంబాపురం సర్పంచ్ గండికోట సీతయ్య తెలిపారు. మంగళవారం అంబాపురంలో దేవస్థానం కమిటీతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సీతయ్య మాట్లాడుతూ దేవస్థానం కమిటీ, గ్రామ పెద్దల సమక్షంలో దేవస్థానానికి చెందిన 4 ఎకరాల 90 సెంట్ల భూమిలో ఎకరం పది సెంట్లు ఏడాదికి నెలకు సుమారు 65 వేల రూపాయలు చెల్లించి కౌలుకు తీసుకున్నట్టు చెప్పారు. గ్రామంలో కొందరు కావాలని తనపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. దేవస్థానం కమిటీ కోశాధికారి వసంతకుమార్ మాట్లాడుతూ, సర్పంచ్ సీతయ్యకు నిబంధనల ప్రకారమే ఎకరం పది సెంట్లు భూమిని పదేళ్ల పాటు కౌలుకు ఇచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో దేవస్థానం కమిటీ ప్రెసిడెంట్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. అయితే రికార్డులలో భూమి ఎలా మారిందన్న దానిపై మాత్రం వారు వివరణ ఇవ్వలేదు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీట్లో వైసీపీ కార్పొరేటర్ భర్త



శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీటులో దర్జాగా కూర్చున్న వైసీపీ మహిళా కార్పొరేటర్ భర్త శ్రీరాములు

విజయవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆయన వైసీపీ కార్పొరేటర్ భర్త... ఆయనకు ఎటువంటి అధికారం లేకపోయినా... దర్పం ప్రదర్శిస్తూ అధికారులు, ఉద్యోగులపై హుకుం జారీ చేస్తున్నాడు. తనను సార్ అంటూ సంబోధించాలని డివిజన్ అధికారులు, సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నాడు. ఏకంగా డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీటులోనే దర్జాగా కూర్చొని హడావుడి చేస్తున్నాడు. సెంట్రల్ నియోజకవర్గంలోని 64వ డివిజన్ వైసీపీ మహిళా కార్పొరేటర్ తిరుపతమ్మ భర్త శ్రీరాములు ప్రతి రోజూ ఉదయాన్నే డివిజన్‌లో పర్యటిస్తూ ఆ పనిచేయాలి, ఈ పని చేయాలంటూ అధికారులు, సిబ్బందిని బెదిరిస్తున్నాడు. కొందరు సిబ్బంది అయితే తమ విధులను పక్కనపెట్టి శ్రీరాములు చెప్పిన పనులే చేస్తున్నారని పలువురు సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఏకంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీటులోనే కూర్చొని వారికి ఆదేశాలు ఇవ్వటం ఏమిటని విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారులను ప్రతి నెలా డబ్బులు కూడా ఇవ్వాలంటూ డిమాండ్ చేస్తున్నాడని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గిరిజన తండాలో మరో కిడ్నీ మరణం



ఎ.కొండూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కిడ్నీ వ్యాధితో గిరిజన తండాలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఎ.కొండూరు చైతన్యనగర్ తండాకు చెందిన మాలవతు ధనమ్మ (60) కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. ఇటీవల వ్యాధి తీవ్రత పెరిగి మంగళవారం మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. తండాలో వరుస కిడ్నీ మరణాలతో వాధి బాధితులు ఆందోళన చెందుతున్నారు. మృతురాలి కుటుంబసభ్యులకు మట్టి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ. 10 వేలు ఆర్థిక సాయాన్ని వీఆర్వో అందజేశారు.

లంచం వ్యవహారంలో రాజమండ్రి సీఐపై వేటు



గుడివాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ టూటౌన్ సీఐగా పనిచేసిన కాలంలో లంచం వసూలు కేసులో ప్రస్తుత రాజమండ్రి సీఐ దుర్గారావును సస్పెండ్ చేస్తూ ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ ఆదేశాలిచ్చారు. 2022లో భూ వివాదంలో దుర్గారావుపై ఫిర్యాదుదారుడు ఏసీబీని ఆశ్రయించారు. రెండు వర్గాలకు సంబంధించి రూ.30లక్షల వివాదాన్ని పరిష్కరించే క్రమంలో సీఐ దుర్గారావు కొన్ని డాక్యుమెంట్‌లను బలవంతంగా తీసుకుని వ్యతిరేకవర్గానికి ఇవ్వగా సదరు డాక్యుమెంట్‌లను వెనక్కి ఇవ్వాలని ఫిర్యాదుదారుడు సీఐని కోరాడు. దానికి సీఐ డబ్బులు డిమాండ్ చేయడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. దర్యాప్తులో నేరం రుజువు కావడంతో సీఐ దుర్గారావుపై క్రిమినల్ కేసు పెట్టి సస్పెండ్‌కు సిఫారసు చేస్తూ ఐజీ అశోక్‌కుమార్ ఉత్తర్వులిచ్చారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	115, 124, 135
చికెన్ విత్ స్కిన్	216
చికెన్ స్కిన్‌లెస్	226

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 575

సర్వోత్తమ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభ నేడు

పటమట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభ బుధవారం సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని కార్యదర్శి రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయం అధ్యక్షుడు డాక్టర్ కె పట్టాభిరామయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, విజయవాడ ఆకాశవాణి రిటైర్డు డైరెక్టర్ ఎం. కృష్ణకుమారి, శారద కళా సమితి అధ్యక్షుడు డోకిపర్తి శంకరరావు, గ్రామిక విద్యాపీఠ్ అధ్యక్షులు విద్యాఖన్నా పాల్గొంటారని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేస్తారని తెలిపారు.

కోట్లు వెచ్చించి నిర్మించారు

- నేటికీ టెండర్లు పిలవని వైనం
- శిథిలావస్థలో దుకాణాలు

(గుణదల, ఆంధ్రజ్యోతి)

నగరంలో బస్‌షెల్టర్లను సుందరీకరణ చేసేందుకు వీఎంసీ అధికారులు కోట్లు వెచ్చించి దశాబ్ద కాలం పూర్తయింది. బస్ షెల్టర్‌కు అనుసంధానంగా పక్కనే ప్రతి బస్‌షెల్టర్ వద్ద వ్యాపారానికి వీలుగా ఓ షట్టర్‌ను ఏర్పాటు చేశారు. అలా బస్‌షెల్టర్ పక్కనే ఏర్పాటు చేసిన షట్టర్‌ను చిరు వ్యాపారులకు ఇచ్చేందుకు టెండర్లు పిలవాల్సి ఉంది. ఏ ఉద్దేశ్యంతో వాటిని నిర్మించారో తెలియదు కానీ నేటికీ సదరు దుకాణాలకు టెండర్లు పిలవకుండా ఉంచడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కాకుండా ఉంది. కొన్ని చోట్ల దుకాణం నిర్మాణానికి ప్లానింగ్ చేసి సగంలోనే వదిలేసిన ఘటనలూ లేకపోలేదు. ఏలూరు రోడ్డులోని పవర్‌హౌస్ బస్‌షెల్టర్ పక్కన దుకాణ నిర్మాణానికి పునాదులు వేసి వదిలేసిన ఘటన దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు.

బస్‌షెల్టర్ల పక్కనే ప్రయాణికుల అవసరాలు తీర్చేందుకు అవసరమైన దుకాణాలు ఏర్పాటు చేస్తే బాగానే ఉంటుందన్నది నగర వాసుల వాదన. అయితే అధికారులు మాత్రం నేటికీ ఈవిషయమై దృష్టి పెట్టకపోవడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోట్లు వెచ్చించి ఈ తరహా నిర్మాణాలు నగరంలోని ప్రధాన రహదారుల వెంబడి అనగా ఏలూరు రోడ్డు, బందర్ రోడ్డు, ఐదవ నెంబరు రోడ్డు, సింగ్‌నగర్ ఇలా అన్ని ప్రాంతాల్లోనూ పూర్తి చేశారు. నేటికి దశాబ్ద కాలం నుంచి ఇంచుమించుగా ఈ దుకాణాలు ఖాళీగానే ఉన్నాయి. చాలా చోట్ల దుకాణాల షట్టర్లు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరుకుంటున్నా పట్టించుకునే వారు లేరు. ఉన్నతాధికారులు ఈ విషయమై తక్షణమే దృష్టి సారించి బస్‌షెల్టర్ల పక్కనే ఏర్పాటు చేసిన దుకాణాలకు టెండర్లు పిలిచి వాటిని వాడుకలోకి తేవడం తద్వారా ప్రభుత్వానికి ఆదాయం పెంచే ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



నేటికీ మూసి ఉన్న షాపు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పటమట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ తీగలకు ఆటంకంగా ఉన్న చెట్ల కొమ్మలను నరికివేయడంలో భాగంగా బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఈఈ పి హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యూఆర్టీసీ కాలనీ, వల్లభనేని వీధి, ఆర్టీసీ కాలనీ, రామాలయం వీధి, మలయాల స్వామి వీధి, న్యూ ఆర్టీసీ కాలనీ గేట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

25, 26 తేదీల్లో కార్తీక దీపోత్సవం, వ్రతాలు

లబ్బీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్యనారాయణపురంలోని విజ్ఞాన్ విహార్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో కార్తీక దీపోత్సవం (లక్ష), 26న సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు శత సహస్ర (లక్ష) దీపార్చన సేవా మండలి కార్యదర్శి నాగలింగం శివాజీ తెలిపారు. బందరురోడ్డులోని గోకరాజు గంగరాజు కార్యాలయంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగలింగం శివాజీ మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని, వ్రతంలో పాల్గొనదలచిన వారు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాధా మనోహర స్వామి, శ్రీ శైవక్షేత్ర పీఠాధిపతి శివ స్వామీజీ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.బుల్లబ్బాయి, ఎ. శేషుబాబు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గోకరాజు గంగరాజు

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎంపీ చిన్ని

భారతీనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడమే టీడీపీ ప్రధాన లక్ష్యమని ఎంపీ కేశినేని శివనాథ్ పేర్కొన్నారు. తూర్పు పరిధి నాల్గవ డివిజన్ ఏపీఐఐసీ కాలనీలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఎంపీ కేశినేని శివనాథ్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రతో కలిసి మంగళవారం పర్యటించారు. అనంతరం జమైకా అపార్ట్‌మెంట్ వాసులతో తాగునీటి సమస్య పరిష్కారంలో భాగంగా ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ జమైకా అపార్ట్‌మెంట్‌వాసులు ఎప్పటి నుంచో తాగునీటి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఐలాకు జమైకా అపార్ట్‌మెంట్‌వాసులకు మధ్య చిన్న సమస్య ఉత్పన్నమైందన్నారు. అందువల్లనే తాను, ఎమ్మెల్యే గద్దె, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రతో పాటు ఇతర అధికారులను కూర్చోబెట్టి సమస్య పరిష్కరించడానికి చూస్తున్నామన్నారు. ఈ సమస్యను అతి త్వరలోనే పరిష్కరించి జమైకా అపార్ట్‌మెంట్‌వాసులకు తాగునీటిని అందిస్తామని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఈ అపార్టుమెంట్‌లో సుమారు 500 కుటుంబాల ఉంటున్నాయని, వారి సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యత అని అన్నారు. ఐలా, నగర కమిషనర్ కూర్చుని సమస్యపై చర్చించుకోవడం ద్వారా సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అధికారులు కూర్చుని చర్చించుకున్నా పరిష్కారం కాకపోతే మంత్రి లేదా ముఖ్యమంత్రి స్థాయిలో ఈ సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామన్నారు. ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ ఇస్తామని తమ ఎన్నికల మేనిఫెస్టోలోనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, గొల్లపూడి నాగేశ్వరరావు, పాతూరి సాంబశివరావు, సుంకర దుర్గా ప్రసాద్, ఎస్ఈ శేషుకుమార్, ఇంజనీరింగ్ విభాగం అధికారుల శ్రీనాథ్‌రెడ్డి, సామ్రాజ్యం, స్థానిక పెద్దలు కోడూరు ఆంజనేయ వాసు, పి. సీతారామయ్య, ఈడ్పుగంటి వేణుగోపాలరావు, త్రిపురనేని చందు, షేక్ జానీ, బర్మా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



అపార్టుమెంట్ వాసుల నుంచి సమస్యలను స్వీకరిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తదితరులు

26వ డివిజన్లో చురుగ్గా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్, తోట పాండు తదితరులు

గుణదల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 26వ డివిజన్ పరిధిలోని కాకాని నగర్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం చురుగ్గా సాగింది. డివిజన్ ఇన్‌చార్జ్ వల్లభనేని సతీష్ సభ్యత నమోదు తీసుకోవడం వల్ల జరిగే ఉపయోగాలను వివరించారు. సభ్యత్వ నమోదు పారదర్శకంగానే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, స్థానిక నేతలు ఆటో రాజు, ప్రకాష్, కాళిదాసు, శశి, డేవిడ్, సింహాచలం, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





ఆయిల్ మిల్ వద్ద డ్రెయినేజీపై కూరగాయలు అమ్ముతున్న వ్యాపారులు

ఎన్ఎస్ఎంస్కూల్ రోడ్డులో..

ఎన్ఎస్ఎం స్కూల్ వద్ద ఆక్రమణల పర్వం

పటమట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పటమట ఎన్ఎస్ఎం పబ్లిక్ స్కూల్ ముందు రోడ్డు పక్కన మార్జిన్ ఆక్రమించి కొందరు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతంలో ఆయిల్‌మిల్ వద్ద డ్రెయినేజీ మీద కూరగాయల వ్యాపారులు తమ వ్యాపారాలు నిరాటంకంగా చేసుకుంటున్నారు. కూరగాయలు కొనే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డు మీద ఆపి కూరగాయలు కొనుగోలు చేయడంతో నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. వర్షాకాలం మురుగు ముందుకు పారక రోడ్డు మీద ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రదేశమంతా దుర్గంధ భరితంగా మారుతోంది. ఎన్ఎస్ఎం స్కూల్ వద్ద సాయంత్రం నుంచి జంక్‌ఫుడ్ వ్యాపారాలు చేయడంతో ద్విచక్రవాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.సంబంధిత అధికారులు స్పందించి కూరగాయల వ్యాపారులను అక్కడ నుంచి తొలగించి వారికి ప్రత్యామ్నాయంగా మరొక చోటు చూపించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

యాచకుడికి హెల్పింగ్ హ్యాండ్స్ చేయూత

ఆటోనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుడికి మూడు చక్రాల సైకిల్‌తోపాటు మొబైల్ టీ క్యాంటీన్ ఏర్పాటు చేసి అందించినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ వెంకట్ తెలిపారు. సింగ్‌నగర్‌కు చెందిన సాంబ అనే దివ్యాంగుడు తన కుటుంబ పోషణ కోసం యాచన చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. అతని ఇద్దరి పిల్లల్ని ఆశ్రమంలో చేర్పి వారి చదువుకు సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. నూతన వ్యాపారానికి కావాల్సిన సామాగ్రి అందించినట్లు వెంకట్ తెలిపారు.



ప్రమాదం కేసులో లారీడ్రైవర్‌కు ఏడాది జైలు

ఆటోనగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదం కేసులో నేరం రుజువు కావడంతో గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన లారీ డ్రైవర్ వాడపల్లి బాల జోజప్పకు ఏడాది జైలు శిక్ష, రూ. 1500 జరిమానా విధిస్తూ మూడవ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పి. తిరుమలరావు మంగళవారం తీర్పునిచ్చారు. పటమట పోలీస్ స్టేషన్‌లో పరిధిలో రామకృష్ణాపురానికి చెందిన సింగంపల్లి అప్పారావు ఫౌండ్రీ పనిచేసుకొని జీవిస్తున్నాడు. విధుల్లో భాగంగా 2017 జూన్ 8న ప్రసాదంపాడు వద్ద తనతో పాటు డ్యూటీ ఎక్కవలసిన స్టోర్ కీపర్ తిరుమలరావుతో బండి మీద వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎనికేపాడు 24కె డివైడర్ కటింగ్ క్రాస్ చేసి ఫౌండ్రీ గేటు వద్దకు వచ్చే సరికి గన్నవరం నుంచి విజయవాడ వైపు వస్తున్న లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో బండి మీద ఉన్న తిరుమలరావు అక్కడికక్కడే మృతి చెందాడు. సింగంపల్లి అప్పారావు ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరుపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. గంగాధర్, సీఎంఎస్ ఇన్‌స్పెక్టర్ జగదీశ్వరరావు, ఎస్ఐ రెహమాన్ జానీల పర్యవేక్షణలో 9 మంది సాక్షులను విచారించి నేరం రుజువైనందున శిక్ష ఖరారు చేశారు.

ఘనంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి

గవర్నర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు ఇందిరాగాంధీ ప్రాణత్యాగానికి సైతం సిద్ధపడ్డారని ఏఐసీసీ సభ్యుడు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. పీసీసీ, సిటీ కాంగ్రెస్‌ల ఆధ్వర్యంలో మంగళవారం ఆంధ్రరత్న భవన్‌లో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ విగ్రహానికి పీసీసీ, సిటీ కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన నేతలు ఇందిరాగాంధీ సేవల్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ, కాంగ్రెస్ నేతలు అశోక్ షారోన్, షేక్ అబ్దుల్ అన్సారీ, పోతురాజు, ఏసుదాసు, హెచ్ఎస్ బేగ్, పిఠాపురం ప్రమీలగాంధీ, యూత్ కాంగ్రెస్ నేతలు గొల్ల పవన్, పీటర్ జోసెఫ్, అబ్దుల్ రహీం, జక్కుల పృథ్వీ, కొమ్మినేని సురేష్, వివిధ డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.



ఇందిరాగాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

సైన్స్ పాఠాలు సులభంగా బోధించాలి

- జిల్లా సైన్స్ అధికారి హుస్సేన్

లబ్బీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఒక మంచి సైన్స్ టీచర్ పాఠశాల విజయానికి కారణం అవుతారని జిల్లా సైన్స్‌అధికారి డాక్టర్ షైనం హుస్సేన్ అన్నారు. సీవీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లోని కాప్మెక్స్ బయలాజికల్ సైన్స్ ల్యాబ్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన టీచర్స్‌తో, విద్యార్థులతో మాట్లాడుతూ అన్నీ పాఠశాలల్లో సైన్స్ అంశాలు మంచి వాతావరణంలో సులభంగా బోధించాలని, పాఠశాలల్లో ఉన్న సైన్స్ పరికరాలు ఎప్పటికప్పుడు శుభ్రపరిచి భద్రపరచాలని సూచించారు. ల్యాబ్‌ను పరిశీలించిన ఆయన ల్యాబ్ పరిశుభ్రంగా ఉంచిన తీరుతో పాటు, పరికరాల అమరికపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సైన్స్ టీచర్ నెహ్రూ, శివ, మన్మథ, లింగారెడ్డి, గుంటూరు సైన్స్ అధికారి మీరావలి తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా సైన్స్ అధికారి ఎం. హుస్సేన్



దుర్గగుడిలో సహస్ర లింగార్చన సేవ

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్ర లింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్ర లింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. స్వామిని పుష్పాలు, బిల్వాలు, పండ్లతో నయనమనోహరంగా అలంకరించారు.

మర్యాదపూర్వక కలయిక

అజిత్‌సింగ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కార్మిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్‌కు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

తనకు బోర్డు చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, నేతలు దాసరి కనకారావు, చరణ్ యాదవ్, కాకు మల్లికార్జున యాదవ్ తదితరులు ఉన్నారు.

సిద్ధార్థ మహిళా కళాశాలలో మైండ్‌స్పార్కిల్ 2కే24

లబ్బీపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సాఫ్ట్‌స్కిల్స్, పోటీతత్వం వారి అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎస్.కల్పన అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో మంగళవారం కళాశాల స్టాటిస్టిక్స్, ఎలక్ట్రానిక్స్ సంయుక్త ఆధ్వర్యంలో మైండ్ స్పార్కిల్ 2కె24 అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, పి. సాంబశివరావు, కళాశాల స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి తదితరులు పాల్గొన్నారు.

లారీస్టాండ్‌లో అక్రమ వసూళ్లు

● వీఎంసీ ఆదాయానికి గండి ● కార్పొరేషన్ అధికారులకు వాటా

భవానీపురం లారీస్టాండ్‌లో స్థానికంగా ఉంటున్న కొందరు లారీల పార్కింగ్ చేసేందుకు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరి నుంచి వీఎంసీలోని సంబంధిత అధికారులకు కూడా మామూళ్లు అందుతున్నట్టు విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవటంతో వీఎంసీ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. వైసీపీ ప్రభుత్వంలో నాయకులతోపాటు అక్రమ వసూళ్లకు పాల్పడిన వారే ప్రస్తుతం ఈ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. లారీస్టాండ్ ప్రాంగణంలోని వ్యాపారులు కూడా కార్పొరేషన్‌కు అద్దెలు కట్టకుండా షాపులు వినియోగించుకుంటున్నారు.

- విద్యాధరపురం - ఆంధ్రజ్యోతి



భవానీపురం లారీ స్టాండ్ ప్రాంగణంలో పార్కింగ్ చేసిన వాహనాలు.

భవానీపురం జాతీయ రహదారి పక్కనే విజయవాడ నగరపాలక సంస్థకు సుమారు నాలుగున్నర ఎకరాలకు పైగా ఖాళీస్థలం ఉంది. అందులో రెండు వాటర్ ట్యాంకులు నిర్మించారు. మిగిలిన స్థలంలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చే లారీలను నిలిపేందుకు వినియోగించేవారు. ఇబ్రహీంపట్నం నుంచి వచ్చే వాహనాల రద్దీ ఎక్కువగా ఉండటంతో లారీస్టాండ్‌ను సుమారు 15 ఏళ్ల క్రితం ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌కు తరలించారు. కన్వెన్షన్ వీఎంసీ ఆధ్వర్యంలో లారీస్టాండ్ నిర్వహించారు. అయితే ఇక్కడ లారీస్టాండ్ ప్రాంగణంలోని వ్యాపారులు అక్కడికి వెళ్లకుండా ఇక్కడే వ్యాపారాలు చేస్తున్నారు. ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభం కావటంతో లారీల రాకపోకల నిమిత్తం ఆ స్థలంలో లారీల నిలుపుదల పూర్తిగా నిలిపేశారు. వైసీపీ ప్రభుత్వంలో స్థానిక నేతలు ఈ లారీ స్టాండ్‌ను తమ ఆధీనంలోకి తీసుకుని భవానీపురం లారీ ఓనర్స్ అసోసియేషన్ పేరుతో అనధికారిక కార్యాలయాన్ని ప్రారంభించారు. కఅక్కడి నుంచి లారీలను నిలిపేందుకు ఒక్కో లారీ వద్ద నుంచి అసోసియేషన్‌లో సభ్యత్వం ఉంటే రోజుకు రూ.100, లేకుంటే రూ.200, భారీ వాహనాలకు రూ.300 అనధికారికంగా వసూలు చేస్తున్నారు. రోజు సుమారు రూ.10వేలకు పైగా వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది.



లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం

అద్దె చెల్లించని వ్యాపారులు

లారీ స్టాండ్ ప్రాంగణంలో సుమారు 35 షాపులు పైనే ఉన్నాయి. ఆయా షాపుల నిర్వాహకులందరూ వీఎంసీకి అద్దె చెల్లించకుండా అనధికారికంగా నిర్వహిస్తున్నారు. అటు అసోసియేషన్ నేతలు కూడా డబ్బులు కట్టకుండా కార్యాలయాన్ని వాడుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొనసాగించినట్టే ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ వారి హవా కొనసాగుతోంది. ఈ వ్యవహారంలో వీఎంసీ ఎస్టేట్ అధికారి అండదండలు ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అధికారికి అక్రమంగా వసూలు చేసిన డబ్బుల్లో సగం వాటా అందిస్తున్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయన చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు

రాత్రివేళల్లో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జోరుగా సాగుతున్నాయని ఆరోపిస్తున్నారు. బ్లేడ్‌బ్యాచ్, గంజాయిబ్యాచ్ సభ్యులకు, మందుబాబులకు ఈ స్టాండ్ కేంద్రంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాక కొంతమంది ఆటో డ్రైవర్లు రాత్రివేళలో ఇతర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. వీఎంసీ కమిషనర్ స్పందించి లారీస్టాండ్‌లో జరుగుతున్న అక్రమ వసూళ్లపై దృష్టి పెట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జీవో-1ను పునరుద్ధరించాలి

● ఎంపీకి ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగ సంఘాల నేతల వినతి

బస్టేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): 2019లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఆర్టీసీ ఉద్యోగులపై విధించిన శిక్షలకు సంబంధించి జీవో-1 విడుదల చేశారని, దానివల్ల ఉద్యోగులు మేలు పొందారని, అయితే వైసీపీ ప్రభుత్వం దానిస్థానే 70,71 జీవోలు విడుదల చేసి పాత పద్ధతిలో ఉద్యోగులపై శిక్షలు అమలు చేశారని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)కి ప్రజా రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు తెలిపారు. మంగళవారం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు, సలహాదారు ఎం. తిరుపతి రావు ఆధ్వర్యంలో నేతలు పి.సుబ్రహ్మణ్యం, ఎ.ముక్తేశ్వరరావు, పి.శ్రీనివాసులు, కె.వి.ఆర్.రావు, ఎం.ఎల్.ఎల్. రావు ఎంపీకి శివనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ 70, 71 జీవోల వల్ల ఇబ్బందులు పడుతున్నామని, దాన్ని రద్దు చేసి జీవో-1ని పునరుద్ధరించాలని కోరారు. దీనిపై ఎంపీ శివనాథ్ స్పందిస్తూ ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకువెళతానని చెప్పారు.



ఎంపీ కేశినేనికి మొక్కను ఇస్తున్న అసోసియేషన్ నేతలు



అమ్మవారికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే యార్లగడ్డ

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయన అమ్మవారిని దర్శించుకుని అయిదు వరుసలున్న 50 గ్రాముల బంగారు చంద్రహారం, 8 గ్రాముల బంగారు లక్ష్మీ లాకెట్ కలిసిన దండ, రెండు పట్టు చీరలను డిప్యూటీ ఈవో రత్నరాజు ద్వారా దేవస్థానానికి కానుకగా ఇచ్చారు. ఆయనకు శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం, వేద ఆశీస్సులు అందజేశారు.



పోస్టుకార్డులతో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

వలంటీర్ల పోస్టుకార్డుల ఉద్యమం

గవర్నర్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే వలంటీర్ల సమస్యపై చర్చించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వలంటీర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు డిమాండ్ చేశారు. వలంటీర్లకు న్యాయం చేయాలని కోరుతూ అసోసియేషన్, ఏఐవైఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక రాఘవయ్యపార్కు వీధిలోని బకింగ్‌హామ్ పోస్టాఫీసు వద్ద వలంటీర్లు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టి నిరసన తెలిపారు. పెద్దసంఖ్యలో వలంటీర్లు పోస్టుకార్డులను ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, అసెంబ్లీ స్పీకర్‌కు పోస్టుకార్డులు బాక్సుల్లో వేశారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ వలంటీర్లకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, 2.6 లక్షల మంది వలంటీర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వలంటీర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్. మమత, పి. రాజ్‌కుమార్, షేక్ అబ్దుల్ ఖాదర్, జిలాని, విజయదుర్గా, కె. రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, ఏఐవైఎఫ్ నేతలు లంకె సాయి, సీహెచ్ శ్రీధర్, శీరం రవికుమార్ పాల్గొన్నారు.

సీనియర్ డబుల్స్ టెన్నిస్ టైటిల్ విజేత మల్లికార్జునరావు

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన టెన్నిస్ పురుషుల డబుల్స్ సీనియర్ ప్లేయర్ ఎం మల్లికార్జునరావు టైటిల్‌తో సత్తా చాటారు. పాలకొల్లులో ఈ నెల 17న ముగిసిన ఆలిండియా సీనియర్ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో 75 ప్లస్ విభాగంలో డబుల్స్‌లో మల్లికార్జునరావు, పి బాస్కరరావు (హైదరాబాద్)తో కలిసి ఎన్ శేషసాయి (బెంగళూరు), వీఎస్ నాయుడు (అనకాపల్లి) జంటపై 9-2తో గెలిచి టైటిల్‌ను వశం చేసుకున్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావును ఉమ్మడి కృష్ణాజిల్లా టెన్నిస్ అసోసియేషన్ ప్రతినిధులు, ఇతర ప్లేయర్స్ అభినందించారు.



డబుల్స్ టైటిల్‌తో మల్లికార్జునరావు

టీబీ నివారణకు కృషి చేద్దాం

● ఆరోగ్యశాఖ కమిషనర్ కరుణ పిలుపు

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీబీ నివారించగలిగే వ్యాధి అని, సమాజంలో ప్రతి ఒక్కరూ ఆ వ్యాధి నివారణకు కృషి చేయాలని ఆరోగ్యశాఖ కమిషనర్ వాకాటి కరుణ పిలుపునిచ్చారు. ఏపీ టీబీ విభాగం, టాటా ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా విజయవాడలోని ఫెరిస్, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారులకు హయ్‌ల్యాండ్‌లో రెండు రోజుల శిక్షణ తరగతులను ఆమెను ప్రారంభించారు. ప్రతి ఒక్క అధికారి తమ జిల్లాకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను రూపొందించుకోవాలని సూచించారు. ఇంతకు ముందు టీబీతో బాధపడి బయటపడిన వారికి శిక్షణ ఇచ్చి, వారి సేవలను కూడా ఉపయోగించుకోవాలన్నారు. అలాగే రోగి పూర్తిగా మందులు వాడేలాగ కౌన్సెలింగ్ చాలా అవసరమన్నారు. ఏపీలో టీబీ వ్యాధి నిర్ధారణకు ముందున్నవాటి ట్రూనాట్, సీబీనాట్ మెషిన్లను 780 ల్యాబ్‌లలో ఏర్పాటు చేశామని, ఇది మంచి పరిణామన్నారు. క్షయ నివారణ నోడల్ అధికారి డా.టీ.రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల జారీలో

పారదర్శకంగా పనిచేయాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల జారీలో కచ్చితంగా పారదర్శకంగా పనిచేయాలని, ఆన్‌లైన్‌లో వచ్చిన బాధితుల దరఖాస్తులను సక్రమంగా పరిశీలించాలని కమిషనర్ ధ్యానచంద్ర కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమిషనర్ ఛాంబర్‌లో టీడీఆర్ బాండ్ల కమిటీ సమావేశం జరిగింది. గుణదల, దుర్గాకళరోడ్డు, ఎంజీరోడ్డు నుంచి ఎన్టీఆర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఆటోనగర్ వరకు టీడీఆర్ బాండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలపై కమిటీ చర్చించింది. ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ రోడ్ల అభివృద్ధి ప్రణాళికలో భాగంగా మాస్టర్‌ప్లాన్ ప్రకారం స్థలం, నిర్మాణ కోల్పోయిన ప్రజలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి టీడీఆర్ బాండ్లు ఇచ్చేందుకు కమిటీ దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటుందన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తుల ప్రకారం 31 టీడీఆర్ బాండ్లను కమిటీ సభ్యులు పరిశీలించారన్నారు. చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, ఆర్డీవీ, డీటీసీపీ రాజమహేంద్రవరం శ్రీనివాస్ మూర్తి, డీటీసీపీ (ఏపీసీఆర్డీఏ) వీ.సునీల్, సెంట్రల్ తహసీల్దార్ వెంకటరామయ్య, నార్త్ తహసీల్దార్ సూర్యారావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ గాంధీనగర్ ఆరీఫ్, పటమట రేవంత్, గుణదల సందీప్‌రావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు మోహన్‌బాబు, రాంబాబు, టీపీఎస్ వసంత్‌జీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధ్యానచంద్ర

మెరుగైన పెన్షన్ కావాలి

రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగుల ధర్నా

ధర్నాచౌక్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమకు మెరుగైన పెన్షన్ కావాలని, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని రిటైర్డ్ బ్యాంక్ ఉద్యోగులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు యునైటెడ్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐబీఆర్‌ఎఫ్ సంయుక్త ప్రధానకార్యదర్శి విశ్వనాథ్ నాయక్ మాట్లాడుతూ 1960 నుంచి దేశ ఆర్థికాభివృద్ధికి బ్యాంక్ ఉద్యోగులు ఎనలేని సేవలందించారన్నారు. వీరికి 1993 నుంచి నేటి వరకు పెన్షన్ అప్‌డేట్ జరగలేదని, ఇది ప్రభుత్వాలు, బ్యాంకుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విశ్రాంత బ్యాంక్ ఉద్యోగుల పట్ల కేంద్రప్రభుత్వం వివక్షత చూపిస్తూ అన్యాయం చేస్తుందన్నారు. సంక్షేమ నిధి బాగాన్ని 50 శాతం వరకు పెంచాలని, ఆరోగ్య బీమా ప్రయోజనాలను మెరుగుపరచాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు చేయాలని, ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ తొలగించాలని, ప్రత్యేక భత్యాలను పెన్షన్ అర్హతలో కలపాలని విశ్రాంత బ్యాంక్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ (ఏపీబీఆర్ఎఫ్) అధ్యక్షుడు బీవీకొండలరావు అధ్యక్షత జరిగిన ఈ ధర్నాలో నేతలు ఎల్లారావు, వి.జగన్‌మోహన్‌రావు, ఆంజనేయరాజు పాల్గొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర నేత జి.ఓబులేసు, సీఐటీయూ నేత సీహెచ్.బాబూరావు దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు.



ధర్నా చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

22న అండర్-19 క్రికెట్ సెలక్షన్స్

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 9 గంటలకు మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ డిగ్రీ సైన్స్ అండ్ కళాశాల గ్రౌండ్స్‌లో జిల్లాస్థాయి క్రికెట్ టీమ్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వీ రవికాంత ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు, పీడీలు గమనించి జిల్లా ప్లేయర్ ఎంట్రీ ఫారమ్‌తో పెన్ నెంబర్ డేట్ ఆఫ్ బర్త్, ఇతర వివరాలను పూర్తి చేసి తీ సుకురావాలన్నారు. 10వ తరగతి ఒరిజనల్ మార్కుల లిస్ట్, ప్రస్తుతం చదువుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సంతకంతో పాటు, ఆధార్, స్టడీ సర్టిఫికెట్‌తో రావాలన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ, ఓపెన్ ఇంటర్ చదివే క్రీడాకారులు పాల్గొనేందుకు అవకాశం లేదని వివరించారు.

క్రీడా సంఘాల్లో వివాదాల పరిష్కారానికి ఆదేశాలివ్వండి

● చంద్రబాబుకు కేపీ రావు విజ్ఞాపన

విజయవాడ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో క్రీడాసంఘాల మధ్య వివాదాలను పరిష్కరించడానికి, అసోసియేషన్లు వీటిని పరిష్కరించుకునేందుకు కాలపరిమితి విధించేలా తగు ఆదేశాలివ్వాలని సీఎం చంద్రబాబును ఈ-మెయిల్‌లో కోరినట్టు ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కేపీ రావు తెలిపారు. శాప్ ఆంధ్ర కబడ్డీలో మూడు గ్రూపుల మధ్య వివాదాల పరిష్కారానికి ఇచ్చిన ఆదేశాలకు ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఆంధ్ర కబడ్డీ, ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్, ఏపీ హాకీ అసోసియేషన్, ఏపీ త్రైక్వాండో, ఏపీ బేస్‌బాల్, వాలీబాల్, షూటింగ్‌బాల్, జూడో అసోసియేషన్, ఏపీ ఒలింపిక్ అసోసియేషన్ మొదలైనవి ఇంకా పరిష్కరించబడలేదన్నారు. జాతీయ ఛాంపియన్‌షిప్‌ల సమయంలో క్రీడాకారులు దరూ ఒక రాష్ట్ర జట్టులో అందరూ జాతీయ పోటీల్లో పాల్గొనడానికి సరైన న్యాయం చేయాలని, క్రీడాకారుల భవిష్యత్తును కాపాడాలని కేపీ రావు విన్నవించారు.

సమస్యలు పరిష్కరించండి.. లేదంటే నిరసిస్తాం

● ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్

బస్టేషన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ డిపోలు, డీటీవో ఆఫీసుల ఎదుట నిరసనలను నిర్వహించనున్నట్టు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వర్కింగ్ కమిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 1/2019లో జారీచేసిన సర్క్యులర్‌ను అమలు చేయాలని నైట్ అవుట్, డే అవుట్‌లో ఇన్సెంటివ్ టీఏ బిల్లులు, ఇతర అలవెన్సులను చెల్లించాలని ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్‌లో గతంలో ఉన్న వైద్య సౌకర్యాలను పునరుద్ధరించాలని, కొత్త బస్సులు కొనాలని, రిక్రూట్‌మెంట్ చేపట్టాలని కోరారు. పనిభారాలు, వేధింపులు, పనిష్మెంట్లు లేకుండా ఆత్మగౌరవంతో తమ విధులను నిర్వహిస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరుతూ నిరసనలు చేపట్టినట్టు, నిరసనలలో ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

సనాతన ధర్మానికి విఘాతం వద్దు

● దుర్గామల్లేశ్వరులకు శారదా పీఠ ఉత్తరాధికారి ప్రత్యేక పూజలు

● అపౌరుషేయ మహాభాగవత గ్రంథావిష్కరణ



మహాభాగవత పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న విదుశేఖర మహాభారతీస్వామి, చిత్రంలో ఈవో

వన్‌టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మానికి హాని కలిగితే మొత్తం ప్రపంచానికి హాని కలుగుతుందని దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠ ఉత్తరాధికారి విదుశేఖర మహాభారతీస్వామి భాషించారు. విజయవాడలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం ఇంద్రకీలాద్రిపై దుర్గ, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు. శివుడికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి అనుగ్రహ భాషణం చేశారు. కనకదుర్గ కన్నెలుగా ఆశీనులైన ఆయనకు ఈవో రామారావు దంపతులు సంప్రదాయం మేరకు వస్త్రాలు, పండ్లు సమర్పించారు. ఇదే సమయంలో అపౌరుషేయ సంస్కృత మహాభాగవత గ్రంథాన్ని ఈవో రామారావు స్వామికి అందచేయగా, ఆయన ఆవిష్కరించి శుభాశీస్సులు అందజేశారు. అనంతరం ఆయన అనుగ్రహ భాషణ చేస్తూ విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానానికి శృంగేరి శారదాపీఠానికి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని గుర్తు చేశారు. ఇక్కడికి తాము ఆరేళ్ల క్రితం ఆలయానికి వచ్చామని, మళ్లీ ఇప్పుడు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నామన్నారు. ఇక్కడ సనాతన ధర్మానికి, సంస్కృతికి పూర్తిస్థాయిలో చోటుందన్నారు. అర్జునుడు యుద్ధంలో గెలవాలంటే అమ్మవారి అనుగ్రహం తప్పక కావాలని శ్రీకృష్ణుడు చెప్పటం విశేషమన్నారు. సనాతన ధర్మం బాగుంటేనే లోకం అంతా బాగుంటుందని, ఈ ధర్మంలో తాను, తన కుటుంబం బాగుపడాలనేది కాకుండా సర్వే జనా: సుఖినో భవంతు అని ఉంటుందని ఇదే ధర్మం ప్రధాన అంశమన్నారు. ఈవో రామారావు మాట్లాడుతూ స్వామివారు అమ్మవారి దర్శనానికి రావటం మనందరినీ అనుగ్రహించి భాషణ చేయటం ఎంతో పుణ్యప్రద మని తాను భావిస్తున్నట్టు చెప్పారు. శారదా అమ్మవారి పీఠం నుంచి దేవదాయ శాఖకు మన రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ప్రజలకు, దుర్గమ్మ ఆలయానికి శుభాశీస్సులు ఉన్నాయన్నారు. మల్లేశ్వరాలయం శిథిలావస్థలో ఉండగా స్వామి సూచనల మేరకు పునరుద్ధరించామని, దాత నంగా నరసింహారావు సహకరించారని, స్వామి సూచనల మేరకు ఆలయాన్ని తీర్చిదిద్దారన్నారు. కనకదుర్గావైభవం గురించి పూర్తిస్థాయిలో గ్రంథాలు లేని కొరతను గమనించి పుస్తకాలను ప్రచురించామని, రాయదుర్గంలోని గురువులు ఆశీస్సులతో ఈ మహాత్తర కార్యక్రమాన్ని చేపట్టి కనకదుర్గా వైభవం పుస్తకాలను ప్రచురించామన్నారు. విదుశేఖర భారతీస్వామివారు ఈ గ్రంథాన్ని ఆవిష్కరించి అనుగ్రహభాషణం చేశారన్నారు. దేవస్థానానికి ఒక వేద పాఠశాల ఉందని, దాన్ని పూర్తిస్థాయిలో తీర్చిదిద్దాలనుకుంటున్నామని, ఆ కోరికను స్వామివారి అనుగ్రహంతో పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

విదుశేఖర మహాభారతీస్వామికి ఘన స్వాగతం

దుర్గగుడికి విచ్చేసిన విదుశేఖర మహాభారతీ స్వామికి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ మన స్వాగతం పలికారు. భక్తులు, ప్రముఖులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఛత్రాన్ని పట్టి చామరాలను వీశారు. ఆదిగురువుగా వచ్చిన పీఠాధిపతికి సంప్రదాయ సిద్ధంగా ఆయనకు ఈవో రామారావు, వేద పండితులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు.





మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్ (చిన్ని) చిత్రంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి, కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజా సమస్యలు పరిష్కరిస్తా

● ఎంపీ కేశినేని శివనాథ్

చిట్టినగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నగరాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేయటంతోపాటు, ప్రజా సమస్యలు పరిష్కరిస్తానని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నగరాభివృద్ధిపై వీఎంసీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనికి ఎంపీతోపాటు ఎమ్మెల్యే సుజనా చౌదరి, వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర వివిధ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విజయవాడ అభివృద్ధి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పార్లమెంట్లో చర్చించి కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను సమకూర్చే దిశగా కృషి చేస్తానన్నారు. కార్పొరేషన్‌కు రాబడి పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. క్రీడలను ప్రోత్సహించేందుకు స్టేడియంలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ నగరంలో రోడ్లు, డ్రైన్లు, బ్రిడ్జిలు, శానిటేషన్, స్మార్ట్ టాయిలెట్స్, డ్రీమ్ వాటర్ డ్రైయిన్ల ఏర్పాటుతోపాటు స్టాటర్జీ బ్యూటిఫికేషన్ వంటి పలు సుందరీకరణ పనులు చేపట్టడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను సూచించారు. వీఎంసీ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర మాట్లాడుతూ నగరాభివృద్ధికి అధికారులందరూ సమిష్టి కృషితో పని చేస్తున్నారన్నారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలంటూ గిరిజన గురుకులాల టీచర్ల ధర్నా

ధర్నాచౌక్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్రవ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని వేడుకున్నారు. గిరిజన గురుకులాల టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జె.మల్లికార్జున్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో మంగళవారం ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ నుంచి గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న 1143 మంది అవుట్ సోర్సింగ్ టీచర్లను మినహాయించాలన్నారు. ఈ నోటిఫికేషన్‌లోనే తమను క్రమబద్ధీకరించాలని, 2022 పీఆర్సీ తమకు అమలు చేయాలని, అవుట్ సోర్సింగ్ నుంచి కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లుగా మార్చాలన్నారు. యూనియన్ నేతలు పరమేష్, విజయకుమార్ నాయక్, బ్రహ్మయ్య, గిరిజన గురుకులాల్లో పనిచేసే టీచర్లు పాల్గొన్నారు.

నిర్మాణమే కాదు.. నిర్వహణ ఆదర్శంగా ఉండాలి

● డిసెంబరు 10 వరకు హమారా శౌచాలయ్- హమారా సమ్మాన్ ప్రచారం

● ప్రత్యేక సర్వే ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక

● గ్రామాలన్నీ ఓడీఎఫ్ ప్లస్‌గా తీర్చిదిద్దేందుకు కృషి

● స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



పోస్టర్లను ఆవిష్కరించిన కొమ్మారెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాపూజీ కలలుగన్న పరిశుభ్ర భారతావని లక్ష్యంగా కేంద్రప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్‌ను ప్రారంభించిందని, ఈ పథకంలో స్వచ్ఛత, పరిశుభ్రతలో విప్లవాత్మక మార్పులొచ్చాయని, మరుగుదొడ్డి, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ (సీఎస్‌సీ) నిర్మాణంతో పాటు నిర్వహణలోనూ ఆదర్శంగా నిలవాల్సిన అవసరముందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ స్పష్టం చేశారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా నీటి, పారిశుద్ధ్య మిషన్ (డీడబ్ల్యూఎస్ఎం) సమావేశంతో పాటు ప్రత్యేక కార్యక్రమంలో చైర్మన్ పట్టాభిరామ్, ఎండీ బి.అనిల్‌కుమార్ రెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ నిధి మీనా పాల్గొన్నారు. ఈసందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి పాటు ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్య కార్మికులను సత్కరించి, లబ్ధిదారులకు వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పట్టాభిరామ్ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం నందర్భంగా హమారా శౌచాలయ్ - హమారా సమ్మాన్ ఇతివృత్తంతో ఈనెల 19 నుంచి డిసెంబరు 10 వరకు ప్రత్యేక ప్రచారాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. ప్రచారంలో మంచి ప్రతిభ కనబరిచిన వారికి పోటీలు బెస్ట్ టాయిలెట్‌కు డిసెంబరు 10న అవార్డులను అందజేయనున్నట్టు వివరించారు. డిసెంబరు 5 నుంచి 9 వరకు నిర్వహించే సర్వే ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించనున్నట్టు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీలు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలతో పాటు విద్యాసంస్థల మరుగుదొడ్లపై దృష్టిసారిస్తున్నామని, డ్రాపౌట్‌తో ముడిపడిన అంశం కాబట్టి ఆ దిశగా విద్యార్థినులకు పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు అందుబాటులో ఉండటం ముఖ్యమన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా మాట్లాడుతూ మరుగుదొడ్డి సౌకర్యమనేది మానవ హక్కులతో ముడిపడిన అంశమని, మంగళవారం ప్రారంభమైన ఈ ప్రత్యేక కార్యక్రమం అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవమైన డిసెంబరు 10 వరకు నిర్వహించనున్నట్టు తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఈడీ బి.అర్జునరావు, జిల్లా గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, డీపీవో పి.లావణ్యకుమారి, ఎన్‌టీఎస్ పీడీ జె.ఉమాదేవి, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎంసుహాసిని, జిల్లా నీటి పారిశుద్ధ్య మిషన్ సభ్యులు పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.


చోరీకేసులో నిందితుల అరెస్ట్

● 27.5 గ్రాముల బంగారు ఆభరణాలు, మోటార్ సైకిల్ స్వాధీనం

విద్యాధరపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో బంగారు ఆభరణాల చోరీ కేసులో అధునాతన సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర ఫౌండ్రీ సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని విచారించగా ఈ దొంగతనాలు బయటపడ్డాయి. ఈనెల 12న ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో ఉదయం 6.20 గంటల సమయంలో నడుచుకుంటూ వెళుతున్న ఓ మహిళ మెడలోని నాన్‌తాడును గుర్తు తెలియని వ్యక్తులు తెంపుకుని పారిపోయారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో బండిపై వస్తూ నిందితులు పోలీసులకు చిక్కారు. నిందితుడు చిట్టూరు కుమార్ హైదరాబాద్‌లో ఉంటాడు. ఇతడిపై అనేక నేరాలున్నాయి. 6 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. పలుమార్లు జైలుకు వెళ్లొచ్చాడు. జైలులో ఉన్నప్పుడు అమలాపురానికి చెందిన యాలంగి కృష్ణ బాబు పరిచయమయ్యారు. కృష్ణబాబు కుమార్ బైక్ దొంగతనాల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. వీరిద్దరూ వచ్చిన బండి కూడా అమలాపురంలో దొంగతనం చేసినదే. వెస్ట్ ఏసీపీ ఎదుర్రావు ఆధ్వర్యంలో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు ఎస్‌.రామకుమార్, భవానీపురం సీఐ కె.ఉమామహేశ్వరరావు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి దొంగతనం కేసును ఛేదించారు.

ఉత్తరాంధ్రలో చలిపులి!

శ్రీకాకుళం కళింగపట్నం దారిలో పొగమంచు



విశాఖపట్నం, చింతపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చలి తీవ్రత పెరిగింది. ప్రధానంగా ఉమ్మడి విశాఖ మన్యంలో జనాన్ని చలిపులి వణికిస్తోంది. మంగళవారం డుంబ్రిగుడలో 8.2, జి.మాడుగులలో 8.4, అరకులోయలో 8.5, పాడేరులో10.9, ముంచంగిపుట్టులో 10.9, గూడెంకొత్తవీధిలో 11.4, చింతపల్లిలో 11.3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

23న అల్పపీడనం: ఈ నెల 21న అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం, దీని ప్రభావంతో 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడుతుందని వాతావరణశాఖ తెలిపింది.

తీరంలో కొంగల కనువిందు



విశాఖపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సాగర తీరంలో కొంగలు కనువిందు చేశాయి. విశాఖపట్నం-భీమిలి బీచ్‌రోడ్డులోని తిమ్మాపురం వద్ద సముద్ర తీరానికి మంగళవారం ఉదయం వందలాది కొంగలు తరలి వచ్చాయి. నగర పరిధిలోని ముడసర్లోవ, కంబాలకొండ, గంభీరం ప్రాంతాల్లో కొంగలు అధికంగా ఉంటున్నాయని, ఆహారం కోసం పలు ప్రాంతాలు తిరుగుతుంటాయని రిటైర్డ్ జువాలజీ ప్రొఫెసర్ డీఈ బాబు తెలిపారు. నీటి వనరులు ఉండడంతో ఈ ప్రాంతంలో కొంగలు అధికంగా ఉన్నట్టు ఆయన తెలిపారు.

పోయిన ఫోన్లు దొరికాయోచ్..!



నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో నడుస్తున్న 'మొబైల్ హంట్'లో ఫిర్యాదిచ్చి రోజులు గడుస్తున్నా ఎలాంటి సమాచారం లేకపోవడంతో బాధితులు పోయిన తమ ఫోన్ల సంగతే మరచిపోయారు. అయితే, ఇటీవల పోలీసులే బాధితులకు ఫోన్లు చేసి 'మీ మొబైల్ దొరికిందని సమాచారమిచ్చారు. మంగళవారం నెల్లూరులోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలుకు చేరుకున్న బాధితులు బిల్లులు చూపించడంతో ఎస్పీ కృష్ణకాంత్ వారికి మొబైళ్లు అందజేశారు. రూ.1.5 కోట్లు విలువజేసే 700 మొబైళ్లను అందించారు.

కాంట్రాక్టు ఉద్యోగుల..

క్రమబద్ధీకరణ జీవో అక్రమం

▸ నేరుగా ఉద్యోగాలను భర్తీచేయండి: టీ హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు 'తెలంగాణ రెగ్యులేషన్ ఆఫ్ అపాయింట్‌మెంట్స్ టు పబ్లిక్ సర్వీసెస్ అండ్ రేషనలైజేషన్ ఆఫ్ స్టాఫ్ ప్యాట్రన్ యాక్ట్-1994'లో సెక్షన్-10ఏను చేరుస్తూ తీసుకొచ్చిన జీవో-16 అక్రమమని, దాన్ని కొట్టివేస్తున్నామని హైకోర్టు ప్రకటించింది. జూనియర్ లెక్చరర్లు, పాలిటెక్నిక్, డిగ్రీ లెక్చరర్లు, ఇతర కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 2016 ఫిబ్రవరి 26న అప్పటి సర్కారు ఈ జీవోను జారీ చేసిన విషయం తెలిసిందే..! కొలువులను నోటిఫికేషన్ల ద్వారా భర్తీ చేయాలే తప్ప.. ఇలా క్రమబద్ధీకరించుకుంటూ పోతే.. ఉద్యోగార్థులకు అన్యాయం జరుగుతుందంటూ పలువురు నిరుద్యోగులు హైకోర్టులో వేర్వేరుగా ఆరు వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున న్యాయవాదులు వాదనలను వినిపించారు. "అర్హులైన నిరుద్యోగులు తమ అర్హతలకు తగ్గట్లుగా ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందాలన్న చట్టబద్ధమైన ఆకాంక్షను, ప్రాథమిక హక్కును ఉల్లంఘించేలా జీవో-16 ఉంది. చట్ట ప్రకారం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా కొలువులను భర్తీ చేయాలని.. కానీ, దొడ్డిదారిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ చెల్లదని, పారదర్శక విధానం లేకుండా సర్వీసుల్లోకి వచ్చిన వారు.. క్రమబద్ధీకరణకు అనర్హులు" అని వివరించారు. అయితే.. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదులు మాత్రం జీవో-16 ద్వారా చేర్చిన సెక్షన్-10 ఏను సమర్థించారు. రెగ్యులరైజయిన పలువురు ఉద్యోగుల తరఫు న్యాయవాది వ్లాదిమిర్ ఖటూన్ మాట్లాడుతూ.. క్రమబద్ధీకరణ అయిన 5,544 మంది ఉద్యోగులను ప్రతివాదులుగా చేర్చకుండా.. వారికి వ్యతిరేకంగా ఆదేశాలివ్వడం కుదరదన్నారు. అయితే ఇప్పటికే ఈసెక్షన్ మేరకు కొలువుల క్రమబద్ధీకరణ జరిగిన ఉద్యోగులను తొలగించాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇకపై డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ తప్ప, క్రమబద్ధీకరణ సరికాదని హితవుపలికింది.

'తేమ' పరీక్షలో పత్తి రైతు చిత్తు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రాల్లో రైతులకు చిత్రవిచిత్ర పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పత్తిని తీసుకెళ్తే సీసీఐ తేమ పరీక్షలో నెగ్గుతోంది. సాయంత్రం తీసుకువస్తున్న పత్తి లాట్లలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో తిరస్కరిస్తున్నారు.

యంత్రాల్లో తేడా...

సీసీఐ కేంద్రాల్లో తేమ శాతం చూసేందుకు బయ్యర్లు రెండు రకాల యంత్రాలను వినియోగిస్తున్నారు. ఒక్కో దానిలో ఒక్కోవిధంగా తేమ శాతం కనిపిస్తోంది. చిన్న ముల్లు ఉన్న యంత్రం 12 శాతం తేమ చూపిస్తే.. పెద్ద ముల్లు ఉన్న యంత్రంలో 15 శాతం కనిపిస్తోంది. జిన్నింగ్ మిల్లుల యజమానులు వినియోగిస్తున్న యంత్రాలకు, సీసీఐ బయ్యర్లు వినియోగిస్తున్న యంత్రాలకు తేడా ఉంటోంది. ప్లాస్టిక్ గోతాల్లో పత్తి తీసుకువస్తే సీసీఐ కేంద్రాల్లో కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు విడిగానే పత్తిని లోడ్ చేసి తీసుకువస్తున్నారు. మినీ ఆటోల్లో పత్తిని ఎక్కువ మొత్తంలో తొక్కడం వల్ల లోపల వేడి పెరిగి తేమ శాతం పెరిగిపోతున్నదని రైతులు చెబుతున్నారు. ఒకే లాట్‌లోని పత్తిలో ఐదు రకాలుగా తేమ శాతం నమోదవుతోంది.

సీసీఐ కేంద్రాల్లో దక్కని మద్దతు!

పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7,521 రైతులకు దక్కడం లేదు. మంగళవారం కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్‌కు 5,480 క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తే.. క్వింటా ధర కనిష్ఠంగా రూ.4,211.. గరిష్ఠంగా రూ.7,014.. మధ్యస్థంగా రూ.6,869 ధర పలికింది. తేమ శాతం ఎక్కువగా ఉందని, పింజ పొడవని సాకులు చెప్పి అధికారులు ధర తగ్గించేస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఆదోని పత్తి మార్కెట్‌కు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా సరిహద్దు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి రైతులు వస్తున్నారు. తేమ శాతం 8 నుంచి 12లోపు ఉంటేనే సీసీఐ కేంద్రాల్లో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. 12 శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే వెనక్కి పంపుతున్నారు. ఈ సమస్యలతో కొందరు రైతులు మార్కెట్‌కు వస్తే.. ఎక్కువ మంది ప్రైవేటుగా అమ్ముకుంటున్నారు.



రోజంతా పడిగాపులే!

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాల్లో సర్వర్లు పనిచేయకపోవడంతో బిల్లింగ్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ఆదోనిలో తెల్లవారుజామున 4 గంటలకు వచ్చిన రైతులు రాత్రి 8-10 గంటల వరకు ఉండాల్సి వస్తోంది. దీంతో ట్రాక్టరు, లారీ యజమానులు అదనపు బాడుగ వసూలు చేస్తున్నారు. దీనివల్ల రైతులపై అదనపు భారం పడుతోంది. పత్తి జిన్నింగ్ పరిశ్రమల యాజమాన్యంతో సీసీఐ అధికారులు కుమ్మక్కై, తేమ, సర్వర్ స్లో అని సాకులు చెబుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

తేమ శాతం పెంచాలి

ఈ ఏడాది విపరీతంగా వర్షాలు కురిశాయి. ప్రస్తుతం చలి కాలం వచ్చేసింది. గాలిలో తేమ శాతం పెరిగింది. ఇటువంటి పరిస్థితుల్లో పత్తి ఆరటం చాలా కష్టం. సీసీఐ అధికారులు తేమ శాతం పెంచి పత్తిని కొనుగోలు చేయాలి.

- మలిపెద్ది లక్ష్మీ నారాయణ, కొర్రపాడు, మేడికొండూరు మండలం

ధర తగ్గించైనా కొనండి

సీసీఐ కేంద్రానికి తెచ్చిన పత్తిని తిరిగి తీసుకువెళ్లడం తలకు వించిన భారం. తేమ శాతం ఎక్కువగా ఉంటే ధర తగ్గించి కొనుగోలు చేయాలి. ఈ విషయంలో అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

- జుటూరి వెంకయ్య, చౌడవరం, గుంటూరు మండలం

డబుల్ బాడుగ పడుతోంది

రెండెకరాల్లో పత్తి సాగు చేశా. దిగుబడి బాగా వచ్చింది. సీజన్ ప్రారంభంలో క్వింటా రూ.10 వేలు పలికితే.. ఇప్పుడు 6-7 వేలకు పడిపోయింది. ఉదయం 6 గంటలకు 10 క్వింటాళ్ల పత్తిని తీసుకొచ్చా. తేమ శాతం ఎక్కువుందని కొనలేదు. అధికారులు జాప్యంతో డబుల్ బాడుగ ఇవ్వాల్సి వచ్చింది.

చిన్నబాబు, గూడూరు, కర్నూలు జిల్లా

పేరుకే మద్దతు ధర

సీసీఐ కేంద్రాల్లో ఎకరాకు 6 క్వింటాళ్లే తీసుకుంటాం అంటున్నారు. అంతకంటే ఎక్కువ వస్తే వ్యాపారికో.. పరిశ్రమకో అమ్ముకోవాలి. పేరుకే మద్దతు ధర. తేమ శాతం ఎక్కువగా చూపి ధర తగ్గించేస్తున్నారు. కేంద్రం వద్ద 12 గంటలకుపైగా ఉన్నా బిల్లింగ్ కాలేదు.

- మిన్నల్లా, పత్తి రైతు, గూడూరు, కర్నూలు

రోడ్ల నిర్వహణ ప్రైవేటుకు

▸ కాంట్రాక్టు కాలపరిమితిపై త్వర్లో నిర్ణయం
▸ రహదారులపై టోల్‌గేట్ల ఏర్పాటు ఉత్తదే
▸ కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు: మంత్రి జనార్దన్‌రెడ్డి ఆగ్రహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో రహదారుల నిర్వహణను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించాలని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో రోడ్ల నిర్వహణ కోసం ప్రభుత్వ నిర్ణయాలపై ఆధారపడకుండా, నిరంతర ప్రక్రియగా కొనసాగాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన. 2016-19 మధ్యకాలంలోనే ఈ విధానాన్ని పాక్షికంగా అమలు చేశారు. అయితే, జగన్ అధికారంలోకి వచ్చాక దీన్ని రద్దు చేయడంతో పాటు రహదారుల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేశారు. దీంతో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. ఏపీ రోడ్లపై సోషల్ మీడియాలో ట్రోలింగ్ జరగని రోజే లేదు. రోడ్ల ఫొటోలను మీమ్స్‌గా వాడినా జగన్ సర్కారు ఏమాత్రం స్పందించలేదు. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, గుంతలు పూడ్చేందుకు రూ.600 కోట్లపైనే నిధులు విడుదల చేసింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించాలన్నా ఏపీలో రోడ్లు బాగోలేవు కదా... అనే ప్రశ్న ఎదురుకాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సీఎం భావిస్తున్నారు. దీనిలో భాగంగా ప్రైవేటు నిర్వహణ (మెయింటెనెన్స్) కాంట్రాక్టును తిరిగి అమలు చేయాలని నిర్ణయించారు. టెండర్ల ద్వారా ఒక ఏజెన్సీని ఎంపిక చేసి, గ్రామీణ, జిల్లా, రాష్ట్ర ప్రధాన రహదారుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తారు. ఎక్కడ రహదారి దెబ్బతిన్నా, గుంతలు పడినా ఆ ఏజెన్సీనే మరమ్మతు చేసేలా విధివిధానాలు ఉంటాయి. రహదారుల నిర్వహణ కాంట్రాక్టు రెండున్నరేళ్లకా లేక ఐదు సంవత్సరాల చొప్పున ఇవ్వాలా అన్నది సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకుంటారు. కాలపరిమితిపై స్పష్టత వచ్చాక నిర్వహణ వ్యయం ఎంత అన్నది నిర్ణయిస్తారు. దీనిపై అధ్యయనం చేయాలని ఆర్‌అండ్‌బీని ప్రభుత్వ పెద్దలు ఆదేశించినట్లు తెలిసింది. ప్రైవేటు నిర్వహణకు ఇచ్చే రహదారులపై టోల్‌గేట్లు ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తారన్న ప్రచారంలో నిజం లేదని ఆర్‌అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని అప్రతిష్ఠ పాల్జేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇదిలాఉండగా, రాష్ట్ర, జిల్లా రహదారుల విస్తరణ, అభివృద్ధిని పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో చేపట్టాలని సర్కారు నిర్ణయించింది. దీనిపై కన్సల్టెంట్లతో అధ్యయనం చేయించాలని ఆర్‌అండ్‌బీని ఆదేశించింది. ఇప్పటికే కన్సల్టెంట్ల ఎంపిక కోసం టెండర్లు కూడా పిలిచారు. ఈ ప్రాజెక్టులకు టెండర్లు ముగిసి పనులు ప్రారంభించే నాటికి మరి కొంతకాలం పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

నవ్య | చిత్రజ్యోతి

రిలీజ్‌డేట్ ఫిక్స్



అల్లరి నరేశ్, అమృత అయ్యర్ హీరో హీరోయిన్లుగా సుబ్బు మంగదేవి దర్శకత్వంలో రాజేశ్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్న చిత్రం 'బచ్చల మల్లి'. డిసెంబరు 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ రిలీజ్ డేట్ పోస్టర్‌ని విడుదల చేశారు. పోస్టర్‌లో నరేశ్ రగ్గడ్ లుక్‌లో ఆకట్టుకున్నారు. చెదిరిన జుట్టు, గుబురు గడ్డంతో, సిగరేట్ తాగుతూ ఉన్న నరేశ్ ఇంటెన్స్ అవతార్ అదిరిపోయింది. ఈ చిత్రానికి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. రోహిణి, రావు రమేశ్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరి తేజ, ప్రవీణ్, వైవా హర్ష ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు.



ప్రేక్షకులు ఊహించలేని విధంగా...

విష్వక్ సేన్ నటించిన తాజా చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. రవితేజ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తాళ్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోన్న సందర్భంగా విష్వక్ సేన్ మీడియాతో ముచ్చటించారు. "ఈ సినిమా పైకి కమర్షియల్ ఎంటర్టైనర్‌గా కనిపించినా.. ఇందులో నాలుగైదు ఏళ్లుగా సమాజంలో జరుగుతున్న ఓ కీలక సమస్యను చూపిస్తున్నాం. అది తెరపై చూసినప్పుడు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఫస్ట్ హాఫ్ అంతా వినోదాన్ని పంచి.. సెకండ్ హాఫ్ థ్రిల్లింగ్ ఫీల్‌ను ఇస్తుంది. ఈ సినిమా కథ చాలా విస్తృతమైనది. కచ్చితంగా అందరూ కనెక్ట్ అవుతారు. రవితేజ అనుకున్నదానికంటే చాలా బాగా సినిమాను తెరకెక్కించాడు. ఈ సినిమా స్క్రీన్ ప్లేను నడిపించిన విధానంతో ఆయనకు తప్పకుండా మంచి గుర్తింపు వస్తుంది. ఇందులో పాత్రలన్నింటికీ ప్రాధాన్యం ఉంది. జేక్స్ బిజోయ్ అందించిన మ్యూజిక్ అదిరిపోయింది. సినిమా ప్రేక్షకులు ఊహించలేని విధంగా ఉంటుంది" అని చెప్పారు.



ప్రియుడితో పెళ్లికి సిద్ధం?

ఇటీవలే 'రఘు తాత' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు నటి, జాతీయ అవార్డు గ్రహీత కీర్తి సురేశ్. ఆమె వివాహబంధంలోకి అడుగుపెట్టనున్నట్టు కొన్ని రోజులుగా మీడియాలో ప్రచారం జరుగుతోంది. తన ప్రియుడు, కేరళకు చెందిన వ్యాపారవేత్త ఆంటోని తట్టిల్‌తో కీర్తి మూడు ముళ్ల బంధంలోకి అడుగుపెట్టనున్నారనీ, డిసెంబరు 11న గోవాలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌లో వీరి వివాహం జరగనుందని ఆ వార్తల సారాంశం. పెళ్లికి రెండు రోజుల ముందే డిసెంబరు 9న వివాహ వేడుకలు ఆరంభమవుతాయనీ, ఇప్పటికే తెలుగు, తమిళ, మలయాళ సినీ ప్రముఖులకు ఆహ్వానాలు వెళ్లాయని సమాచారం. కీర్తి సురేశ్ 15 ఏళ్లుగా ఆంటోనితో రిలేషన్‌లో ఉన్నారట. స్కూల్ డేస్ నుంచే ఇద్దరికీ పరిచయం ఉందని తెలుస్తోంది. అయితే తన పెళ్లి వార్తలపై కీర్తిసురేశ్ ఇప్పటివరకూ పెదవి విప్పలేదు.



వినోదం.. విభిన్నం

రామ్ పోతినేని కొత్త సినిమా ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు అయింది. 'మిస్ శెట్టి.. మిస్టర్ పోలిశెట్టి' చిత్రానికి దర్శకత్వం వహించిన మహేశ్‌బాబు పచ్చిగొల్ల ఈ సినిమాకు దర్శకుడు. రామ్‌కు ఇది 22వ సినిమా. మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మించే ఈ చిత్రం షూటింగ్ ఈ నెల 21న ప్రారంభం కానుంది.

ఇందులో రామ్ ఓ యూనిక్ క్యారెక్టర్‌లో కనిపించనున్నారు.ఆయన కెరీర్‌లోని ల్యాండ్ మార్క్ చిత్రాల్లో ఒకటిగా నిలుస్తుందని అంటున్నారు. పూర్తి వినోదభరితంగా రూపుదిద్దుకొనే ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనేది ప్రారంభోత్సవంలో వెల్లడిస్తామని నిర్మాతలు చెప్పారు.

విడిపోనున్న రెహమాన్ దంపతులు

ప్రముఖ సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ దంపతులు త్వరలో విడిపోనున్నారు. ఈ మేరకు రెహమాన్ సతీమణి సైరా తరఫు న్యాయవాది వందనా షా మంగళవారం రాత్రి వెల్లడించారు.. 'పెళ్ళయిన చాలా సంవత్సరాల తర్వాత సైరా తన భర్త ఏఆర్ రెహమాన్ నుంచి విడిపోవాలని కఠినమైన నిర్ణయం తీసుకున్నారు. తీవ్రమైన భావోద్వేగ ఒత్తిడి తర్వాత తీసుకున్న నిర్ణయమిది. ఇరువురి మధ్య గాఢమైన ప్రేమ, అన్యోన్యత ఉన్నప్పటికీ వారి వివాహ బంధంలో ఎన్నో కష్టాలు, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అవి అధిగమించలేనివని తేలడంతో విడిపోవాలని నిర్ణయం తీసుకున్నారు' అని లాయర్ వందన విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, 1995లో ఈ దంపతులకు వివాహం కాగా, వీరికి ఖతీజా, రహీమా, అమీన్ అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ కష్టకాలంలో తమ వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దని రెహమాన్ కుమారుడు ఏఆర్అమీన్ మీడియాకు విజ్ఞప్తి చేశారు. సైరా భాను కుటుంబీకులు గుజరాత్ నుంచి చెన్నైకు వచ్చి స్థిరపడ్డారు.



చెన్నై (ఆంధ్రజ్యోతి)

మూడు రోజులు నిద్రపోలేదు



'నీదీ నాదీ ఒకే కథ', 'విరాట పర్వం' చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు వేణు ఉడుగుల. ఆయన నిర్మాతగా మారి రాహుల్ మోపిదేవితో సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. సాయిలు కంపాటి దర్శకుడు. మంగళవారం ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా వేణు ఉడుగుల మాట్లాడుతూ "దర్శకుడు సాయిలు తన ఊరిలో జరిగిన ఓ యధార్థ సంఘటన ఆధారంగా ఈ కథ రాసుకున్నారు. ఈ కథ విన్నాక అద్భుతమైన ఫీల్ కలిగింది. ఎంతో వైవిధ్యమైన ప్రేమకథ ఇది. ఈ సినిమా క్లైమాక్స్ విని నాకు మూడు రోజులు నిద్రపట్టలేదు. అంతగా నన్ను వెంటాడిందా క్లైమాక్స్" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: నరేశ్ అడుప, సినిమాటోగ్రఫీ: వాజిద్ బేగ్, సంగీతం: సురేశ్ బొబ్బిలి.

కేరళ కళాకారిణి పాత్రలో...

సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వీకపూర్ జంటగా తుషార్ జలోటా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'పరమ్ సుందరి'. విభిన్న ప్రేమగాథగా తెరకెక్కుతోన్న ఈ చిత్రంలో జాన్వీ కొత్త తరహా పాత్రలో కనిపించనున్నారు. 'పరమ్ సుందరి' చిత్రంలో సిద్ధార్థ్ ఉత్తరాదికి చెందిన వ్యాపారవేత్తగా కనిపించనుండగా, జాన్వీ మలయాళ కళాకారిణిగా అలరించనున్నారని బాలీవుడ్ టాక్. కేరళ నేపథ్యంలో సాగే కథ కావడంతో ఆ నేపథ్యాన్ని ప్రతిబింబించేలా ఢిల్లీలో సెట్స్ వేశారు. డిసెంబర్ నుంచి చిత్రీకరణ ప్రారంభించనున్నారు. ఈ చిత్రంలో దిశాపటానీ మరో కథానాయికగా నటిస్తున్నారు. ధర్మా ప్రొడక్షన్స్ నిర్మిస్తోంది.





కేసీఆర్‌ని ఆదర్శంగా తీసుకుని సినిమా తీశారు

హరీశ్ రావు

రాకింగ్ రాకేశ్ కథానాయకుడిగా స్వీయ నిర్మాణంలో తెరకెక్కిన చిత్రం 'కేశవ చంద్ర రమావత్' (కేసీఆర్). గరుడవేగ అంజి దర్శకుడు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే హరీశ్ రావు మాట్లాడుతూ "నాకు సినిమాలతో పరిచయం తక్కువ. అందుకే సినిమా వేడుకలకి రావడం అరుదు. అయితే రాకేశ్ గురించి తెలుసుకున్న తర్వాత ఇక్కడికి వచ్చి ఆయనని ఆశీర్వదించాలని పించింది. ఓ మారుమూల పల్లె నుంచి ఆయన ఇక్కడి దాకా ఎదిగిన క్రమం అందరికీ స్ఫూర్తిదాయకం. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఆదర్శంగా తీసుకుని రాకేశ్ ఈ సినిమా తీయడం ఎంతో ఆనందాన్నిస్తోంది" అని అన్నారు. "ఈ సినిమాను అందరూ థియేటర్లలో చూసి ఆదరించండి" అని హీరో రాకేశ్ కోరారు.

నా భార్య అండగా నిలిచింది

కేశవ చంద్ర రమావత్ (కేసీఆర్) చిత్రం ప్రీ రిలీజ్ కార్యక్రమానికి జానీ మాస్టర్ తన సతీమణి ఆయేషాతో కలసి వచ్చారు. లైంగిక వేధింపు కేసులో బెయిలు పొంది బయటకు వచ్చిన తర్వాత ఆయన మీడియా ముందుకు రావడం ఇదే తొలి సారి. "రాకేశ్ చాలా మంచి వ్యక్తి. అందరూ బావుండాలని కోరుకునే వ్యక్తి. ఇక్కడ అందరూ ఒక్కో మెట్టు ఎక్కుతూ పైకి వచ్చినవారే. భర్తకు భార్య సహకారం ఎప్పటికీ ఉంటుంది. నా జీవితంలో ఈ మధ్య జరిగిన కొన్ని సంఘటనల్లో ఆయేషా ఎంతో తోడ్పాటును అందించారు. జీవితంలో ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా నా వెన్నంటే నిలిచింది. భార్యగానే కాకుండా, తల్లిలా.. స్నేహితురాలిలా నా వెనుకే అండగా ఉండి కష్టకాలంలో ముందుకు నడిపిపించింది" అని చెప్పారు.



నా కెరీర్‌లో మర్చిపోలేనిది



చెప్పాలని ఉంది, అల నాటి సిత్రాలు, శాకుంతలం, హ్యాపీ ఎండింగ్ వంటి సినిమాలతో టాలెంటెడ్ యంగ్ హీరోగా పేరు తెచ్చుకున్నారు యష్ పూరి. ఆయన తాజాగా 'సిటాడెల్ 'హనీ-బన్నీ' వెబ్ సిరీస్‌లో కీలక పాత్రలో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ఈ సందర్భంగా యష్ పూరి మాట్లాడుతూ 'ఈ సిరీస్‌లో నటించే అవకాశం దక్కినందుకు సంతోషంగా ఉంది. ఇది నా నట జీవితంలో మరో మెట్టు పైకి తీసుకెళ్లింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన రైటర్ సీతా, సపోర్ట్ చేసిన నటి సమంత, డైరెక్టర్ రాజ్ డీకేకు కృతజ్ఞతలు. సమంత, వరుణ్‌తో కలసి నటించే అవకాశం రావడం నా కెరీర్‌లో మర్చిపోలేనిది. త్వరలో మరిన్ని క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులు ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాను' అని తెలిపారు.

అమ్మాయిలు.. అదే దూకుడు

ఫైనల్లో భారత్

చైనాతో టైటిల్ పోరు నేడు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ

సాయంత్రం 4.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో



రాజ్‌గిర్: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు జైత్రయాత్ర సాగిస్తోంది. మంగళవారం జరిగిన సెమీఫైనల్లో 2-0తో జపాన్‌ను ఓడించింది. ఇక తమ టైటిల్‌ను నిలబెట్టుకునేందుకు సలీమా టెటె బృందం బుధవారం జరిగే ఫైనల్లో చైనాను ఎదుర్కోనుంది. మరో సెమీస్‌లో చైనా 3-1తో మలేసియాపై గెలిచి తుదిపోరుకు చేరింది. ఇక.. మూడు, నాలుగో స్థానాల కోసం జపాన్-మలేసియా మధ్య పోరు జరుగనుంది. 48వ నిమిషంలో వైస్ కెప్టెన్ నవ్‌నీత్ కౌర్ తొలి గోల్ అందించగా.. 56వ నిమిషంలో లాల్‌రెమ్సియామి జట్టుకు మరో గోల్ అందించింది. వరుస విజయాలతో సెమీస్‌కు దూసుకు వచ్చిన భారత్ ఎదురుదాడితో జపాన్ రక్షణ శ్రేణి ఒత్తిడిలో పడింది. ఐదో నిమిషంలోనే సలీమాకు గోల్ చాన్స్ లభించినా ప్రత్యర్థి గోల్‌కీపర్ కుడో వమ్ము చేసింది. రెండో క్వార్టర్స్ ఆరంభంలోనే వరుసగా మూడు పీసీలు లభించినా ఫలితం లేకపోయింది. ఇలా ఆ తర్వాత కూడా భారత్ నుంచి ఎదురు దాడులను కీపర్ కుడో సమర్థవంతంగా అడ్డుకోగలిగింది. నాలుగో క్వార్టర్ 47వ నిమిషంలో భారత్‌కు లభించిన 12వ పీసీ కూడా వృథా అయ్యింది. ఆ తర్వాత నిమిషానికే దీపికను జపాన్ ప్లేయర్ కవాయ్ వెనుక నుంచి నెట్టడంతో భారత్‌కు పెనాల్టీ స్ట్రోక్ లభించింది. దీన్ని నవ్‌నీత్ గోల్‌గా మలచడంతో 1-0 ఆధిక్యం దక్కించుకుంది. దీంతో మరింత జోరు చూపిన భారత్‌కు మరో ఎనిమిది నిమిషాల్లోనే లాల్‌రెమ్సియామి రెండో గోల్‌ను అందించడంతో విజయం ఖరారైంది.

అంధుల జట్టు పాక్ వెళ్లదు!

కేంద్ర అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు మరో ఝలక్. ఇప్పటికే చాంపియన్స్ ట్రోఫీ కోసం టీమిండియా పాక్‌లో పర్యటించేది లేదని తెగేసి చెప్పగా.. తాజాగా అక్కడే జరిగే అంధుల టీ20 వరల్డ్‌కప్‌లోనూ భారత జట్టు పాల్గొనడం లేదు. ఈనెల 23 నుంచి వచ్చే నెల 3 వరకు టోర్నీ జరగనుంది. అయితే అందులో పాల్గొనేందుకు భారత ప్రభుత్వం నుంచి అంధుల జట్టుకు అనుమతి లభించలేదు. దీంతో టోర్నీ నుంచి వైదొలుగుతున్నట్టు భారత అంధుల క్రికెట్ సంఘం కార్యదర్శి శైలేంద్ర యాదవ్ తెలిపాడు. 'పాక్‌కు వెళ్లేందుకు క్రీడా శాఖ నుంచి మాకు ఎన్‌ఓసీ అందింది. అయితే విదేశాంగ శాఖ అనుమతి కోసం మేం 25 రోజులు వేచిచూసినా స్పందన లేదు. వారికి ఫోన్ చేస్తే అనుమతి ఇవ్వడం లేదన్నారు. అధికారికంగా కూడా లేఖ ఇస్తామని చెప్పారు. అందుకే టోర్నీ నుంచి వైదొలుగుతున్నాం. అలాగే ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు కూడా వివిధ కారణాలతో టోర్నీలో ఆడడం లేదు' అని శైలేంద్ర పేర్కొన్నాడు.



ఏపీ ఫుట్‌బాల్ అట్టర్ ఫ్లాప్

సంఘాల మధ్య రగడ

- సంతోష్ ట్రోఫీలో చెత్తాట
- మూడు మ్యాచ్‌ల్లో ఒక్కగోలూ చేయని జట్టు
- అసోసియేషన్ల మధ్య సమన్వయ లోపం
- జట్టు ఎంపికలో ప్రతిభకు దక్కని చోటు

అనంతపురం క్లాక్‌టవర్ (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మక దేశవాళీ టోర్నమెంట్ సంతోష్ ట్రోఫీలో ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టు ఘోర పరాజయాల్ని మూటగట్టుకుంది. ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ చిత్తుగా ఓడిన ఏపీ జట్టు ఒక్క గోలూ చేయలేక చతికిల పడింది. జట్టు ఎంపికలో ఏ మాత్రం పారదర్శకత లేకపోవడం, సిఫారసులకే ప్రాధాన్యమివ్వడం ఈ అవమానాలకు కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. టోర్నీలోని గ్రూప్-జి పోటీలకు అనంతపురంలోని ఆర్డీటీ స్టేడియం ఆతిథ్యమిచ్చింది. ఆతిథ్య ఆంధ్రతోపాటు తమిళనాడు, కర్ణాటక, అండమాన్ నికోబార్ జట్లు తలపడ్డాయి. తొలి మ్యాచ్‌లో కర్ణాటక చేతిలో 0-5తో, రెండో పోటీలో అండమాన్ నికోబార్ చేతిలో 0-1తో ఓడిన ఏపీ జట్టు మంగళవారం తమిళనాడుతో మ్యాచ్‌లో ఏకంగా 0-8తో చిత్తుగా ఓడి పరువు తీసేసింది. మొత్తంగా ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఏకంగా 14 గోల్స్ సమర్పించుకుంది. ఒక్కటంటే ఒక్క గోలూ చేయలేక అత్యంత అవమానకర రీతిలో నిష్క్రమించింది. చివరికి చిన్న జట్టు అండమాన్‌పైనా అదే ఆటతీరుతో ప్రేక్షకుల సహనాన్ని పరీక్షించింది.

సొంతగడ్డపై సంతోష్ ట్రోఫీ అనగానే స్థానిక ఫుట్‌బాల్ ఫ్యాన్స్ ఎగిరి గంతేశారు. ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు పోటీలు జరిగిన స్థానిక ఆర్డీటీ స్టేడియం మైదానం అంతర్జాతీయ స్థాయికి తీసిపోకుండా ఉంది. ఆర్డీటీ కల్పించిన సదుపాయాలను సద్వినియోగం చేసుకోవడంలో ఏపీ ఫుట్‌బాల్ సంఘం పూర్తిగా విఫలమైంది. అనంతపురం జిల్లా సంఘంతో రాష్ట్ర సంఘం సమన్వయ లోపం స్పష్టంగా కనిపించింది. ప్రతిభగల ఆటగాళ్లను పక్కనపెట్టడాన్ని చూస్తే జట్టు ఎంపికలో పెద్దఎత్తున గోల్‌మాల్ జరిగినట్టు చెబుతున్నారు.గతంలో అనంత క్రీడాగ్రామంలో నిర్వహించిన జాతీయ సబ్ జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లోనూ ఇదే తరహాలో ఎంపిక జరిగిందన్న విమర్శలు వినిపించాయి. అంతకు ముందు 2017లో నిర్వహించిన జాతీయ ఫుట్‌బాల్ పోటీల్లోనూ ఇదే పరిస్థితి. గతంలో జరిగిన తప్పుల్ని సరిదిద్దుకుని, రాష్ట్ర జట్టును పునర్నిర్మించాలన్న ఆలోచనే రాష్ట్ర ఫుట్‌బాల్ నాయకత్వానికి కనిపించడంలేదు. ఇలా ప్రతిభగల వారిని పక్కన పెడితే భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ ఉనికికి కోల్పోయే ప్రమాదముందని ఫుట్‌బాల్ ప్రేమికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

షఫాలీపై వేటు



ఆసీస్‌తో వన్డే సిరీస్‌కు భారత మహిళల జట్టు

జట్టు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రియా పూనియా, జెమీమా, హర్లీన్, యాస్తిక, రిచా ఘోష్, తేజల్, దీప్తి శర్మ, మిన్ను మణి, ప్రియా మిశ్రా, రాధా యాదవ్, టిటాస్ సాధు, అరుంధతి రెడ్డి, రేణుకా సింగ్, సైమా ఠాకూర్.

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియా మహిళల జట్టుతో జరిగే మూడు వన్డేల సిరీస్‌కు భారత జట్టును ప్రకటించారు. వచ్చే నెల 5 నుంచి 11 వరకు బ్రిస్బేన్, పెర్త్‌లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి. అయితే 16 మందితో కూడిన ఈ జాబితాలో డాషింగ్ ఓపెనర్ షఫాలీ వర్మకు చోటు దక్కలేదు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడు వన్డేల్లో తను కేవలం 56 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఈ ఫార్మాట్‌లో ఆమె దాదాపు రెండున్నరేళ్ల క్రితం చివరి అర్ధసెంచరీ సాధించడం గమనార్హం. ఇక గాయం నుంచి కోలుకున్న హర్లీన్ డియోల్‌కు చోటు కల్పించగా, పరీక్షల కారణంగా కివీస్‌తో సిరీస్‌కు దూరమైన రిచా ఘోష్ జట్టులోకి వచ్చింది. అలాగే ఆఫ్ స్పిన్నర్ మిన్ను మణికి తొలిసారి వన్డేల్లో బెర్త్ దక్కింది.

అనుపమ సంచలనం

15వ ర్యాంకర్ జాంగ్‌కు షాక్

చైనా మాస్టర్స్‌లో సిక్కి జోడీ ముందంజ



షెన్‌జెన్: భారత యువ షట్లర్ అనుపమ ఉపాధ్యాయ చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నమెంట్‌లో సంచలన ప్రదర్శనతో ఆకట్టుకుంది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 15వ ర్యాంకర్, అమెరికా స్టార్ బీవెన్ జాంగ్‌కు షాకిచ్చి రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్లో ప్రపంచ 50వ ర్యాంకరైన అనుపమ 21-17, 8-21, 22-20తో జాంగ్‌ను కంగుతినిపించింది. 19 ఏళ్ల అనుపమ బీడబ్ల్యూఎఫ్ సూపర్ 750 ఈవెంట్లో మొదటి రౌండ్ దాటడం ఇదే తొలిసారి. రెండో రౌండ్లో నట్సుకి నిదైర (జపాన్)తో అనుపమ తలపడనుంది. ఇక, మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి/సుమిత్ రెడ్డి జోడీ శుభారంభం చేసింది. తొలి రౌండ్లో సిక్కి జంట 23-21, 17-21, 21-17తో అమెరికా ద్వయం ప్రెస్లీ/జెన్నీని ఓడించింది. మిగతా భారత షట్లర్లలో ప్రియాన్షు రజావత్, ఆకర్షి కశ్యప్ పోరాటం ఆరంభ రౌండ్‌కే పరిమితమైంది. పురుషుల సింగిల్స్‌లో రజావత్ 24-22, 13-21, 18-21తో చికో అరా ద్వి వార్డోయో (ఇండోనేసియా) చేతిలో, మహిళల సింగిల్స్‌లో ఆకర్షి కశ్యప్ 10-21, 18-21తో టొమొకా (జపాన్) చేతిలో ఓటమి పాలయ్యారు.

కోహ్లీని రెచ్చగొట్టొద్దు



న్యూఢిల్లీ: కంగారూల గడ్డపై పరుగుల వరదపారించిన కోహ్లీనే ఆస్ట్రేలియా మాజీల టార్గెట్‌గా మారాడు. ఫామ్‌లో లేకపోయినా.. అతడి గురించిన చర్చే ఎక్కువగా జరుగుతోంది. విరాట్‌ను కట్టడి చేయడానికి కంగారూ పేసర్లు తమ వ్యూహాలకు పదునుపెట్టాలని మాజీ వికెట్ కీపర్ ఇయాన్ హీలీ సూచించాడు. అతడి ఫ్రంట్ ప్యాడ్‌ను లక్ష్యం చేసుకొని బౌలింగ్ చేయాలని చెప్పాడు. ఒకవేళ అందులో సఫలం కాకపోతే అతడి శరీరాన్ని లక్ష్యంగా చేసుకొని షార్ట్ పిచ్ బంతులేయాలని సలహా ఇచ్చాడు. అలాచేస్తే విరాట్ తప్పిదాలు చేసే అవకాశం ఉందని హీలీ చెప్పాడు. కాగా, కోహ్లీతో మాత్రం జగడం పెట్టుకోవద్దని మాజీ ఆల్‌రౌండర్ షేన్ వాట్సన్ తన ఆటగాళ్లను హెచ్చరించాడు. ఎంతగా రెచ్చగొడితే.. అతడిలోని అంత అత్యుత్తమ ఆట బయటకు వస్తుందన్నాడు. మన పిచ్‌లపై అతడి రికార్డులు అమోఘంగా ఉన్నాయన్న విషయాన్ని మరువొద్దన్నాడు.

డబ్బు కోసం వెళ్లలేదు

ఢిల్లీని వీడడంపై పంత్



న్యూఢిల్లీ: ఢిల్లీ క్యాపిటల్స్‌ను వీడడానికి డబ్బు కారణం కాదని ఆ జట్టు మాజీ కెప్టెన్ రిషభ్ పంత్ తేల్చాడు. రిటెన్షన్ ఫీజు విషయంలో ఫ్రాంచైజీతో పంత్‌కు విభేదాలు తలెత్తాయేమోనని, అందుకే అతను జట్టును వీడి ఉండొచ్చని గవాస్కర్ వ్యాఖ్యానించాడు. దీనిపై పంత్ స్పందిస్తూ.. 'నా రిటెన్షన్ అంశం డబ్బుతో ముడి పడి లేదని కచ్చితంగా చెప్పగలను' అంటూ సన్నీ వీడియోను ట్యాగ్ చేస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. మరోవైపు ఆటగాళ్ల వేలంలో పంత్‌ను తిరిగి ఢిల్లీ జట్టు దక్కించుకునే అవకాశం లేకపోలేదని గవాస్కర్ అభిప్రాయపడ్డాడు.

లంకతో కివీస్ మూడో వన్డే రద్దు

పల్లెకెలె: శ్రీలంక, న్యూజిలాండ్ మధ్య మంగళవారం జరగాల్సిన మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఆతిథ్య లంక 2-0తో సొంతం చేసుకొంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 21 ఓవర్లలో 112/1 స్కోరు చేసింది. ఈ సమయంలో మొదలైన వాన ఎంతకీ ఆగకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. విల్ యంగ్ (56 నాటౌట్), హెన్రీ నికోల్స్ (46 నాటౌట్) క్రీజులో ఉన్నారు.

బిజినెస్

ఎస్ఎంఈ ఐపీఓ దరఖాస్తు సైజు పెంపు

రూ.లక్ష నుంచి రూ.4 లక్షల వరకు పెంచే అవకాశం

చర్చా పత్రాన్ని విడుదల చేసిన సెబీ

న్యూఢిల్లీ: అధిక రిస్కుతో కూడిన చిన్న, మధ్య తరహా కంపెనీ (ఎస్ఎంఈ)ల ఐపీఓల నుంచి రిటైల్ మదుపరులను రక్షించేందుకు సెబీ కీలక ప్రతిపాదనలు చేసింది. ఎస్ఎంఈ ఐపీఓల్లో పెట్టుబడులు పెట్టేందుకు దరఖాస్తు కనీస సైజును రూ.4 లక్షల వరకు పెంచాలని ప్రతిపాదించింది. అధిక పెట్టుబడి, అధిక రిస్క్ సామర్థ్యంతో పాటు కంపెనీ పట్ల పూర్తి అవగాహన కలిగిన ఇన్వెస్టర్లు మాత్రమే ఈ ఐపీఓల్లో పాలుపంచుకునేలా చూడటమే ఈ ప్రతిపాదన ముఖ్యోద్దేశం. ఎందుకంటే, గత కొన్నేళ్లలో ఎస్ఎంఈ ఐపీఓల కోసం దరఖాస్తు చేసుకునే రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. దరఖాస్తుదారులు- షేర్లు లభించిన ఇన్వెస్టర్ల సగటు నిష్పత్తి 2021-22 ఆర్థిక సంవత్సరంలో 4 రెట్లకు పెరగగా.. 2022-23లో 46 రెట్లకు, 2023-24లో ఏకంగా 245 రెట్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో ఎస్ఎంఈ ఐపీఓల కనీస దరఖాస్తు సైజును రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు పెంచాలని మంగళవారం విడుదల చేసిన చర్చాపత్రంలో సెబీ ప్రతిపాదించింది. కనీస సైజును రూ.లక్ష నుంచి రూ.4 లక్షలకు పెంచాలన్న ప్రతిపాదన కూడా ఉంది. ఈ ప్రతిపాదనలు అమలులోకి వస్తే గనుక ఎస్ఎంఈ ఐపీఓల్లో పాల్గొనే రిటైల్ ఇన్వెస్టర్ల సంఖ్య భారీగా తగ్గే అవకాశం ఉంది.

కేవైసీ నిబంధనలు పాటించకపోతే వేటే

ముంబై: ఖాతాదారుల వివరాల సేకరణకు సంబంధించిన నో యువర్ కస్టమర్ (కేవైసీ) నిబంధనలను బ్యాంకులు తప్పనిసరిగా పాటించాల్సిందేనని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మరోసారి స్పష్టం చేసింది. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా, అటువంటి బ్యాంకులపై చర్యలు తప్పని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ హెచ్చరించారు. ఖాతాదారుల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన అంతర్గత అంబుడ్స్‌మన్ వ్యవస్థపైనా బ్యాంకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపైనా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వయస్సు, ఆదాయ విషయాలతో సంబంధం లేకుండా బ్యాంకులు.. ఖాతాదారులు అందరికీ ఒకే విధమైన సేవలు అందించాలని స్పష్టం చేశారు.

పసిడి రుణాలకూ ఈఎంఐ!



నెలవారీ వాయిదాల్లో అసలు, వడ్డీ చెల్లించే వెసులుబాటు..

త్వరలో ప్రవేశపెట్టేందుకు బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల సన్నాహాలు

న్యూఢిల్లీ: బంగారం తాకట్టుపై తీసుకునే రుణాలను నెలవారీ వాయిదా (ఈఎంఐ)ల్లో చెల్లించే అవకాశం అందుబాటులోకి రానుంది. ప్రస్తుతం గృహ, వాహన, వ్యక్తిగత రుణాలకు మాత్రమే ఈ సదుపాయం ఉంది. ఈ రుణాలు తీసుకోవాలంటే బ్యాంకుల నుంచి సవాలక్ష ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అంతేకాదు, క్రెడిట్ స్కోర్, నెలవారీ ఆదాయం ఇతరత్రా అన్నింటిని పరిశీలించిన తర్వాతే అవి రుణాలను మంజూరు చేస్తున్నాయి. అయితే ఇలాంటి చిక్కులు లేకుండా మన దగ్గర ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకునే రుణాలను నెలవారీ వాయిదాల్లో చెల్లించే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు (ఎన్‌బీఎఫ్‌సీ) సన్నాహాలు చేస్తున్నాయి. కాగా ఇప్పటి వరకు బంగారం తాకట్టుపై తీసుకునే రుణాలకు వడ్డీని మాత్రం నెలనెలా చెల్లిస్తే సరిపోతుంది. అది కూడా తప్పనిసరేం కాదు. రుణ కాలపరిమితి ముగిసే నాటికి అసలు, వడ్డీని ఒకేసారి చెల్లించి కూడా తనఖా బంగారాన్ని విడిపించుకోవచ్చు. కానీ, కొందరు రుణగ్రహీతలు తీసుకున్న అప్పును మొత్తం ఒకేసారి చెల్లించడం భారమై తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోలేని పరిస్థితి. ఈ రుణాన్ని ఒకేసారి తీర్చలేని వారికి ఈ విధానం మేలు చేస్తుందని బ్యాంకింగ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇందులో భాగంగానే గృహ, వాహన, వ్యక్తిగత రుణాల్లాగే బంగారం తాకట్టు పెట్టి తీసుకున్న అప్పును కూడా అసలు, వడ్డీ కలిపి నెలవారీ వాయిదా పద్ధతుల్లో చెల్లించే వెసులుబాటు కల్పించాలని బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు యోచిస్తున్నాయి. అలాగే, బంగారం తాకట్టుపై టర్మ్ లోన్ మంజూరు ఆలోచన కూడా ఉన్నట్లు తెలిసింది.

రూ.1.4 లక్షల కోట్ల రుణాలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు 30తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం నాటికి బ్యాంకుల బంగారం తనఖా రుణాల మంజూరు వార్షిక ప్రాతిపదికన 51 శాతం వృద్ధితో రూ.1.4 లక్షల కోట్లకు చేరుకుంది. గత ఏడాదిలో ఇదే కాలానికి ఈ రుణాల వృద్ధి 14.6 శాతంగా నమోదైంది. గడిచిన ఏడాది కాలంలో బంగారం ధర భారీగా పెరగడంతో ఈ విభాగ రుణాలకూ డిమాండ్ అనూహ్యంగా పెరిగిందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. దేశీయ రేటింగ్ ఏజెన్సీ క్రిసిల్ నివేదిక ప్రకారం.. ఈ ఏప్రిల్-ఆగస్టు మధ్యకాలంలో బ్యాంకుల బంగారం రుణాల మంజూరు 37 శాతం వృద్ధి చెందగా.. గోల్డ్ లోన్ కంపెనీల రుణ ఆస్తులు 11 శాతం పెరిగాయి.

ఆర్‌బీఐ ఆందోళన నేపథ్యంలోనే..

పసిడి రుణాల మంజూరులో బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అనుసరిస్తున్న అనుచిత విధానాలపై ఈ ఏడాది సెప్టెంబరు 30న భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఆందోళన వ్యక్తం చేసింది. ఈ రుణాల సోర్సింగ్, తాకట్టు బంగారం విలువ మదింపు, తనిఖీ ప్రక్రియ, పర్యవేక్షణ, బంగారం వేలం, లోన్ టు వాల్యూ (ఎల్‌టీవీ) రేషియో, రిస్క్ వెయిటేజీ అంశాల్లో లోపాలను ఎత్తి చూపింది. అంతేకాదు, రుణగ్రహీతలు తాకట్టు పెట్టే బంగారంపైనే ఆధారపడకుండా వారి తిరిగి చెల్లింపుల సామర్థ్యాన్నీ పరిశీలించాలని రుణదాతలను ఆర్‌బీఐ ఆదేశించింది. పాక్షిక చెల్లింపులపై రుణ కాలపరిమితి రెన్యువల్‌నూ ఆర్‌బీఐ తప్పుపట్టింది. ఈ నేపథ్యంలోనే తాము బంగారం తనఖా రుణాలకూ నిర్దేశిత గడువుతో కూడిన ఈఎంఐ ప్రణాళికలను ఏర్పాటు చేస్తున్నామని సీనియర్ బ్యాంకింగ్ అధికారి పేర్కొన్నారు.

అర్వా ఈవీతో ప్యూర్ ఈవీ జట్టు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పశ్చిమాసియా, ఆఫ్రికాల్లో విద్యుత్ మోటార్ సైకిళ్ల (ఈవీ) డిస్ట్రిబ్యూషన్, విక్రయ నెట్‌వర్క్‌ను ఉత్తేజితం చేయడానికి అర్వా ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫాక్చరింగ్ ఎల్‌ఎల్‌సీతో విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ప్యూర్ ఈవీ వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద తమ ప్రధాన మోడళ్లయిన ఎకో డ్రిఫ్ట్, ఈ- ట్రిస్ట్ ఎక్స్ 50 వేల యూనిట్లు వచ్చే రెండేళ్లలో సరఫరా చేయనున్నట్టు ప్యూర్ ఈవీ ప్రకటించింది. భవిష్యత్తులో దాన్ని 60 వేల వాహనాలకు విస్తరిస్తామని ప్యూర్ ఈవీ వ్యవస్థాపకుడు, ఎండీ నిశాంత్ దొంగరి చెప్పారు.

హ్యూమనాయిడ్ రోబోల తయారీలోకి యాడ్‌వెర్బ్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇండస్ట్రియల్, వేర్‌హౌస్ ఆటోమేషన్‌లో అగ్రగామి అయిన యాడ్‌వెర్బ్ హ్యూమనాయిడ్ రోబోటిక్స్ విభాగంలోకి ప్రవేశిస్తోంది. వచ్చే ఏడాది తొలి హ్యూమనాయిడ్ రోబోను విడుదల చేయాలనుకుంటున్నట్టు ప్రకటించింది. జియో ఏఐ వేదిక, 5జీ సర్వీసులను ఉపయోగించుకుని హ్యూమనాయిడ్ అభివృద్ధికి రిలయన్స్‌తో కలిసి పని చేయనున్నట్టు యాడ్‌వెర్బ్ ప్రకటించింది. రిలయన్స్ గ్రూప్ వ్యాపార కార్యకలాపాల్లో దీన్ని విస్తృతంగా వినియోగిస్తారు. సెల్ఫ్ లెర్నింగ్ ఆల్గోరిథమ్స్, మల్టీ మోడల్ డేటా సహాయంతో విభిన్న వాతావరణ పరిస్థితుల్లో ఇమిడిపోతూ పార్సెల్ హ్యాండ్లింగ్, నాణ్యతా పరీక్షలు, సార్టింగ్, అసెంబ్లీ, వైపరీత్య సహాయ చర్యలు ఈ హ్యూమనాయిడ్ సమర్థవంతంగా నిర్వహించగలుగుతుందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ సంగీత్ కుమార్ తెలిపారు.

హైదరాబాద్ ఇన్‌ఫ్రా, రియల్టీ అదుర్స్

- శరవేగంగా వృద్ధి చెందుతున్న నగరాల్లో అగ్రస్థానం
- కలిసొస్తున్న మౌలిక సదుపాయాలు
- లగ్జరీ విల్లాలు, ఇళ్లకు యమ డిమాండ్
- నైట్ ఫ్రాంక్ ఇండియా వెల్లడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. పాలనా సౌలభ్యం, ఆర్థిక-సామాజిక పరిస్థితులు, స్థిరాస్తి (రియల్టీ), మౌలిక సదుపాయాలు ఇందుకు కలిసి వస్తున్నాయని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ నైట్ ఫ్రాంక్ ఇండియా ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది. దీనికి సంబంధించి ఇండియా ప్రైమ్ సిటీ ఇండెక్స్ పేరుతో నివేదిక విడుదల చేసింది. హైదరాబాద్‌లో పెరుగుతున్న నయా సంపన్నుల జనాభా కూడా ఇందుకు దోహదం చేస్తోందని ఆ నివేదిక తెలిపింది.

మౌలికమే దన్ను: హైదరాబాద్‌లో ఐటీ, టెక్నాలజీ కంపెనీలు ఇప్పటికే బలంగా వేళ్లూనుకున్నాయి. ఓఆర్ఆర్, మెట్రో రైల్ విస్తరణతో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత, ఆర్థిక కార్యకలాపాలు పెరిగాయి. ప్రభుత్వ సానుకూల విధానాలు ఇందుకు తోడయ్యాయి. దీనికి తోడు ముంబై, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌తో పోలిస్తే నగరంలో ఇళ్ల ధరలు తక్కువగా ఉన్నాయి. ఇవన్నీ హైదరాబాద్ రియల్టీకి కలిసి వస్తున్నట్టు నగరానికి చెందిన రియల్టీ సంస్థ సుమధుర గ్రూప్ సీఎండీ జీ మధుసూధన్ చెప్పారు. ఈ మార్పులతో నగరానికి ఐదారు కిలోమీటర్ల దూరమైనా పెద్ద సైజు అపార్ట్‌మెంట్, విల్లా వంటి లగ్జరీ ఇళ్లను కొనేందుకు నగరవాసులు వెనకాడడం లేదని మరో రియల్ ఎస్టేట్ సంస్థ ప్రణీత్ గ్రూప్ డైరెక్టర్ నరేంద్ర కుమార్ కామరాజు తెలిపారు.

కొత్త ట్రెండ్ : గతంలో నయా కుబేరులు మాత్రమే విశాలమైన ఖరీదైన ప్లాట్లు, బంగళాలు కొనేవారు. కొవిడ్ తర్వాత ట్రెండ్ మారింది. ఐటీ, టెక్నాలజీ రంగాల్లో ఉన్న ఎగువ మధ్య తరగతి ప్రజలు కూడా ఇప్పుడు ఈ తరహా నివాస గృహాల కొనుగోళ్లపై ఆసక్తి చూపిస్తున్నారు. చుట్టుపక్కల మంచి గ్రీనరీ, ఆహ్లాదకరమైన వాతావరణమూ ఈ విషయంలో ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. దీంతో ఇప్పుడు జూబ్లీహిల్స్ కోకాపేట్, నియోపోలిస్, రాయదుర్గం, బాచుపల్లి ప్రాంతాల్లో నిర్మిస్తున్న లగ్జరీ విల్లాలు, ఇళ్లకు డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్‌తో శివారు ప్రాంతాల్లోని భూముల ధర చుక్కలంటుతోంది. ఆ ప్రభావం లగ్జరీ ఇళ్ల ధరలపైనా కనిపిస్తోందని నగరానికి చెందిన పౌలోమీ ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు చెప్పారు. దీంతో గత ఏడాది నగరంలో నివాస గృహాల ధరలు 11 శాతం పెరిగినట్టు నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది.

రెండో స్థానంలో బెంగళూరు: హైదరాబాద్ తర్వాత బెంగళూరు,ముంబై-మెట్రోపాలిటన్ ప్రాంతం రెండు, మూడు స్థానాల్లో ఉన్నట్టు నైట్‌ఫ్రాంక్ తెలిపింది. నిపుణులైన ఉద్యోగుల లభ్యత, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవసరమైన సానుకూల వ్యాపార విధానాలు, ఆర్థిక సామాజిక పరిస్థితులు బెంగళూరుకు ప్రధానంగా కలిసి వస్తున్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా ఈడీ గులాం జియా చెప్పారు.

తగ్గిన ఆఫీస్ స్పేస్ సరఫరా : కార్యాలయ భవనాలకు మంచి డిమాండ్ ఉన్నా.. హైదరాబాద్‌లో కొత్త కార్యాలయ భవనాల అందుబాటు మాత్రం పెద్దగా లేదు. సెప్టెంబరు త్రైమాసికంలో నగరంలో ఆఫీస్ స్పేస్ డిమాండ్ 25 శాతం పెరిగినా 41 లక్షల ఎస్ఎఫ్‌టీ కొత్త కార్యాలయ స్థలం మాత్రమే అందుబాటులోకి వచ్చింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది 25 శాతం తక్కువని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ వెస్టియన్ తెలిపింది.

ఎట్టకేలకు లాభాలొచ్చాయ్..

- ఇంట్రాడేలో సెన్సెక్స్ 1,112 పాయింట్లు అప్
- చివరికి 239 పాయింట్ల లాభంతో ముగింపు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో వరుస నష్టాలకు తెరపడింది. అంతర్జాతీయ మార్కెట్ల ట్రెండ్ మిశ్రమంగా ఉన్నప్పటికీ.. గడిచిన కొన్ని రోజుల్లో భారీగా క్షీణించిన బ్యాంకింగ్, ఐటీ, వాహన రంగ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లు జరపడం సూచీలను లాభాల్లోకి మళ్లించింది. మంగళవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 1,112.64 పాయింట్లు ఎగబాకి 78,451.65 వద్దకు చేరింది. కానీ, ఆఖరి గంటలో రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా పలు షేర్లలో మదుపరులు లాభాలను స్వీకరించారు. దాంతో సెన్సెక్స్ 239.37 పాయింట్ల స్వల్ప లాభంతో 77,578.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఒకదశలో 300 పాయింట్లకు పైగా పెరిగి 23,780 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ.. చివరికి 64.70 పాయింట్ల లాభంతో 23,518.50 వద్ద ముగిసింది. దాంతో నిఫ్టీ 7 రోజుల వరుస నష్టాలకు తెరపడినట్లైంది.

నేడు మార్కెట్లకు సెలవు : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బుధవారం నాడు స్టాక్ ఎక్స్ఛేంజీలైన బీఎస్ఈ, ఎన్ఎస్ఈ సెలవు పాటించనున్నాయి. మార్కెట్లు గురువారం యథాతథంగా పనిచేస్తాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,070 ▲	70,650 ▲	1,01,000 ▲
ముంబై	75,873 ▲	69,500 ▲	90,956 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ			
హైదరాబాద్	555	విజయవాడ	575
వరంగల్	557	గోదావరి	565
చిత్తూరు	593	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 78	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	113
వరంగల్	100	గుంటూరు	111
కరీంనగర్	100	ఒంగోలు	111
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	104
కర్నూలు	100	నెల్లూరు	104
విశాఖపట్నం	105	అనంతపురం	104
గోదావరి	113		

ఆంధ్రజ్యోతి
నవ్య
11
కుటుంబ కదంబం
బుధవారం
20 నవంబరు 2024



అజ్రక్ మోడాల్ చీరలు తాజాగా అతివల మనసులను దోచుకుంటున్నాయి. మిలమిల మెరిసిపోతూ, మృదువుగా ఉండే ఈ చీరల ప్రత్యేకత వినూత్నమైన అజ్రక్ డిజైన్లలో దాగి ఉంటుంది. అదరగొట్టేస్తున్న అలాంటి కొన్ని అజ్రక్ చీరలు 'నవ్య' పాఠకుల కోసం...

అజ్రక్ అదరహో

మోడాల్ సిల్క్ మీద అజ్రక్ ప్రింట్లు అద్దుకున్న చీరలే అజ్రక్ మోడాల్ చీరలు. మోడాల్ అనే రయాన్ వస్త్రానికి పట్టును జోడిస్తే తయారయ్యే వస్త్రం మన్నిక ఎక్కువ. సుతిమెత్తగా, సౌకర్యవంతంగా ఉండే ఈ వస్త్రానికి పట్టును జోడించి, విలాసవంతమైన, మెరుపులీనే అందమైన చీరలను రూపొందిస్తూ ఉంటారు. అజ్రక్ అనే ప్రాచీన చేనేత నైపుణ్యం గుజరాత్, రాజస్థాన్‌లలో రూపం పోసుకుని భారతదేశమంతా విస్తరించింది. ఈ చీరల మీద అద్దే కుర్రచ్ అద్దకాలు విభిన్నంగా ఉండి, చీరలకు సరికొత్త హంగులను తెచ్చిపెడతాయి.







ఎరుపు మెరుపు

అజ్రక్ చీరల్లో ఎరుపు రంగే ఎక్కువగా ఆకట్టుకుంటూ ఉంటుంది. కాబట్టే ఈ రంగు చీరలు ఎక్కువగా రూపొందుతూ ఉంటాయి. ఎరుపుతో పాటు నలుపు, నీలం రంగుల చీరలు, మిశ్రమ రంగులు చీరలు కూడా మహిళలను ఆకట్టుకుంటున్నాయి. చేనేత పనితనం, అందమైన అద్దకాల సమ్మేళనం వల్ల సృజనాత్మకతతో కూడిన అజ్రక్ చీరలు రూపొందుతున్నాయి. కలకాలం చెక్కుచెదరని రంగులు, అద్దకాలు, మెరుపు కోల్పోని జరీ ఈ చీరల ప్రత్యేకతలు.

ఇలా సింగారించాలి

అజ్రక్ చీరలతో పాటు కుట్టించే జాకెట్టుతోనే చీర మొత్తానికి ఆకర్షణ చేకూరుతుంది. కాబట్టి సాదాసీదాగా కాకుండా, వినూత్నమైన తరహాలో జాకెట్లను కుట్టించుకోవాలి. జరీ అంచు చేతుల మీదకు వచ్చేలా, వెనకవైపు డోరీలు ఉండేలా కుట్టించుకోవాలి. కుందన్, పోల్కీ హారాలు, సంప్రదాయ ఆభరణాలు ఈ తరహా చీరలకు ఎంతో బాగా నప్పుతాయి.

చలికాలంలో వేడిగా తాగండి!

చలికాలంలో సహజంగానే బద్ధకంగా, నీరసంగా అనిపిస్తుంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గి రోగనిరోధక శక్తి బలహీనమవుతుంది. తరచూ జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు వేధిస్తుంటాయి. వీటి నుంచి ఉపశమనం పొంది రోజంతా ఉత్సాహంగా పనిచేయడానికి ఉదయాన్నే వేడిగా కొన్ని పానీయాలు తాగడం మంచిదని అంటున్నారు నిపుణులు. వాటి గురించి తెలుసుకుందాం!

అల్లం-నిమ్మకాయ టీ



● అల్లం, నిమ్మకాయ రెండూ శరీర ఉష్ణోగ్రతను పెంచుతాయి. వీటిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు గొంతు గరగరను నివారిస్తాయి. నిమ్మకాయలోని సి-విటమిన్ వ్యాధులను వ్యాప్తి చేసే బ్యాక్టీరియా, వైరస్‌లతో పోరాడుతుంది. రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఒక గిన్నెలో రెండు చిన్న అల్లం ముక్కలు వేసి, అందులో ఒక గ్లాసు మంచినీళ్లు పోసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీళ్లను వడబోసి అందులో రెండు చెంచాల నిమ్మరసం కలిపి వేడిగా తాగాలి.

పసుపు పాలు



● పసుపులోని కర్కుమిన్ గుండె జబ్బుల నివారణకు, నరాలు పటిష్ఠంగా ఉండేందుకు తోడ్పడుతుంది. చలికాలంలో కీళ్ల పట్టేయకుండా కాపాడుతుంది. పాలలోని కాల్షియం ఎముకలను దృఢంగా ఉంచుతుంది. ఒక గ్లాసు వేడి పాలలో ఒక చెంచా పసుపు, చిటికెడు నల్ల మిరియాల పొడి, ఒక చెంచా తేనె కలిపి తాగితే రోజంతా ఉత్సాహంగా ఉంటుంది. ఈ కషాయంలో మిరియాల పొడిని కలపడం వల్ల పసుపులోని కర్కుమిన్ పూర్తిస్థాయిలో శరీరానికి అందుతుంది.

దాల్చిన చెక్క పానీయం



● దాల్చిన చెక్క జీవక్రియలను వేగవంతం చేసి శరీరాన్ని ఉత్సాహపరుస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రిస్తుంది. ఒక గ్లాసు వేడినీటిలో అర చెంచా దాల్చిన చెక్క పొడి, ఒక చెంచా తేనె వేసి బాగా కలిపి వేడిగా ఉన్నప్పుడే తాగాలి.

నిమ్మకాయ-తేనె



● నిమ్మరసం, తేనెల మిశ్రమం శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటికి పంపుతుంది. జీర్ణాశయం, కాలేయం సక్రమంగా పనిచేసేలా చూస్తుంది. ఒక గ్లాసు వేడి నీళ్లలో మూడు చెంచాల నిమ్మరసం, రెండు చెంచాల తేనె కలిపి వేడిగా తాగితే చలికాలంలో వచ్చే శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం కలుగుతుంది.

తులసి-పుదీనా



● తులసి ఆకులు ఒత్తిడిని తగ్గిస్తాయి. పుదీనా పొట్టను శుభ్రం చేస్తుంది. ఒక గ్లాసు వేడినీటిలో అయిదు తులసి ఆకులు, ఎనిమిది పుదీనా ఆకులు వేసి కొంతసేపు నాననివ్వాలి. గోరువెచ్చని ఈ పానీయం తాగుతున్నపుడు వచ్చే సువాసన వల్ల మనసుకు ఉత్సాహం కలిగి శరీరానికి బద్ధకం వదులుతుంది.

యాపిల్ సైడర్ వెనిగర్-తేనె



● యాపిల్ సైడర్ వెనిగర్ శరీరంలో పీహెచ్ స్థాయిని నియంత్రణలో ఉంచుతుంది. ఒక గ్లాసు వేడినీటిలో ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్, ఒక చెంచా తేనె కలపాలి. దీని రుచి అద్భుతంగా ఉంటుంది. ఈ పానీయం తాగిన వెంటనే కడుపులో తేలికగా ఉన్న భావన కలుగుతుంది. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది.

కశ్మీరీ కహ్వా



● ఒక గిన్నెలో రెండు గ్లాసుల మంచి నీళ్లు, రెండు యాలకులు, చిన్న దాల్చిన చెక్క ముక్క, ఒక చెంచా గ్రీన్ టీ ఆకుల పొడి, రెండు చెంచాల ఎండు గులాబీ రేకులు వేసి బాగా మరిగించాలి. తరవాత ఈ నీళ్లను వడబోసి అందులో ఒక చెంచా తేనె, కొన్ని బాదం పలుకులు, కుంకుమ పువ్వు రేకులు వేసి బాగా కలపాలి. ఈ పానీయాన్ని పొద్దున్నే వేడిగా తాగితే జలుబు, ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనం కలుగుతుంది. దీని ఘాటైన పరిమళం అలసటను, ఒత్తిడిని తగ్గిస్తుంది.

వ్యర్థాలు లేని గ్రామం... ఆమె ధ్యేయం

జీవనాధారమైన నది కాలుష్యం చేరి విషతుల్యంగా మారుతున్నా... ఏం చెయ్యగలమనే నిర్లిప్తతతో ఉన్న గ్రామస్తుల్లో పెనుమార్పుకు నాంది పలికారు ఇతిశా సారా. లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఐకమత్యంగా పని చేస్తే సాధించలేనిదేదీ లేదని నిరూపించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లోని సంగ్తీని వ్యర్థాలు లేని గ్రామంగా తీర్చిదిద్దుతున్నారు.

తూర్పు హిమాలయాల్లోని అరుణాచల్‌ప్రదేశ్‌లోని సంగ్తీ గ్రామం ప్రకృతి సౌందర్యానికి నిలయం. లోయలో ఉన్న ఈ గ్రామాన్ని ఆనుకొని సంగ్తీ నది ప్రవహిస్తూ ఉంటుంది. ఆ నది పేరుతోనే గ్రామాన్ని కూడా పిలుచుకుంటారు. అక్కడ నివసించే మోన్పా తెగ ప్రజలు టిబెటియన్ బౌద్ధాన్ని పాటిస్తారు. ప్రకృతిని ఆరాధిస్తారు. కానీ ఆధునికత ప్రభావం ఆ గ్రామం మీద కూడా పడింది. ప్లాస్టిక్, ఇతర ఘన వ్యర్థాలు నదిలోకి చేరడం, తీరంలో పేరుకుపోవడం ప్రారంభమయింది. చూపరులకు కనువిందు చేసే ఆ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. ప్రతియేటా ఈ గ్రామానికి వచ్చే నల్లమెడ కొంగల రాక కూడా తగ్గిపోయింది. గ్రామస్తుల ఆరోగ్యం మీద కూడా ఈ ప్రభావం పడింది. ఆ సమయంలో... ఆశాజ్యోతిలా ఆ గ్రామంలో అడుగుపెట్టారు ఇతిశా సారా. ఆమె స్వస్థలం అసోంలోని గువహటి. పుణేలో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేశారు. ఆ తరువాత ఢిల్లీ అంబేద్కర్ యూనివర్సిటీలో ఎండిఇఎస్ (సోషల్ డిజైన్) కోర్సులో చేరారు. "తరగతి గది నుంచి బయటకు వెళ్ళి, ప్రజలను నేరుగా కలిసి, వాళ్ళు నిత్యం ఎదుర్కొనే సమస్యలకు ఆచరణాత్మకమైన పరిష్కారాలను గుర్తించడానికి ఆ కోర్సు నాకు అవకాశం కలిగించింది. పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా పాల్గొనేదాన్ని. అరుణాచల్‌ప్రదేశ్‌లోని మారుమూల ప్రాంతాల్లో విద్యుద్దీపాల ఏర్పాటుకోసం పాటుపడుతున్న 'వర్దర్ అండ్ బియాండ్ ఫౌండేషన్' చేపట్టిన 'ది బట్టి ప్రాజెక్ట్'కు నిధుల సేకరణ కోసం ఢిల్లీ వచ్చిన మెర్విన్ కౌంటిన్హో నాకు పరిచయం అయ్యారు. అప్పట్లో నేను ఎలక్ట్రానిక్ వ్యర్థాల నిర్మూలన మీద యూనివర్సిటీలో పరిశోధన చేస్తున్నాను. తమ ప్రాంతంలోని గ్రామాల పరిస్థితుల గురించి మెర్విన్ వివరించారు. వారి ప్రాజెక్ట్ తరఫున ఢిల్లీలో పని చేయాలని నన్ను కోరారు. నేను సరేనన్నాను" అని గుర్తు చేసుకున్నారు ఇతిశా.

ఎక్కడ చూసినా చెత్తే

తమ ప్రాంతాన్ని సందర్శించాలని ఇతిశాను మెర్విన్ తరచూ అడిగేవారు. దాదాపు ఏడాది తరువాత ఆమెకు ఆ అవకాశం వచ్చింది. "నా స్నేహితుడొకరు కొత్తగా ట్రావెల్ కంపెనీ ప్రారంభించారు. తమ విద్యార్థులను వేసవి సెలవుల్లో విహార యాత్రలకు తీసుకువెళ్ళడానికి కొన్ని స్కూళ్ళు అతణ్ణి సంప్రతించాయి. దానికి తగిన సిబ్బంది లేకపోవడంతో... 'ఆ పిల్లలతో కలిసి టూర్ ఇన్‌స్ట్రక్టర్‌గా ఎక్కడికైనా వెళ్ళగలవా?' అని అడిగారు. ఆ జాబితాలో అరుణాచల్‌ప్రదేశ్‌లోని ప్రాంతాలు కూడా ఉన్నాయి. నేను 'సరే' అన్నాను. అలా తొలిసారిగా .... 2018లో సంగ్తీలో అడుగుపెట్టాను" అని చెప్పారు ఇతిశా. అక్కడ నది, లోయ, పొలాలు... ఇలా అన్నీ ఆమెకు ఎంతగానో నచ్చాయి. కానీ ఎక్కడ చూసినా చెత్తే. వీధుల్లో కుప్పలు కుప్పలుగా పడి ఉండేది. నదిలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు తేలుతూ ఉండేవి. అక్కడ మెర్విన్ నన్ను కలిసినప్పుడు ఆ సంగతే ప్రస్తావించాను. "అప్పుడప్పుడు పరిశుభ్రతా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నాం. కానీ మళ్ళీ మామూలే" అన్నారు. "ఆయన మాటలు నన్ను ఆలోచనలో పడేశాయి. ఈ గ్రామాన్నే నా కార్యక్షేత్రంగా ఎందుకు ఎంచుకోకూడదనిపించింది" అని అంటారు ఇతిశా. ఢిల్లీకి తిరిగి వెళ్ళిన ఆమె... ఒక నిర్దిష్టమైన ప్రణాళికతో మళ్ళీ సంగ్తీలో అడుగుపెట్టారు. 'నార్త్ ఈస్ట్ వేస్ట్ కలెక్టివ్' అనే సంస్థను ఏర్పాటు చేశారు.. స్థానిక యువత సాయంతో ప్రజల్లో అవగాహన కలిగించడానికి సమావేశాలు ఏర్పాటు చేశారు.

> **చెత్త పోగుపడడం వల్ల నదికీ, గ్రామానికీ, పర్యావరణానికీ ఎంత నష్టం అనేది గ్రామస్తులకు ఇతిశా బోధపరిచారు. మనం చెయ్యాల్సిన పని ఎవరో వచ్చి చేస్తూ ఉంటే... వాళ్ళు మళ్ళీ ఎప్పుడు వస్తారా? అని ఎదురుచూస్తూ ఉండడం మానాలనీ, ప్రతి ఒక్కరూ పరిసరాల్ని శుభ్రంగా ఉంచే దీక్షలో భాగస్వాములు కావాలనీ చెప్పారు. వ్యర్థాలను సేకరించడం, వాటిని వేరు చేయడం, కంపోస్ట్ తయారు చేయడం... ఇలా అనేక అంశాలను ప్రజలకు వివరించారు.**



పవిత్ర దినాల్లో...

"మేము చేసిన కార్యక్రమాలతో... గ్రామస్తులలో మార్పు మొదలయింది. "మొదట ప్రజలు తమ ఇళ్ళలోని చెత్తను ఇష్టానుసారం రోడ్ల మీదో, ఇళ్ళ పక్కనో పడెయ్యకుండా... ఒక నిర్దిష్టమైన చోట వేసేలా చేశాం. గ్రామపెద్దలు, అధికారులతో మాట్లాడి... లోయలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించేలా చేశాం. బౌద్ధుల చాంద్రమాన పంచాంగం ప్రకారం... మోన్పా తెగవారికి నెలకి నాలుగు నుంచి అయిదు పవిత్రమైన రోజులు ఉంటాయి. ఆ రోజుల్లో వాళ్ళు పొలం పనులు చెయ్యరు, వాటిని సెలవులుగా పరిగణిస్తారు. ఆ రోజులను వ్యర్థాల నిర్వహణకోసం కేటాయించేలా ఒప్పించాం. ప్రతినెలా ఎనిమిదో రోజును సామాజిక సేవా దినంగా నిర్ణయించాం. ఆ రోజు తమ వీధుల్ని శుభ్రపరిచే పనిలో ప్రతి ఇంటి నుంచి ఒక వ్యక్తి పాల్గొనాలి. కాలనీలవారీగా బాధ్యులను ఎంపిక చేశాం. వారు పనులు సజావుగా జరిగేలా వాళ్ళు పర్యవేక్షిస్తారు" అని వివరించారు ఇతిశా. దానితోపాటు ప్రతి రోజూ నిర్దేశించిన చోట చెత్త వేయడం, వారానికి ఒకసారి తమ ప్రాంతాలను శుభ్రం చేయడం, ఎక్కడైనా చెత్త పేరుకుపోతే దాన్ని వెంటనే తొలగించడం లాంటి పనుల కోసం ఎక్కడికక్కడ కమిటీలు వేశారు. అలాగే విద్యార్థులకు పారిశుధ్యం ప్రాధాన్యాన్ని బోధించి, వారిని కూడా తమ కార్యక్రమాల్లో భాగస్వాములను చేశారు.పోగు చేసిన చెత్త అంతటినీ సంగ్తీ లోయలో, దగ్గర్లోని నామ్‌డ్రోలింగ్ గ్రామంలో ఉన్న రెండు ప్రదేశాలకు తీసుకువెళ్తారు. అక్కడ స్వయం సహాయక సంఘాలకు చెందిన దాదాపు వందమంది మహిళలు వాటిని వేరు చేస్తారు. కంపోస్ట్ తయారు చెయ్యడానికి వీలైనవాటిని ఒక యార్డులోకి తరలిస్తారు.



అక్కడే స్థిరపడాలని...

ఇప్పుడు సంగ్తీ లోయ మునుపటి ప్రకృతి సౌందర్యాన్ని సంతరించుకుంటోంది. వ్యర్థాల రహిత గ్రామంగా రూపు దిద్దుకుంటోంది. ఇతిశా, ఆమె బృందం చేస్తున్న ప్రచారం కారణంగా పర్యాటకుల సంఖ్య పెరిగింది. దానితోపాటు సంగ్తీలో పర్యాటకులకు ఆతిథ్యం ఇచ్చే గ్రామస్తుల సంఖ్య పెరిగింది. దానితో వారికి మంచి ఆదాయం కూడా వస్తోంది. "పర్యాటక కేంద్రంగా ఇంకా ఎంతో అభివృద్ధి చెందే అర్హత, ఆస్కారం సంగ్తీ లోయకు ఉన్నాయి. అందుకోసం అవసరమైన సౌకర్యాల కల్పనకు గ్రామస్తులు, అధికారుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నాం" అంటున్న ఇతిశా గ్రామస్తులకు మరింత దగ్గరగా ఉండడం కోసం, వాళ్ళకు మార్గనిర్దేశం చేయడం కోసం తన నివాసాన్ని సంగ్తీకి మార్చారు. "ఇప్పుడు ఈ గ్రామస్తులందరూ నాకు ఆత్మీయులు అయిపోయారు. మరెక్కడున్నా ఈ అప్యాయత నాకు దొరకదని తెలుసు. అందుకే ఈ లోయలోనే స్థిరపడాలనుకుంటున్నాను. స్థానికులకు సాధికారత కల్పించడం, భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని పరిరక్షించడం నా ఆశయం" అని చెబుతున్నారు. ఇతిశా.

పిల్లలు ఎవరితోనూ కలవడం లేదా?

కొంతమంది పిల్లలు ఎవరితోనూ కలవడానికి ఇష్టపడరు. కొన్ని సందర్భాల్లో అయితే గది నుంచి బయటికి కూడా రారు. దీనికి కారణాలేంటో తెలుసుకుందాం!

అవమానించేలా మాట్లాడడం

● కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో ఎప్పుడూ వ్యంగ్యంగా, వెటకారంగా మాట్లాడుతుంటారు. విషయాన్ని సూటిగా చెప్పే వీలున్నప్పటికీ పిల్లల మనసు గాయపరిచేలా మాట్లాడతారు. దీనితో పిల్లలు తమ తల్లిదండ్రుల ముందుకు రావడానికి కూడా ఇష్టపడరు. ఇంటికి బంధువులు, స్నేహితులు వచ్చినప్పుడు వారిముందు పిల్లలను తక్కువచేసి మాట్లాడడం కూడా మంచిది కాదు. దీనివల్ల పిల్లల్లో ఆత్మవిశ్వాసం తగ్గి, బయటి వ్యక్తులతో కలవడానికి ఉత్సాహం చూపించరు.

అతిగా ప్రశ్నించడం

● స్కూలు, కాలేజీ, స్నేహితుల గురించి ఎక్కువగా ప్రశ్నలు అడగడం పిల్లలకు నచ్చకపోవచ్చు. కొంతమంది పిల్లలు తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు... ఇలా ఎవరు ఎన్ని ప్రశ్నలు అడిగినా ఉత్సాహంగా సమాధానాలు చెబుతారు. ప్రతి విషయాన్ని వారితో పంచుకుంటారు. ఇలాంటి పిల్లలతో ఎటువంటి సమస్యా ఉండదు. కానీ ఇంకొందరు పిల్లలు మాత్రం తమకు సంబంధించిన అంశాలను ఎవరితోనూ పంచుకోవడానికి ఇష్టపడరు. తల్లిదండ్రులు ఏదైనా అడిగినా కూడా చిరాకు పడతారేగానీ ఏమీ చెప్పరు. అవే ప్రశ్నలు గుచ్చిగుచ్చి అడిగితే తప్పించుకునే ప్రయత్నంగా గదిలోకెళ్లి బయటికి రారు. ఈ సమస్య ఎక్కువగా యుక్తవయసు పిల్లల్లో కనిపిస్తుంటుంది. పిల్లలు తమ మనసులోని భావాలను వారంతటవారే చెప్పేలా తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలిగితే సమస్య సులువుగా పరిష్కారమవుతుంది.



ఏకాంతం లేకపోవడం

● హైస్కూల్ లేదా కాలేజీలకు వెళ్లే పిల్లలు కొంత ఏకాంతాన్ని కోరుకోవడం సహజం. ఎదిగే పిల్లలు తమ గురించి తాము తెలుసుకోవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి, తమతో తాము సంతోషంగా గడపడానికి, భవిష్యత్తు గురించి ఆలోచించుకోవడానికి కొంత సమయం ఒంటరిగా ఉండాలనుకుంటారు. కానీ తల్లిదండ్రులు తెలిసో తెలియకో పిల్లల ఏకాంతాన్ని భంగపరుస్తుంటారు. దీనితో పిల్లలు గదిలోకెళ్లి తలుపులు వేసుకుని గంటల సమయం గడిపేస్తుంటారు. యుక్తవయసు పిల్లల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తూ వారికి మార్గనిర్దేశం చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

అకారణంగా మందలించడం

● కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు ఎదురుపడితే చాలు 'ఇంట్లో ఏదైనా పని చేయొచ్చు కదా! చదువుకోవచ్చు కదా!' అంటూ ఊరికే మందలిస్తూ ఉంటారు. దీనితో పిల్లలు గది నుంచి బయటికి రారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కొంతమేర స్వేచ్ఛను ఇస్తూ స్వతంత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం నేర్పించాలి. ఇది పిల్లల మానసిక వికాసానికి, వారిలో లోకజ్ఞానం పెరగడానికి దోహదం చేస్తుంది.

ప్రతిరోజూ మనం అనుసరించే అలవాట్లు, పద్ధతులు మనకు బాగానే అనిపించినప్పటికీ వాటిలో కొన్ని మెదడుపై ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తాయి. శరీరమంతా ఆరోగ్యంగా ఉన్నప్పటికీ మెదడు పనితీరు సరిగ్గా లేకపోతే జీవిత గమనం చిక్కుల్లో పడుతుంది. అందుకే మెదడుకు హాని కలిగించే అంశాల గురించి తెలుసుకుందాం!

ఇలా చేస్తే మెదడుకు హాని

సామాజిక మాధ్యమాలు

● రాత్రి సమయాల్లో ఎక్కువగా సామాజిక మాధ్యమాల్లో గడపడం వల్ల మెదడు పూర్తిగా అలసిపోతుంది. ఫోన్‌లో ఎక్కువసేపు మాట్లాడడం, ఆటలు ఆడడం, సినిమాలు చూడడంతో పాటు ఇతరత్రా వ్యాపకాల వల్ల మెదడు ఒత్తిడికి గురవుతుంది. ఫోన్ నుంచి వెలువడే కాంతి వల్ల నిద్రకు ఉపకరించే మెలటోనిన్ అనే హార్మోన్ ఉత్పత్తి కాదు. దీనివల్ల ప్రశాంతమైన నిద్ర కరవవుతుంది. మెదడుకు స్వాంతన లభించదు. రాత్రి పూట నిద్రించడానికి గంటముందు ఫోన్, టీవీ తదితరాలను ఉపయోగించకుండా... మంచి పుస్తకం చదవడం, సంగీతం వినడం లాంటివి అలవాటు చేసుకోవడం మంచిది.

పోషకాహారం తినకపోవడం

● కంటికి అందంగా కనిపిస్తూ, నాలుకకు రుచిగా అనిపించే ఆహార పదార్థాలన్నీ మెదడుకి నష్టం కలిగిస్తాయి. చక్కెర ఎక్కువగా ఉన్న చిరుతిండ్లు, వేపుళ్లు, రోడ్ల పక్కన అమ్మే ఆహార పదార్థాలు రక్తంలో చక్కెర స్థాయిని, కొవ్వు శాతాన్ని పెంచుతాయి. దీనివల్ల మెదడులోని కణాలు దెబ్బతిని మతిమరుపు, దృష్టి లోపం, ఏకాగ్రత కుదరకపోవడం లాంటి సమస్యలు ఎదురవుతాయి. తాజా ఆకు కూరలు, పండ్లు, గింజలు, ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ ఎక్కువగా లభించే ఆహారం తీసుకోవడం వల్ల మెదడు చురుకుగా పనిచేస్తుంది.

ఉత్సుకత లేకపోవడం

● మన మెదడు ఎప్పుడూ కొత్త విషయాలు తెలుసుకోవాలని, సాహసాలు చేయాలని, సవాళ్లు స్వీకరించాలని చూస్తుంది. మనం వాటిని నెరవేర్చే అవకాశం కల్పించని పక్షంలో మెదడు క్రమంగా బలహీనమవుతుంది. సంగీతం లేదా కొత్త భాష నేర్చుకోవడం, చిక్కు ప్రశ్నలకు సమాధానాలు వెతకడం, ఆలోచనను పెంచే చదరంగం లాంటి ఆటలు ఆడడం వల్ల మెదడు విశేషంగా ప్రభావితమవుతుంది. శారీరక వ్యాయామం కండరాలను పటిష్టపరిచినట్టే మానసిక వ్యాయామం మెదడును ఆరోగ్యంగా, చురుకుగా ఉంచుతుంది.




కదలకుండా కూర్చోవడం

● ఎక్కువసేపు కదలకుండా కూర్చోవడం వల్ల మెదడు నిస్తేజ స్థితిలోకి వెళుతుంది. శారీరక చలనం వల్లనే మెదడుకు రక్త ప్రసరణ సరిగ్గా జరిగి, సమర్థంగా పనిచేయగల్గుతుంది. ఏకాగ్రత కుదరాలన్నా, జ్ఞాపకశక్తి పెరగాలన్నా చేస్తున్న పని నుంచి చిన్నపాటి విరామం తీసుకోవడం, కూర్చున్న చోటునే కాళ్లకు సంబంధించిన వ్యాయామాలు చేయడం, భుజాలు కదిలించడం మంచిది.

నీరు తాగకపోవడం

● మెదడు పనితీరు సక్రమంగా ఉండాలంటే దానికి తగినంత ఆక్సిజన్ అందాలి. మెదడుకు అవసరమైన ఆక్సిజన్ నీటి నుంచే లభిస్తుంది. నీరు తాగకుండా ఎక్కువసేపు ఉంటే శరీరం నిర్జలీకరణకు గురై మెదడు సమన్వయం దెబ్బతింటుంది. దాహం వేస్తోందని అనిపించిన ప్రతిసారీ నీరు తాగాలి. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది.






పోలవరం గేమ్ చేంజర్!

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం కుడి ప్రధాన కాలువ ద్వారా గోదావరి జలాలను తరలించి 150 టీఎంసీలను నిల్వ చేస్తామని చెప్పారు. అక్కడ నుంచి బనకచర్లకు తీసుకెళ్లి పెన్నా నదికి అనుసంధానించే కార్యక్రమం చేపడతామన్నారు. ఇందుకోసం రూ.72 వేల కోట్ల వ్యయమవుతుందని అంచనా వేసినట్లు చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రాష్ట్రానికి ఇంత పెద్ద ఎత్తున నిధులు సమీకరించడం కష్టమేనన్నారు. దీనిపై కేంద్రంతో కూడా మాట్లాడతామని చెప్పారు. 4 'పీ'(పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్ట్నర్ షిప్) విధానంలో నిధులు సమీకరించడంపై దృష్టిపెడతామన్నారు. హైబ్రిడ్ విధానంలో కార్యాచరణ అమలు చేస్తామని తెలిపారు. పోలవరం ఎడమ ప్రధాన కాలువ ద్వారా వచ్చే ఏడాది వర్షాకాలం నాటికి అనకాపల్లికి గోదావరి జలాలను తరలిస్తామని తెలిపారు. అక్కడి నుంచి విజయనగరం జిల్లాలోని నదులను అనుసంధానం చేసుకుంటూ.. శ్రీకాకుళం జిల్లాలోని నాగావళి, వంశధారలను కలుపుతూ.. బాహుదా నది దాకా తీసుకెళ్తామన్నారు. వంశధారలో వరద ఉంటే.. నీరు విశాఖ వైపు వస్తుందని తెలిపారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకంలో రివర్స్ పంపింగ్ విధానం ద్వారా శ్రీకాకుళం జిల్లా సరిహద్దు దాకా గోదావరి జలాలను తరలిస్తామన్నారు. నదుల అనుసంధానంపై వినూత్న ఆలోచన చేస్తున్నామన్నారు. జాతీయ రహదారి వెంబడి జల రవాణా చేపట్టే యోచన ఉందని.. అందుకు ముందుకొచ్చే భాగస్వామ్య సంస్థలను ఆహ్వానిస్తామని చెప్పారు. ఇందులో రైతులనూ భాగస్వాములను చేయాలన్న సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సలహాపై సానుకూలంగా స్పందించారు. అయితే రైతులపై భారం వేయబోమని సీఎం తేల్చిచెప్పారు. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించడం సహా.. త్వరితగతిన పూర్తయ్యేందుకు వీలుగా కార్యనిర్వహణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగించి.. నిధులు మంజూరు చేస్తున్నందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి మంత్రి ఆర్ఆర్ పాటిల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయనకు పని అప్పగిస్తే.. పూర్తిచేసే దాకా వదలడన్నారు. వరదల సమయంలో ఆయన పడిన కష్టం అందరికీ తెలిసిందేనని వ్యాఖ్యానించారు. ఇంకా ఏమన్నారంటే..

> ప్రాజెక్టులు పూర్తయితే.. వ్యవసాయోత్పత్తులు పెరుగుతాయి. వాటివల్ల జీఎస్టీ వస్తుంది. నీరుంటే పరిశ్రమలు వస్తాయి. ఇందుకు అనంతపురం జిల్లాలో స్థాపించిన 'కియ' సంస్థ ప్రత్యక్ష ఉదాహరణ. ప్రాజెక్టు వస్తే భూమికి ధర పెరుగుతుంది. రైతుకు మేలు జరుగుతుంది.
>
> - సీఎం చంద్రబాబు



కృష్ణా జలాలను సీమకు వినియోగించాం..

పోలవరం పూర్తయితే కరువుకు చెక్ పెట్టినట్లే. దీని నిర్మాణం ఆలస్యం కాకూడదనే రాష్ట్రప్రభుత్వం నిర్మాణ బాధ్యతలు తీసుకుంది. పోలవరం ఆలస్యమవుతుందని పట్టిసీమ పథకాన్ని నిర్మించి 100 టీఎంసీలను కృష్ణా డెల్టాకు తరలించాం. ఈ మేరకు కృష్ణా జలాలను రాయలసీమలో వినియోగించాం. పోలవరం పూర్తి చేస్తే 200 టీఎంసీలను సీమకు వాడుకోవచ్చు. ప్రాజెక్టులన్నిటినీ పూర్తి చేస్తాం. ప్రతి ఎకరాకూ సాగునీరు దిస్తాం. 2019-24 మధ్య జగన్ పాలన పోలవరం ప్రాజెక్టు పాలిట విధ్వంసకరం. జగన్ రివర్స్ టెండర్ పేరిట విధ్వంసానికి దిగాడు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), కేంద్ర జల సంఘం, కేంద్ర జలశక్తి శాఖ వద్దన్నా వినలేదు. అప్పటి వరకూ వేగవంతంగా పనులు చేస్తున్న నిర్మాణ సంస్థను తరిమేశారు. దీని వల్ల 2020దాకా ప్రాజెక్టు ప్రాంతంలో పనులు చేపట్టే వారే లేకుండా పోయారు. పర్యవేక్షణా కొరవడింది. ఫలితంగా 2020లో వచ్చిన భారీ వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. భూమిలోపల ఉండే ఈ వాల్ వరదకు దెబ్బతిన్నదో లేదో కూడా జగన్ సర్కారు గ్రహించలేదు. 2019లో టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే.. 2021 నాటికే పోలవరం పూర్తయ్యేది.

రెండు నెలలు అటూఇటుగా..

పోలవరం నిర్మాణాన్ని మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి అవహేళన చేస్తే.. జగన్ ధ్వంసం చేశాడు. 2014-19 మధ్య ఈ ప్రాజెక్టుపై టీడీపీ ప్రభుత్వం రూ.16,493 కోట్లు వ్యయం చేసింది. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఖర్చుచేసింది రూ.4,099 కోట్లే. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పుడు కేంద్రం పోలవరానికి రూ.12,157 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులు రెండేళ్లలో విడుదలవుతాయి. 2026 మార్చిలోపు కొత్త డయాఫ్రం వాల్, దానికి సమాంతరంగా ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యాంను కూడా పూర్తి చేస్తాం. 2027 జూన్ నాటికి ప్రాజెక్టును పూర్తిచేస్తాం. రెండు నెలలు అటూ ఇటుగా ఆ ఏడాదే పూర్తి చేస్తాం. 194.60 టీఎంసీల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యంతో 45.72 మీటర్ల ఎత్తున నిర్మిస్తాం.

అవుట్‌సోర్సింగ్ విధానంలో రోడ్ల నిర్మాణం

- ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు: సీఎం

గ్రామీణ రహదారులు కూడా జాతీయ రహదారుల స్థాయిలో ఉండేలా రోడ్ నెట్ వర్క్‌ను పెంచాలన్నదే తన ఆలోచనగా చంద్రబాబు అసెంబ్లీలో తెలిపారు. జాతీయ రహదారులను కలుపుతూ మండల స్థాయిలో రోడ్ నెట్‌వర్క్‌ను అనుసంధానం చేసే రహదారులను అవుట్‌సోర్సింగ్ విధానంలో నిర్మించడం, ద్విచక్ర, త్రిచక్ర వాహనాలు వినహా.. కార్లు, బస్సులు, భారీ రవాణా వాహనాల నుంచి టోల్ వసూలు చేయడంపై శాసనసభ్యులు తన అభిప్రాయాలను వెల్లడించాలని కోరారు. ఉభయ గోదావరి జిల్లాల్లో ప్రయోగాత్మకంగా ఈ అవుట్‌సోర్సింగ్ విధానంలో రహదారుల నిర్మాణం సాగించాలన్న వినూత్న ఆలోచనను అమలు చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. తన ఆలోచనను సమర్థించేవారు చేతులు పైకెత్తాలని కోరగా.. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు సంఘీభావం వ్యక్తం చేశారు.

ఐదేళ్ల పాపాల ఫలితం అనుభవిస్తున్నాం

- ఐదేళ్లలో ఇరిగేషన్ గాడితప్పింది
- బడ్జెట్ కేటాయింపులూ తక్కువే: నిమ్మల

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టును ధ్వంసం చేశారని, గత ఐదేళ్ల పాలన పాపాల ఫలితం ఇప్పుడు రాష్ట్రమంతా అనుభవిస్తోందని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఐదేళ్లలో ఇరిగేషన్ రంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి రైతులను దగా చేసిందని మండిపడ్డారు. ఎత్తిపోతల పథకాలన్నీ నాశనం చేసిందని.. మొత్తం నీటిపారుదల వ్యవస్థనే ధ్వంసం చేసిందని మండిపడ్డారు. సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం నిర్మాణంపై మంగళవారం అసెంబ్లీలో లఘు చర్చను ఆయన ప్రారంభించారు. జలవనరులే జాతికి జీవనాధారమన్న ఉద్దేశంతో ఎన్టీఆర్ నుంచి చంద్రబాబు వరకూ రాష్ట్రంలో నీటి ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని చెప్పారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం రూ.7 లక్షల కోట్లతో బడ్జెట్లు ప్రవేశపెడితే అందులో రూ.72 వేల కోట్లు జలవనరుల శాఖకు కేటాయించిందని తెలిపారు. వైసీపీ ఐదేళ్ల కాలంలో రూ.12 లక్షల కోట్ల బడ్జెట్లు పెట్టి జలవనరుల శాఖకు కేవలం రూ.48 వేల కోట్లు కేటాయించి.. రూ.31 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని వివరించారు. ఖర్చు చేసిన దానిలో సగం అవినీతేనని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టును జగన్ సర్వనాశనం చేశారన్నారు. 'చంద్రబాబు 2014 -19 వరకూ సోమవారాన్ని పోలవరంగా మార్చుకుని 72శాతం పనులు పూర్తి చేశారు. ఇప్పుడు మళ్లీ ఈ ప్రాజెక్టుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే తొలుత పోలవరం పర్యటనకు వెళ్లారు. చంద్రబాబు ఆధ్వర్యంలో 45.72 మీటర్ల ఎత్తున నిర్మించడంతోపాటు నదుల అనుసంధానం పూర్తి చేస్తాం. ప్రతి 2-3 రోజులకోసారి సమీక్ష చేసి మాకు ఆయన దిశానిర్దేశం చేస్తున్నారు. ఐదు నెలలుగా పరుగెత్తించి పనులు చేయిస్తున్నారు. ఆయన వద్ద మేం ఎల్‌కేజీ పిల్లల్లా ఉన్నాం. పీహెచ్‌డీలు చేసినా మాకు గోదావరి, కృష్ణా, పెన్నా తప్ప మరొకటి తెలియదు. కానీ ఎక్కడ ఏ వాగు ఉంది.. ఏ వాగు ఎందులో కలుస్తుందో ఆయనకు స్పష్టంగా తెలుసు' అని కొనియాడారు.

సొసైటీల్లో అక్రమాలపై విచారణ జరపాలి

- ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు ఇచ్చారు
- గంజాయికి ప్రత్యేక బడ్జెట్ పెట్టాలి
- పోలీసుల సమస్యలు పరిష్కరించండి
- అసెంబ్లీలో ఎమ్మెల్యేల డిమాండ్



అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో సహకార సొసైటీల్లో అనేక అక్రమాలు జరిగాయని, వాటిపై విచారణ జరపాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు డిమాండ్ చేశారు. మంగళవారం శాసనసభలో పద్దులపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోపరేటివ్ సొసైటీలను స్వతంత్రంగానే ఉంచాలని, ప్రతి రెండేళ్లకోసారి ఆడిట్‌ను తప్పనిసరి చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో సొసైటీలను నిర్వీర్యం చేశారని, కృష్ణా సహకార కేంద్ర బ్యాంకులో ఇష్టారాజ్యంగా ఉద్యోగాలు ఇచ్చుకున్నారని ఆరోపించారు. సొసైటీలకు ఎన్నికలు జరపకుండా, వాటిని రాజకీయ పునరావాస కేంద్రాలుగా మార్చారని అమలాపురం ఎమ్మెల్యే ఐతాబత్తుల ఆనందరావు విమర్శించారు. కోటప్పకొండ శివరాత్రి ఉత్సవాలకు దేవదాయ శాఖ నుంచి నిధులు కేటాయించాలని నర్సరావుపేట ఎమ్మెల్యే అరవింద్‌బాబు కోరారు.

పోలీసుల పరిస్థితి దయనీయం

సొంత వాహనాల్లేక, ఉన్నా వాటిలో పెట్రోలుకు డబ్బుల్లేక పోలీసుల పరిస్థితి దయనీయంగా ఉందని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. పెట్రోల్, డీజిల్ కోసం ఇతరులను డబ్బు అడిగే పరిస్థితి పోలీసులకు రాకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసులకు మంచి వాహనాలు ఇవ్వాలని, సమస్యలు పరిష్కరించాలని రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కోరారు.

గంజాయి నిర్మూలనకు బడ్జెట్ కేటాయించాలి

గంజాయి వినియోగం విచ్చలవిడిగా పెరిగిందని యలమంచిలి ఎమ్మెల్యే ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేకంగా బడ్జెట్ కేటాయించాలని కోరారు. గుడివాడ మాజీ ఎమ్మెల్యే కారణంగా ఆ నియోజకవర్గం తీవ్ర వెనుకబాటుకు గురైందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆరోపించారు. బీసీ సబ్‌ప్లాన్‌ను పూర్తిస్థాయిలో అమలుచేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు.

శిథిలావస్థలో తుఫాను షెల్టర్లు

దివిసీమలో తుపాను షెల్టర్లు శిథిలావస్థకు చేరాయని, వాటిని పునర్నిర్మించాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. సరిగ్గా ఇదే రోజున దివిసీమ ఉప్పెన సంభవించిందని, పది వేల మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. అప్పుడు నిర్మించిన సైక్లోన్ షెల్టర్లు శిథిలావస్థలో ఉన్నాయన్నారు. ల్యాండ్ గ్రాబింగ్ చట్టంతో చిన్న రైతులు ఇబ్బందులు పడకుండా చూడాలని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కోరారు. కోనసీమ జిల్లాను కేరళ తరహాలో పర్యాటకంగా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. ఉద్దానంలో తాగునీటి సమస్యను పరిష్కరించి, కిడ్నీ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు.

ఇకపై రైతు సేవా కేంద్రాలు

రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మారుస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వంలో ఆర్బీకేలకు సొసైటీలకు అనుసంధానం లేకుండా పోయిందన్నారు. రెండిటినీ సమన్వయం చేస్తామన్నారు. పీఏసీఎస్, డీసీసీబీ, డీసీఎంఎస్ ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారూ పోటీకి అర్హులేనని తెలిపారు. దీనికి సంబంధించిన ఏపీ కోపరేటివ్ సొసైటీల చట్టం సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఎక్సైజ్ చట్టంలో సవరణలకు మంత్రి కొల్లు రవీంద్ర మూడు బిల్లులను సభలో ప్రవేశపెట్టారు.

సాంకేతికతతో మత్స్య రంగంలో సుస్థిరాభివృద్ధి

- ఏటా 15% వృద్ధి సాధనకు ప్రణాళికలు
- రేపు విజయవాడలో మత్స్యకార దినోత్సవం: మత్స్యశాఖ కమిషనర్

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సాంకేతికతను వినియోగించి.. చేపలు, రొయ్యల ఉత్పత్తిలో ప్రతి ఏటా 15 శాతం వృద్ధి సాధించేలా ప్రణాళికలు రూపొందించినట్లు మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్ చెప్పారు. రాష్ట్రంలోని చేపలు, రొయ్యల సాగుదారులు, మత్స్యకారులు సుస్థిరాభివృద్ధి సాధించేందుకు సాంకేతికత వినియోగంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 21న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం శంకర్ మీడియాతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారని చెప్పారు. 10 ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశామన్నారు. ఆక్వా చెరువుల్లో ప్రాణవాయువు తగ్గితే.. వాటంతట అవే తిరిగే ఎయిరేటర్ల టెక్నాలజీ, తక్కువ ఖర్చుతో వ్యర్థాల నుంచి సంపద సృష్టించే బ్లాక్ సోల్జర్ ఫ్లై లార్వాల పెంపకం వంటివి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని లక్షా 20 వేల మంది మత్స్యకారులకు భద్రత కల్పించే ట్రాన్స్‌పొండర్లు, 2.30 లక్షల మంది ఆక్వా రైతులకు పెట్టుబడి తగ్గించేలా బయోఫ్లోప్ టెక్నాలజీ, డ్రోన్లతో రొయ్యలకు మేత అందించే విధానంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మత్స్యకారులు, ఆక్వా రైతులకు టెక్నాలజీని అనుసంధానం చేయడం ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గించి, స్థిరమైన లాభాలు పొందేలా మత్స్య రంగానికి ప్రభుత్వ సహకారం అందించనున్నట్లు ఆయన వివరించారు.

తుది 'కీ'లో తప్పులపై ఆధారాలు ఇవ్వండి

- కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్ష అభ్యర్థులకు హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష తుది 'కీ'లో తప్పులున్నాయని నిర్ధారించే ఆధారాలను, సంబంధిత పుస్తకాలను తమ ముందు ఉంచాలని అభ్యర్థుల తరఫు న్యాయవాదిని మంగళవారం హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను రేపటికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాతపరీక్ష ప్రశ్నాపత్రంలోని 7 ప్రశ్నలకు ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు(ఎస్ఎల్‌పీఆర్‌బీ) సరైన జవాబులు నిర్ణయించకుండా తుది కీ ప్రకటించిందని, జవాబులను పునఃపరిశీలించి మళ్లీ ఆ కీ ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై గతంలో సింగిల్ జడ్జి విచారణ జరిపి రిక్రూమెంట్ బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తూ పిటిషన్లను కొట్టివేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు.

పనులు నేను చేస్తే... బిల్లులు వైసీపీ నేతలు తీసుకున్నారు

- టీడీపీ కార్యాలయంలో బాధితుల ఫిర్యాదు

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'మా గ్రామంలో నేను సిమెంటు రహదారుల పనులు చేశా. ఆ పనులకు వైసీపీ నేతలు బిల్లులు తీసుకున్నారు' అని ఓ బాధితుడు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ సలహాదారు ఎంఏ షరీఫ్, మాజీ మంత్రి పీతల సుజాత మంగళవారం ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తిరుపతి జిల్లా చిన్న గొట్టుగల్లు మండలం జంగావాండ్లపల్లె గ్రామ పంచాయితీకి చెందిన బి.ప్రతాపరెడ్డి ఫిర్యాదు చేస్తూ... '2017-18లో చినిగేపల్లి గ్రామంలో ఈ ఘటన జరిగింది. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు' అని వాపోయారు. అనకాపల్లి జిల్లా, చోడవరం మండలం, చోడవరం రెల్లి వీధికి చెందిన సోమాదుల కృప మాట్లాడుతూ, 'మా కుమారుడు హత్యకు గురయ్యాడు. పోలీసులు మాత్రం అది రోడ్డు ప్రమాదం అంటూ కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు. నా కుమారుని చావుకు కారణమైన వారిని పట్టుకొని శిక్షించాలి' అని విజ్ఞప్తి చేశారు. 'నా భూమిని లీజుకు తీసుకొన్న వైసీపీ నేతలు దానిని తప్పుడు పత్రాలతో కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేకుండా పోయింది' అని చిత్తూరు జిల్లా, పెనుమూరు మండలం, పెద్ద రాజుపల్లికి చెందిన ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలని పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తమను పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అయినా న్యాయం చేయాలని వారు కోరారు. క్లాప్ వాహనాల డ్రైవర్లు, సూపర్‌వైజర్లను ఏజెన్సీల పరిధి నుంచి మార్చి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి జీతాలు చెల్లించేలా చూడాలని కొందరు విజ్ఞప్తి చేశారు.

ఎన్డీఏ హయాంలోనే పోలవరం పూర్తి

- విశాఖకు ఎంతో ఉపయోగం: విష్ణుకుమార్ రాజు
- చింతలపూడి ఎత్తిపోతల పనులను ప్రారంభించాలి: గోరంట్ల

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ ప్రభుత్వంలోనే పోలవరం పూర్తి చేస్తామని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. మంగళవారం శాసన సభలో పోలవరంపై చర్చ సందర్భంగా మాట్లాడారు. '2014-19లో అద్భుత పాలన అందించాం. పోలవరాన్ని కూడా 72 శాతం పూర్తి చేశాం. విధ్వంసానికి మారుపేరు జగన్. 17 నెలల పాటు పోలవరం పనులు నిలిపేశారు. సమయం, నిధులు వృథా అయ్యి తీవ్ర నష్టం జరిగింది. పోలవరం పూర్తి అయితే విశాఖపట్నానికి ఎంతో ఉపయోగం' అని విష్ణుకుమార్ రాజు అన్నారు. జగన్ రైతు ద్రోహి అని చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు అన్నారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ, 'జగన్ ఐదేళ్ల కాలంలో పోలవరానికి పొగ, అమరావతికి అగ్గి పెట్టారు. తనువు తీరినా.. తనివి తీరని వ్యక్తి జగన్' అని విమర్శించారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ.. 'గత టీడీపీ ప్రభుత్వంలో రూ.1,000 కోట్లతో నిర్మించిన పట్టిసీమ వల్ల రూ.8 వేల కోట్ల ఆదాయం వచ్చింది. పోలవరం పూర్తి చేస్తే లక్షల ఎకరాలకు నీరు అందుతుంది. దాని వల్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటు పెరుగుతుంది. పోలవరం ప్రాజెక్టు విషయంలో జగన్ చేసిన తప్పులకు ఆయన్ను జైలులో పెట్టాలి. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని ఆపేశారు. వెంటనే పనులు ప్రారంభించాలి' అని కోరారు. వైసీపీ ప్రభుత్వం పోలవరం నిర్వాసితులను పట్టించుకోలేదని స్థానిక ఎమ్మెల్యే బాలరాజు అన్నారు. ఎమ్మెల్యేలు పుల్లారావు, కాలవ శ్రీనివాసులు, జయ నాగేశ్వరరెడ్డి తదితరులు మాట్లాడారు.

సీడబ్ల్యూసీ తదుపరి చైర్మన్‌గా ఎంకే సిన్హా..!

హైదరాబాద్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) తదుపరి చైర్మన్‌గా డాక్టర్ ముకేష్‌కుమార్ సిన్హా నియమితులు కానున్నారు. ప్రస్తుతం గోదావరి నది యాజమాన్య బోర్డు(జీఆర్ఎంబీ) చైర్మన్‌గా పనిచేస్తున్న ఆయనను సీడబ్ల్యూసీ చైర్మన్‌గా నియమించడానికి వీలుగా ఫైలు కేంద్ర జలవనరులశాఖ మంత్రి సీఆర్ పాటిల్ వద్దకు చేరింది. ఆ ఫైలుపై మంత్రి సంతకం చేయగానే ఎంకే సిన్హాకు నియామక ఉత్తర్వులు వెలువడనున్నాయి.

ఇంధన సర్దుబాటుపై అభ్యంతరాల గడువు పెంపు

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంధన సర్దుబాటు (2023-24) చార్జీలకు సంబంధించి రూ.11,826.42 కోట్లపై ప్రజల నుంచి అభ్యంతరాల స్వీకరణ గడువును ఏపీఈఆర్‌సీ పొడిగించింది. ఆ గడువు మంగళవారంతో ముగియగా.. ఈనెల 25వ తేదీ వరకు పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది.

హైకోర్టుకు కొత్త అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టులో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు(ఏపీపీ)గా న్యాయవాదులు మర్రి వెంకటరమణ, చింతలపాటి పాణిని సోమయాజి నియమితులయ్యారు. వీరి నియామకానికి సంబంధించి న్యాయశాఖ కార్యదర్శి(ఎఫ్ఏసీ) సునీత మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హైకోర్టులో జరిగే ప్రొసీడింగ్స్, ప్రాసిక్యూషన్, అప్పీళ్ల విచారణను ఏపీపీలు నిర్వహిస్తారు. మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగనున్నారు.

రెండు మాసాల్లో ఎంఎస్‌ఎంఈలపై సర్వే పూర్తి

రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) సర్వేను రెండు మాసాల్లో(వచ్చే ఏడాది ఫిబ్రవరి) పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సంబంధించిన షెడ్యూలు, మార్గదర్శకాలను వివరిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రంగాల్లో ఉన్న ఎంఎస్ఎంఈలను గుర్తించడానికి ఈ ఏడాది మార్చి 1 నుంచి 17 వరకు తొలిదశ సర్వే నిర్వహించారు. అయితే, మార్చి 17 నుంచి సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ సర్వేను ప్రభుత్వం నిలిపివేసింది. ఈ నేపథ్యంలో సర్వేను పునఃప్రారంభించి ఫిబ్రవరి 1 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించింది.

రూ. 85 వేల కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్

రాష్ట్రంలో 10 భారీ పరిశ్రమల ఏర్పాటు

> అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం బంగారయ్యపేట వద్ద ఆర్సెలర్ మిట్టల్-నిప్పాన్ స్టీల్స్ జాయింట్ వెంచర్ ప్రాజెక్టు ఏర్పాటుకానుంది. ఈ సంస్థ అతిపెద్ద మొత్తంలో రూ.61,780 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్(క్యాప్టివ్ పోర్టుతో కలిపి) తొలిదశ నిర్మాణ పనులను 2029 నాటికి పూర్తి చేస్తారు. ఈ ప్రాజెక్టుతో 21 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి.

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పెట్టుబడుల వరద ప్రారంభమైంది. భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన సంస్థలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఆయా సంస్థల ఏర్పాటుతో రాష్ట్రానికి రూ.85 వేల కోట్లకు పైగా పెట్టుబడులు తరలిరానున్నాయి. దీంతో పెట్టుబడులను ఆకర్షించి.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం గత ఐదు నెలలుగా చేస్తున్న ప్రయత్నాలు కార్యరూపం దాల్చినట్టయింది. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన పారిశ్రామిక విధానాలను ప్రకటించిన తర్వాత అనేక దిగ్గజ కంపెనీలు రాష్ట్రంలో భారీస్థాయిలో పెట్టుబడులు పెట్టి.. పరిశ్రమలు నెలకొల్పేందుకు ముందుకు వస్తున్న సంగతి తెలిసిందే. ఇలా వచ్చిన పది సంస్థలకు ల్యాండ్ పూలింగ్ విధానంలో భూములు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సాయంత్రం వెలగపూడిలోని సచివాలయంలో రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ) తొలి సమావేశం నిర్వహించారు. గడచిన ఐదు నెలల్లో వచ్చిన పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలు, పలు ఒప్పందాలు, వాటి పురోగతిపై చర్చించారు. మొత్తం రూ.85,083 కోట్ల భారీ పెట్టుబడులతో, 33,966 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు ముందుకు వచ్చిన 10 పారిశ్రామిక సంస్థల ప్రతిపాదనలకు ఎస్ఐపీబీ సమావేశం ఆమోదం తెలిపింది.

అన్ని రకాల సహకారం: చంద్రబాబు

రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం అన్ని రకాలుగా సహకరిస్తుందని సీఎం చంద్రబాబు తెలిపారు. ఎస్ఐపీబీ తొలి సమావేశంలో ఆయన పెట్టుబడులు, ఒప్పందాలపై సమీక్షించారు. పెట్టుబడులకు దేశంలోని రాష్ట్రాల మధ్య తీవ్రమైన పోటీ ఉందని, ఆ పోటీని తట్టుకుని రాష్ట్రానికి పెట్టుబడులు సాధించేలా పనిచేయాలని అధికారులకు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ విధానాల వల్ల ఐదేళ్లపాటు పెట్టుబడులు రాలేదన్నారు. అంతకుముందు ఒప్పందాలు చేసుకున్నవారు కూడా గత ప్రభుత్వ వైఖరితో వెనక్కి వెళ్లిపోయారని చెప్పారు. ప్రభుత్వ టెర్రరిజంతో పారిశ్రామికవేత్తలు పారిపోయారని సీఎం గుర్తు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే వారికి తగిన గౌరవం ఇవ్వాలని, వారికి అన్ని విధాలుగా సహకరించాలని అధికారులను ఆదేశించారు. ఒక పెట్టుబడిపై చర్చ మొదలైతే దాన్ని సాధించేవరకు వదిలి పెట్టకూడదన్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'ను సాకారం చేసేలా ఒప్పందాలను నిత్యం ట్రాక్ చేయాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా అధికారులు పలు అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. గత ప్రభుత్వం పరిశ్రమలకు ప్రోత్సాహకాలను చెల్లించలేదని చెప్పారు.

మిట్టల్ కోసం పూలింగే!

ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూములను ల్యాండ్ పూలింగ్ విధానంలో తీసుకోవాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. ఈ ఫ్యాక్టరీ ద్వారా ప్రత్యక్షంగా 61 వేల మందికి, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి లభిస్తుందన్నారు.

పెట్టుబడి పెట్టే సంస్థ (రూ. కోట్లలో)	పెట్టుబడి	ఉద్యోగాలు
ఆర్సెలర్ మిట్టల్ నిప్పాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	61,780	21,000
కళ్యాణి స్ట్రాటజీ సిస్టమ్స్ లిమిటెడ్	1,430	565
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	5,001	1,495
టాఫే ఫరేషియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	76	250
ఫిలిక్స్ కార్బన్ బ్లాక్ లిమిటెడ్	3,798	200
ఆజాద్ ఇండియా మొబిలిటీ లిమిటెడ్	1,046	2,381
డల్లాస్ టెక్నాలజీ సెంటర్ ఎల్ఎల్‌పి	50	2,000
గ్రీన్‌కో సోలార్ ప్రైవేట్ లిమిటెడ్	2,000	1,725
అస్త్రా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	8,240	4,000
ఎకోరెన్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్	1,662	350
మొత్తం	85,083	33,966

ప్రజాభీష్టం మేరకే భూములు

భారీ పరిశ్రమలకు భూములు అవసరమైనచోట 3 రకాలుగా భూసేకరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ విషయంలో ప్రజల ఇష్టానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇవీ మూడు విధానాలు..

1) రాజధాని అమరావతిలో చేపట్టినట్లుగా భూ సమీకరణ(ల్యాండ్ పూలింగ్).


2) ఏ ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చారో వారికి దానిలోనే ఉద్యోగాలు, ఉపాధి కల్పించే విధానం.

3) ఉన్నంతలో మంచి ప్యాకేజీ ఇచ్చి భూసేకరణ చేపడతారు.

రూ.418 కోట్ల ధాన్యం కొనుగోలు: మంత్రి నాదెండ్ల

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.418.75 కోట్ల విలువైన ధాన్యాన్ని ప్రభుత్వం రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో మొత్తం 617 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 24,051 మంది రైతుల నుంచి 1,81,988 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు రూ.391.50 కోట్లు రైతులకు చెల్లించినట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని విక్రయించిన 24 నుంచి 48 గంటల్లోపే వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేసినట్లు మంత్రి మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. రైతులు తమ ధాన్యాన్ని ఎప్పుడు, ఎక్కడ అమ్ముకోవాలో వారే నిర్ణయించుకునేందుకు ప్రభుత్వం వాట్సాప్ చాట్‌బోర్డ్‌ని ప్రవేశపెట్టిందన్నారు. రైతులకు గోనెసంచుల సరఫరా నుంచి ధాన్యం రవాణా వరకు విధానాలను సులభతరం చేశామన్నారు.

ఆంధ్రజ్యోతి



సభాపర్వం

సీఎం చంద్రబాబు అరెస్టుకు పెద్ద కుట్ర: కోటంరెడ్డి

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'సభా నాయకుడిపైనే ఇంత పెద్ద కుట్ర జరిగింది.. ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటి?' అని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ముమ్మాటికీ కుట్రే' కథనాన్ని ఆయన సభలో ప్రదర్శించారు. 'ఇది సభా నాయకుడి గౌరవ మర్యాదలకు సంబంధించిన అంశం. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కుట్రపై సభలో చర్చ జరగాలి. డీజీపీకి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాసిన లేఖ సంగతేంటో తేల్చాలి. జీరో అవర్ రద్దు చేసి తక్షణమే చర్చ చేపట్టాలి' అని పట్టుబట్టారు. అయితే డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, 'జీరో అవర్‌లో సమాధానాలు ఉండబోవు.. ఇంతటి సీరియస్ అంశాన్ని చర్చించేందుకు మరోసారి తగిన సమయం తీసుకుందాం' అని బదులిచ్చారు.

భూదందాలు బయటికొస్తాయనే ఫైళ్ల దహనం

- సీఐడీ సమగ్ర దర్యాప్తు చేస్తుంది
- దోషులందరినీ గుర్తిస్తాం... అరెస్టు చేస్తాం: మంత్రి అనగాని



అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో భూ రికార్డుల దహనం ఘటనపై శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడారు. 'జగన్ ప్రభుత్వంలో అనేక భూ దందాలకు పాల్పడ్డారు. అవి బయటకు వస్తాయని ఫైళ్ల దహనం కుట్ర పన్నారు. మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో అనేక రెవెన్యూ రికార్డులు కుట్రలో భాగంగానే తగలబెట్టారు. సీసీటీవీలు పని చేయలేదు. పలు రసాయనాలను వాడారని నిర్ధారణ జరిగింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనేక భూకబ్జాలకు పాల్పడ్డారని ఫిర్యాదులు వచ్చాయి. ఫైళ్ల తగలబెట్టిన వారంతా మాజీ మంత్రి అనుచరులని గుర్తించారు. భూ దందాలు, ఫైళ్ల దహనంపై సీఐడీ విచారణ జరుగుతోంది. ఫైళ్లను బూడిద చేసినా అక్రమాలకు సంబంధించిన ఆధారాలు వెలికితీశాం. ఆన్‌లైన్‌లో ఉన్న అన్ని ఫైళ్లను రిట్రీవ్ చేశాం. సమగ్ర దర్యాప్తు చేసి దోషులందరినీ గుర్తిస్తాం. వారందరినీ అరెస్టు చేస్తాం' అని స్పష్టం చేశారు.

వైసీపీ ఎమ్మెల్సీల ఆందోళన

భూ దందాల అంశంపై మండలిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి పేరు ప్రస్తావించడంపై వైసీపీ సభ్యులు అభ్యంతరం తెలిపారు. మదనపల్లె ఘటనపై మంత్రి అనగాని చేసిన వ్యాఖ్యలపై ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి చేతనైతే భూదందాల్లో తప్పు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, దర్యాప్తు జరిపి అక్రమార్కులపై చర్యలు తీసుకుంటే అభ్యంతరం లేదన్నారు. మదనపల్లె అగ్నిప్రమాదం తర్వాత భూకబ్జాలపై అర్జీలు స్వీకరించామని, వాటిల్లో పెద్దిరెడ్డి ఎక్కువ కబ్జా చేసినట్లు ఫిర్యాదులు వచ్చాయని అనగాని వివరించారు. పెద్దిరెడ్డి పేరు ప్రస్తావించడంపై మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేస్తూ... 'రామచంద్రారెడ్డి పేరును రికార్డుల నుంచి తొలగించాలి. విచారణ జరుగుతున్నప్పుడు పేర్లుఎలా చెబుతారు? విచారణలో తేలాక మాట్లాడాలి. ప్రతి ఒక్కరిపై బురద చల్లడమేంటి?' అని ప్రశ్నించారు. చైర్మన్ మోషేన్ రాజు మాట్లాడుతూ, పేర్లు ప్రస్తావించకుండా మాట్లాడాలని సభ్యులకు సూచించారు.

'రుషికొండ'పై మంటలు





- మండలిలో మంత్రులు, బొత్స మధ్య యుద్ధం
- ప్యాలెస్ కట్టిన 480 కోట్లతో 26 వేల మంది పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చు
- ఆ విలాసాలు చూస్తే గుండె ఆగిపోతుంది
- దమ్ముంటే బహిరంగ చర్చకు సిద్ధమా?
- మంత్రి కందుల దుర్గేశ్, అచ్చెన్న ఆగ్రహం
- బస్సులో తీసుకెళ్లి చూపిస్తాం రండి.. అంటూ వైసీపీ సభ్యులను ఉద్దేశించి వ్యాఖ్యలు
- అదేమన్నా ప్రైవేటు భవనమా?: బొత్స

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖలోని రుషికొండపై కట్టిన విలాసవంతమైన ప్యాలెస్‌కు పెట్టిన ఖర్చుతో 26 వేలమంది పేదవారికి ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చునని మంత్రులు దుయ్యబట్టారు. ఒక వ్యక్తి కోసం రుషికొండలో ఏర్పాటుచేసిన విలాసాలు చూస్తే ఎవరికైనా గుండె ఆగిపోతుందని వ్యాఖ్యానించారు. రుషికొండ ప్యాలెస్ వ్యవహారంపై బహిరంగ చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని స్పష్టం చేశారు. జగన్ చేసిన పనికి సిగ్గుపడాల్సింది పోయి, ఎదురుదాడికి ప్రయత్నిస్తున్నారంటూ.. శాసనమండలిలోని వైసీపీ సభ్యులను ఉద్దేశించి మంత్రులు అచ్చెన్నాయుడు, కందుల దుర్గేశ్ తీవ్ర స్వరం వినిపించారు. మంగళవారం ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ సభ్యులు దువ్వారపు రామారావు, వేపాడ చిరంజీవిరావు, పంచుమర్తి అనురాధ....రుషికొండ ప్యాలెస్‌పై ప్రశ్నలు వేశారు. ఆ ప్రశ్నలకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమాధానమిచ్చే క్రమంలో.. వైసీపీ సభ్యులు తీవ్ర నిరసన తెలిపారు. దీనిపై అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం సాగింది. అనంతరం వైసీపీ సభ్యులు మండలి నుంచి వాకౌట్ చేశారు. అంతకు ముందు... మంత్రి దుర్గేశ్ మాట్లాడుతూ.. "రుషికొండపై 58 గదులతో ఉన్న హరిత రిసార్ట్స్‌ను కూలగొట్టి గత ముఖ్యమంత్రి జగన్ కోసం విలాసవంతమైన ప్యాలెస్‌ను నిర్మించారు. ఈ ప్యాలెస్ నిర్మాణం పూర్తిగా అబద్ధాల పునాదిపైనే జరిగింది. ఉన్న దాని కంటే అద్భుతమైన రిసార్ట్ కడతామని చెప్పి..దానికి భిన్నంగా భూమి వినియోగ మార్పిడి చేశారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కోసం అంటూ జీవో ఇచ్చారు. చివరకు.. ప్యాలెస్‌ను రూ.480 కోట్లు పెట్టి కట్టారు. అందులో ఒక బాత్ టబ్ ఖరీదే రూ. 12 లక్షలుంది. రోమ్ నగరం తగలబడుతుంటే ఫిడేల్ వాయించిన రాజు తీరును జగన్ చేష్టలు గుర్తుకు తెస్తున్నాయి. ప్యాలెస్ నిర్మాణం అవుతుండగానే దీనిపై కోర్టులో కేసులు దాఖలయ్యాయి. పరిశీలనకు కోర్టు.. ఒక కమిటీ వేసింది. న్యాయస్థానం ఇచ్చే తీర్పు కోసం వేచి చూస్తున్నాం" అని దుర్గేశ్ తెలిపారు. అనంతరం సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చే క్రమంలో.. సవాళ్లు, మాటల యుద్ధంతో గందరగోళం నెలకొంది. జీవోలు సహా పత్రాలన్నింటినీ సభలో పెడతామని, మండలే దీనిపై తేల్చాలని మంత్రి దుర్గేశ్ అన్నారు. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. "పర్యావరణాన్ని ధ్వంసం చేసి మరీ రుషికొండ భవనాలను నిర్మించారని విచారణ కమిటీలు తేల్చాయి. వైసీపీ సభ్యులందరినీ అక్కడికి తీసుకెళ్తామని, డబ్బులను ఏవిధంగా నొక్కేశారో చెబుతామని వ్యాఖ్యానించారు.

ఎస్ఎఫ్‌టీ రూ.28 వేలు చొప్పున ఖర్చు పెట్టారు: అచ్చెన్న

చదరపు అడుగు రూ.28వేలు చొప్పున ఖర్చుపెట్టి రుషికొండ ప్యాలెస్ కట్టారని, ప్రపంచంలో ఎక్కడా ఇంత వ్యయంచేసి ఉండరని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. "ప్యాలెస్ నిర్మాణం అయినన్ని రోజులూ ఎవరినీ ఆ దరిదాపులకు కూడా పోనీయలేదు. అక్కడ నిర్మాణాలు ఎవరికీ తెలియకుండా చేశారు. అప్పట్లో మంత్రిగా ఉన్నప్పటికీ బొత్స నారాయణ కూడా ప్యాలెస్‌ను చూడలేదు. వైసీపీ సభ్యులందరినీ బస్సులో అక్కడకు తీసుకెళ్లి చూపిస్తాం. ఆ తర్వాత వారూ ఏమీ మాట్లాడలేరు. రుషికొండ నిర్మాణాలకు పెట్టిన రూ.480 కోట్లతో 26 వేల మంది పేదవారికి ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చు. టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీ, సచివాలయాలను ఎస్ఎఫ్‌టీ రూ. 6 వేలు పెట్టి కడితే విపక్షంలో ఉన్న వైసీపీ నేతలు నానా యాగీ చేసేశారు. ఇప్పుడేమో జగన్ చేసిన తప్పును చూసి సిగ్గుపడకుండా సమర్థిస్తూ మాట్లాడుతున్నారు. ఎదురుదాడికి ప్రయత్నిస్తున్నారు" అని అచ్చెన్న మండిపడ్డారు.

అదేమన్నా ప్రైవేటు భవనమా? : బొత్స

రుషికొండపై కట్టింది ప్రైవేటు భవనం కాదని, ప్రభుత్వ భవనాలే నిర్మించారని వైసీపీ శాసనమండలి పక్షనేత బొత్స సత్యనారాయణ అన్నారు. "అన్ని అనుమతులు తీసుకునే రుషికొండపై భవనాలు నిర్మించాం. ఒకవేళ భవనాల నిర్మాణాల్లో అవినీతి జరిగినట్టు చంద్రబాబు ప్రభుత్వం భావిస్తే, విచారణ జరిపి చర్యలు తీసుకోవచ్చు. రుషికొండ ప్యాలెస్‌ను ఎస్ఎఫ్‌టీ 2 వేలకు కట్టామంటున్నారు. నాడు టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీ భవనాన్ని చదరపు అడుగు 14వేలకు కట్టింది. రుషికొండ భవనాల వినియోగంపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలి. దమ్ముంటే రండి...చూసుకుందాం రండి... అని మంత్రులు మాట్లాడటం సరికాదు" అని బొత్స అన్నారు. బొత్స వ్యాఖ్యలపై మంత్రి దుర్గేశ్ స్పందిస్తూ... సీఎం కార్యాలయం ఇచ్చిన జీవోను చూపిస్తాం రమ్మని చెప్పాను....కానీ చూసుకుందాం అని అనలేదన్నారు. చూసుకోవడానికి తానేమీ వస్తాదును కాదని మంత్రి గట్టిగా కౌంటర్ ఇచ్చారు.

అధికారంలో ఉండీ.. ప్రతిపక్షంలా మాట్లాడుతున్నారు

- రాజకీయ లబ్ధి కోసమే రుషికొండపై విమర్శలు: వైసీపీ

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మంత్రులు చెప్తున్న సమాధానాలు సరిగా లేవని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు అధికారంలో ఉండీ.. ప్రతిపక్ష నేతల్లా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ... 'రుషికొండ భవనాలన్నీ ప్రభుత్వ సొమ్ముతో కట్టారని మంత్రులే చెప్తున్నారు. వాటిని ఏ విధంగా ఉపయోగించుకోవాలో ఆలోచన చేయకుండా, అవన్నీ జగన్ కోసమే కట్టినట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉంది' అని అన్నారు. రుషికొండ భవనాల విషయంలో టీడీపీ రాజకీయ విమర్శలు మానుకోవాలని ఎమ్మెల్సీ కుంభా రవిబాబు సూచించారు. కూటమి నేతలు రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహకాల కోసం బడ్జెట్‌లో తగిన కేటాయింపులు జరగలేదని రవీంద్రనాథ్ విమర్శించారు.



స్వచ్ఛ గ్రామాలు అందరి బాధ్యత

డంపింగ్ యార్డుల సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తాం

- గ్రామాల్లో యార్డుల ఏర్పాటు, నిర్వహణపై త్వరలోనే కొత్త విధానం
- శాసన మండలిలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

అమరావతి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రామాలను స్వచ్ఛంగా, శుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్రంలో త్వరలోనే డంపింగ్ యార్డుల ఏర్పాటు, నిర్వహణలపై ఒక విధానం తీసుకొస్తామని స్పష్టం చేశారు. మంగళవారం శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణ అవసరాన్ని గుర్తించామని, ఆ సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని చెప్పారు. వాటి నిర్వహణ అందరి బాధ్యత అని పేర్కొన్నారు. భూమి అందుబాటులో లేని నేపథ్యంలో 10 నుంచి 15 పంచాయతీలు కలిపి ఒక డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన చేస్తున్నామని, త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు. చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాల నిర్వహణకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఇచ్చామని తెలిపారు. రాష్ట్రంలో 2015 నుంచి ఉపాధి హామీ పథకానికి అనుగుణంగా 10,808 గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులను చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు (ఎస్‌డబ్ల్యూపీసీ)గా అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన 2,518 గ్రామ పంచాయతీల్లో ఈ కేంద్రాలు లేవని చెప్పారు. ఎస్‌డబ్ల్యూపీసీలు లేని పంచాయతీల్లో 2025-26లో నిర్మాణాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు ఉన్న వాటిల్లో 9,382 పని చేస్తున్నాయన్నారు. వీటిల్లో పాక్షికంగా పనిచేస్తున్న 3826 ఎస్‌డబ్ల్యూపీసీలను మార్చి 2025 నాటికి పూర్తిగా పని చేసే స్థితికి అప్‌గ్రేడ్ చేస్తామని, పూర్తిగా పనిచేయని 1,426 ఎస్‌డబ్ల్యూపీసీలను పని చేసే స్థితికి తీసుకొస్తామని వివరించారు. ఏపీ మార్క్‌ఫెడ్ భాగస్వామ్యంతో వర్మీ కంపోస్ట్ విక్రయాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. పీఆర్ వన్ యాప్ ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీల స్థితిని క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తామని తెలిపారు. కాగా, గ్రామ సచివాలయ భవనాల రంగులకు 2019-24 మధ్య వైసీపీ హయాంలో రూ. 101.81 కోట్లు ఖర్చు అయ్యిందని పవన్ చెప్పారు. రంగులు వేయడానికి రూ. 49.8 కోట్లు, వాటిని తొలగించి తిరిగి సాధారణ రంగులు వేయడానికి రూ. 52.73 కోట్లకు పైగా ఖర్చు అయ్యిందని వెల్లడించారు. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలోని కార్యాలయాలకు మాత్రమే అయిన ఖర్చు ఇది అని స్పష్టం చేశారు. మిగిలిన కార్యాలయాలకు అయిన ఖర్చును సంబంధిత శాఖలు అందజేస్తాయని సభ్యుల ప్రశ్నకు సమాధానం చెప్పారు.

5 బిల్లులకు మండలి ఆమోదం..

ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2024 ఏపీ పంచాయతీరాజ్ (సవరణ) బిల్లు-2024, ఏపీ పురపాలక శాసనముల(సవరణ) బిల్లు) -2024, ఎన్టీఆర్ ఆరోగ్య, విజ్ఞాన శాస్త్రముల విశ్వవిద్యాలయాల(సవరణ) బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ ఆయుర్వేద, హోమియోపతి వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ(సవరణ) బిల్లు- 2024, ఆంధ్రప్రదేశ్ వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ(సవరణ) బిల్లులకు శాసనమండలి ఆమోదం తెలిపింది.

శారదా పీఠానికి జగన్ గురుదక్షిణ

- రూ. 300 కోట్ల విలువైన భూమిని కేవలం రూ. 15 లక్షలకే ఇచ్చేశారు
- గత ప్రభుత్వం భూముల కేటాయింపుపై మండలిలో మంత్రులు అనగాని, అచ్చెన్నాయుడు ఫైర్
- గురుదక్షిణ అనడం సరికాదు: బొత్స

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖ శారదా పీఠానికి వైసీపీ ప్రభుత్వం భూముల కేటాయింపు అంశంపై మంగళవారం శాసన మండలిలో వాడీవేడిగా చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో శారదా పీఠానికి భూకేటాయింపుల రద్దు అంశంపై టీడీపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రులు బదులిచ్చారు. ప్రజల హితం కోసం కాకుండా గురుదక్షిణగా జగన్ ప్రభుత్వం విలువైన భూములను ఆ పీఠానికి కేటాయించిందని మంత్రులు అనగాని సత్యప్రసాద్, అచ్చెన్నాయుడు మండిపడ్డారు. భూములు కేటాయింపుల్లో నిబంధనలను ఉల్లంఘించారన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. విశాఖపట్నంలో రూ. 300 కోట్ల విలువైన భూమిని నిబంధనలు పాటించకుండా కేవలం రూ. 15 లక్షలకే శారదా పీఠానికి గత ప్రభుత్వం ఇచ్చిందన్నారు. ఎకరా రూ. 1.5 కోట్లు విలువైన భూమిని కేవలం రూ. ఒక లక్షకే కేటాయించిందన్నారు. భూముల కేటాయింపులకు జీవీఎంసీ ఆమోదం తెలపలేదని, ఎన్‌వోసీ తీసుకోలేదని వివరించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత శారదా పీఠానికి అక్రమంగా ఇచ్చిన భూములు రద్దు చేశామని చెప్పారు. వేద పాఠశాల కోసం భూములు తీసుకుని వాణిజ్య అవసరాల కోసం అనుమతి కోరారని తెలిపారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. నిబంధనలను ఉల్లంఘించి గురువుకు ఇచ్చిన దాన్ని గురుదక్షిణే అంటారని చెప్పారు. శారదాపీఠానికి భూములు ఇచ్చింది తప్పేనని వైసీపీ సభ్యులు ఒప్పుకోవాలన్నారు. టీడీపీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ.. శారదా పీఠంలో ఆక్రమణలపై కూడా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుదక్షిణ అనే పదంపై మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం తెలిపారు. ధార్మిక సంస్థలకు భూముల కేటాయింపు గత ప్రభుత్వాల నుంచి కొనసాగుతోందన్నారు. పీఠాధిపతులుకు, మఠాధిపతులకు భూములు ఇవ్వడానికి నిబంధనలు ఉన్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా శారదా పీఠానికి భూముల కేటాయింపు ఉంటే రద్దు చేయవచ్చని, దీనిపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని చెప్పారు. అయితే జగన్ సీఎంగా ఉన్నప్పుడు గురుదక్షిణగా ఇచ్చారని అనడం సరికాదన్నారు. టీడీపీ ప్రభుత్వం ఈశా ఫౌండేషన్‌కి కూడా ఇచ్చిందన్నారు. దీనిపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందిస్తూ.. తాము గతంలో ఈశా ఫౌండేషన్‌కి ఇచ్చినపుడు నిర్దీత సమయంలో నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో తాము వెనక్కి తీసుకున్నామన్నారు.



శ్రీవిధుశేఖర భారతి మహాస్వామికి నమస్కరిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్

శ్రీవిధుశేఖర భారతి స్వామిని కలిసిన జగన్

విజయవాడ(సత్యనారాయణపురం), నవంబరు 19: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులోని శ్రీ శృంగేరీ శారదాపీఠానికి విచ్చేశారు. మంగళవారం ఆయన శ్రీవిధుశేఖర భారతి మహాస్వామిని కలిసి ఆశీర్వచనం పొందారు. సుమారు గంటన్నర సమయం శ్రీవిధుశేఖర భారతి మహాస్వామితో మాట్లాడారు. జగన్ వెంట ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్, మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాస్, వైసీపీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి దేవినేని అవినాశ్ తదితరులున్నారు.

నేతన్నకు 365 రోజులూ పని కల్పిస్తాం





- వారి సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు: మంత్రి సవిత
- వారానికోరోజు చేనేత ధరించేలా చూడండి: మాధవి

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఏడాదంతా పని కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని చేనేత జౌళిశాఖ మంత్రి సవిత తెలిపారు. అసెంబ్లీలో మంగళవారం ప్రశ్నోత్తరాల్లో భాగంగా జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో అంతర్జాతీయ స్థాయి డిజైన్లు నేసే చేనేత కళాకారులకు ప్రోత్సాహంలేక యాభై శాతం మగ్గాలు మూతపడ్డాయని తెలిపారు. ముడిసరుకు ధరలు పెరిగి, వస్త్రాలకు మార్కెటింగ్ లేక రాష్ట్రంలోని నేతన్నలు కూలీలుగా మారుతుంటే.. గుజరాత్‌లో కూలీలు నేతన్నలుగా మారుతున్నారని చెప్పారు. నెలకు కనీసం 8-10 వేలు ఆదాయం వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, వారానికి ఒక్కరోజైనా ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రం ధరించేలా చైతన్యం తీసుకురావాల్సి ఉందని అన్నారు. దీనిపై మంత్రి సవిత స్పందిస్తూ.. నేతన్నలకు ముడిసరుకుపై రాయితీ, వస్త్రాలపై రిబేటు, చేనేత ఎగ్జిబిషన్లు, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్.. ఇలా ప్రభుత్వం ఎంతో చేస్తోందని చెప్పారు.

ఆక్వాకు విద్యుత్ సబ్సిడీ పొడిగించాం: గొట్టిపాటి

రాష్ట్రంలోని ఆక్వా జోన్ పరిధిలో ఉన్న పదెకరాలలోపు మత్స్యకార రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50 సబ్సిడీని పొడిగించినట్లు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రాష్ట్రంలో ఆక్వా రంగం తీవ్ర ఇబ్బందుల్లో ఉందని ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు, అయితాబత్తుల ఆనందరావు సభలో ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి స్పందిస్తూ విద్యుత్ యూనిట్‌పై 1.50 సబ్సిడీ ఇస్తూనే పలు నిబంధనలు పెట్టి గత ప్రభుత్వం గందరగోళం సృష్టించిందన్నారు. కాగా, గిరిజన ప్రాంతాల్లో శిక్షణ సందర్భంగా యువతకు భోజనం పెట్టిన డ్వాక్రా సంఘాలకు గత ఐదేళ్లుగా బకాయిలు చెల్లించలేదని విష్ణుకుమార్‌రాజు, పార్థసారథి ప్రశ్నించారు. దీనిపై మంత్రి సుధారాణి స్పందిస్తూ డ్వాక్రా సంఘాలకు 5.71కోట్లు బకాయిలు ఉన్నమాట వాస్తవమేనని, సమస్య పరిష్కరిస్తామని బదులిచ్చారు. అలాగే. చంద్రబాబు ప్రభుత్వం 2018లో ఎస్సీల కోసం తెచ్చిన వాహనాలను తుప్పుపట్టేలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవి ప్రభుత్వాన్ని కోరారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి బదులిస్తూ వాహనాలు నాశనం అవడానికి కారణాలు తేల్చాల్సిందిగా కడప కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు.

బదిలీలపై తెలంగాణ స్పందన రావాలి: కేశవ్

శాశ్వత ప్రాతిపదికన ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లేందుకు 1,942మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు సుముఖత వ్యక్తం చేయగా, తెలంగాణ నుంచి ఏపీకి వచ్చేందుకు 1,447మంది సిద్ధంగా ఉన్నట్లు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ ఏపీ నుంచి పంపేందుకు అభ్యంతరం లేదని తెలంగాణకు లేఖ రాశామని, స్పందన కోసం ఎదురు చూస్తున్నామని చెప్పారు.

కార్మికులకు అన్యాయం: మంత్రి సుభాష్

రాష్ట్రంలోని కార్మికులకు 2020 మార్చి నుంచి వైసీపీ ప్రభుత్వం క్లెయిమ్‌లు ఆపేసిందని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. పథకాలు ఇస్తున్నామంటూ కార్మిక సంక్షేమ మండలి అందించే వాటిని గత ప్రభుత్వం ఆపిందని, దాన్ని పునరుద్ధరిస్తామని చెప్పారు. కార్మికులు క్షతగాత్రులైనా, చనిపోయినా జగన్ ప్రభుత్వం రూపాయి కూడా ఇవ్వలేదని ఎమ్మెల్యేలు ఏ రాధాకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు.

సర్వీస్ ఇనాం భూములకు హక్కులపై త్వరలో నిర్ణయం: మంత్రి అనగాని

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సర్వీస్ ఇనాం భూములకు హక్కులు కల్పించే దిశగా త్వరలో నిర్ణయం తీసుకోబోతున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్ వెల్లడించారు. మంగళవారం ఆయన అసెంబ్లీ లాబీల్లో మీడియాతో మాట్లాడారు. 'దేవదాయ భూములు కాకుండా ఇతరత్రా వృత్తిపనివారికి గతంలో సర్వీస్ ఇనాం భూములు కేటాయించారు. ఆ భూమిని సాగు చేసుకోవడం తప్ప వాటిపై వారికి ఎలాంటి హక్కులూ లేవు. వారికి వాటిపై హక్కులు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. త్వరలో జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని అనుకొంటున్నాం. ఇలాంటి భూములు రాష్ట్రవ్యాప్తంగా సుమారు లక్షన్నర ఎకరాలు ఉంటాయని అంచనా' అని వివరించారు. నగరాలు, పట్టణాల్లో 40, 50 గజాల్లో కట్టుకొన్న ఇళ్లలో కొన్ని 22ఎ నిషేధ జాబితాలో ఉన్న విషయంపై మాట్లాడుతూ ఆ సమస్య ఎక్కడెక్కడ ఏ మేరకు ఉందో ఎమ్మెల్యేలు తమ దృష్టికి తెస్తే పరిశీలన చేసి నిర్ణయం తీసుకొంటామని మంత్రి అనగాని తెలిపారు.

రూ.99 మద్యానికి మంచి ఆదరణ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన రూ.99 మద్యానికి మంచి ఆదరణ లభిస్తోందని ఎక్సయిజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు. మంగళవారం ఇక్కడ అసెంబ్లీ లాబీల్లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇప్పటి వరకు రూ.99ల మద్యం ఐదు లక్షల కేసుల మేర విక్రయాలు జరిగాయి. ఈ మద్యం కూడా జాతీయ స్థాయిలో పేరుపొందిన కంపెనీలతోనే సరఫరా చేయించాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆ కంపెనీలు కూడా ఆసక్తిగా ఉన్నాయి. ఆ కంపెనీలు ప్రస్తుతం ఈ మద్యం అమ్మకాలు ఎలా ఉన్నాయో బేరీజు వేసుకొంటున్నాయి. తర్వాత అవి తమ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకొంటాయి. అప్పుడు ఎంత కావాలంటే అంత నాణ్యమైన మద్యం సరఫరా జరుగుతుంది' అని ఆయన వివరించారు.

ప్రభుత్వ నియంత్రణ లేని చట్టాలెందుకు?

- వర్సిటీల్లో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలి: పీడీఎఫ్

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలి సమావేశాల తీరును విమర్శిస్తూ పీడీఎఫ్, ఎమ్మెల్సీలు మంగళవారం మీడియా పాయింట్‌లో మాట్లాడారు. గత, ప్రస్తుత శాసనమండలి సమావేశాల్లో పీడీఎఫ్ పక్షాన అడిగిన ఏ ప్రశ్నపైనా ప్రభుత్వాలు చర్చించడం లేదని ఆ కూటమి ఎమ్మెల్సీ ఇళ్లా వెంకటేశ్వరరావు ఆక్షేపించారు. ఈ విషయంపై మండలి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. 'విశాఖ డెయిరీ పాల సేకరణ ధర తగ్గిస్తే... మ్యాక్స్ చట్టం వల్ల డెయిరీపై ప్రభుత్వానికి నియంత్రణ లేదని మంత్రి చెప్తున్నారు. ప్రభుత్వ నియంత్రణ లేని చట్టాలను ఎందుకు అమలు చేస్తున్నారో చెప్పాలి. గత ప్రభుత్వం ఆర్టీసీ విలీనం పేరుతో డ్రైవర్లు, కండక్టర్ల టీఏ, డీఏ వంటి అలవెన్సులను రద్దు చేసింది. తిరిగి వాటిని అమలు చేయాలి' అని కోరారు.

వీసీలను నియమించండి: లక్ష్మణరావు

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 5,000 అధ్యాపక పోస్టులను భర్తీచేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. 15 విశ్వవిద్యాలయాల్లో పూర్తికాలపు ఉపకులపతులు లేరని, వెంటనే వారి నియామక ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. ఉన్నత విద్యా మండలికి రెగ్యులర్ చైర్మన్‌ని నియమించాలని సూచించారు.

ఎమ్మెల్సీగా ఇందుకూరి రఘురాజు

- హైకోర్టు తీర్పుతో సభ్యత్వం పునరుద్ధరణ



ఇందుకూరి రఘురాజు

శృంగవరపుకోట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా శృంగవరపుకోట మండలం బొడ్డవర గ్రామానికి చెందిన ఇందుకూరి రఘురాజు ఎమ్మెల్సీ పదవిని తిరిగి దక్కించుకున్నారు. జిల్లా స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఆయన సభ్యత్వాన్ని శాసనమండలి పునరుద్ధరించింది. జూన్ 3నుంచి ఖాళీగా ఉన్న ఈ పదవిని భర్తీ చేసినట్లు మండలి ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్ సూర్యదేవర మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కక్ష సాధించాలని చూసిన వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఎంపిక చేసిన అసెంబ్లీ అభ్యర్థికి సహకరించేది లేదని రఘురాజుపై వైసీపీ అనర్హత వేటు వేయించింది. ఈ నిర్ణయాన్ని రఘురాజు హైకోర్టులో సవాల్ చేశారు. కోర్టులో వ్యాజ్యం నడుస్తుండగానే.. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. బొబ్బిలి మాజీ ఎమ్మెల్యే శంబంగి చినప్పలనాయుడుతో వైసీపీ నామినేషన్ వేయించింది. అయితే సరైన సాక్ష్యాలు చూపించలేకపోవడంతో నవంబరు 6న హైకోర్టు రఘురాజుకు అనుకూలంగా తీర్పునిచ్చింది. నవంబరు 14న కేంద్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికను రద్దు చేయడంతో రఘురాజు తిరిగి శాసనమండలిలో అడుగుపెట్టారు. 2027 నవంబరు 26 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు.

పౌర సేవల్లో డ్రోన్ల వినియోగం

- వేలాది మందికి శిక్షణ... ఏపీ డ్రోన్ పాలసీ విడుదల

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పౌర సేవల రంగంలోకి డ్రోన్ల వినియోగాన్ని తీసుకొస్తూ రాష్ట్ర ప్రభుత్వ మౌలిక సదుపాయాల కల్పన శాఖ 'డ్రోన్ 2024-29 పాలసీ 4.ఓ'ను విడుదల చేసింది. ఈ మేరకు మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి సురేశ్ కుమార్ మంగళవారం ఉత్తర్వు జారీ చేశారు. దేశీయ డ్రోన్ మార్కెట్‌ను విస్తరించేలా.. వ్యవసాయం, సర్వే, మౌలిక సదుపాయాలు, విపత్తు నిర్వహణ, ఆరోగ్యం, రవాణా ఇలా అన్ని రంగాల్లోనూ ఈ సేవలను విస్తృతం చేసేలా డ్రోన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఈ పాలసీని రూపొందించింది. దేశీయంగా డ్రోన్ వినియోగం క్రమంగా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో రాష్ట్రంలో డ్రోన్ సిస్టమ్ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ (డీఎస్‌డీఎం), డ్రోన్ ఎనేబుల్డ్ టెక్నాలజీ అండ్ సర్వీసెస్ (డీఈటీఎస్)ను అమలులోకి తీసుకువస్తున్నట్టు మౌలిక సదుపాయాల కల్పన శాఖ వెల్లడించింది. అయితే డ్రోన్ల వినియోగించడంలో నిష్ణాతులు లేరు కాబట్టి.. ఈ రంగంలో శిక్షణ అందించే సంస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీనికోసం కర్నూలు జిల్లా ఓర్వకల్లును డ్రోన్ హబ్‌గా తయారు చేయాలని నిర్ణయించింది. ఇక్కడ వేలాది మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే డ్రోన్ వినియోగానికి సంబంధించి 2021లో కేంద్ర పౌర విమానయాన శాఖ జారీచేసిన మార్గదర్శకాలను సడలించే దిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.



నా చావుకు వారే కారణం!

- తహసీల్దార్, ఆర్ఐ వేధించారు!
- సూసైడ్ లెటర్ రాసి వీఆర్వో అదృశ్యం
- 24 గంటలుగా ఫోన్ స్విచ్ ఆఫ్
- ఆచూకీ కోసం భార్య, బంధువుల వెతుకులాట



అశోక్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): 'ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఆర్ఐ ప్రసాద్ వేధించారు. నా చావుకు కారణం వారే' అని ఇబ్రహీంపట్నం సచివాలయం-4 వీఆర్వో పెసరమల్లి అశోక్ సూసైడ్ లెటర్ రాసి ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకొని ఎటో వెళ్లిపోయారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌ను అడ్రెస్ చేస్తూ అశోక్ సూసైడ్ లేఖ రాసి ఇబ్రహీంపట్నం రెవెన్యూ ఉద్యోగుల గ్రూపులో పోస్టు చేయడం ఇప్పుడు కలకలం రేపుతోంది. నందిగామ మండలం రాఘవాపురానికి చెందిన అశోక్ (35) కంచికచర్ల మండలం పేరకలపాడు నుంచి ఇటీవల ఇబ్రహీంపట్నం సచివాలయం-4కు బదిలీపై వచ్చారు. 'పబ్లిక్ గ్రీవెన్ సెల్ ఫిర్యాదులు 75 పెండింగ్‌లో ఉండగా ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేయించుకురావాల్సిందిగా తహసీల్దార్ నన్ను ఆదేశించారు. వెరిఫికేషన్ నిమిత్తం వెళ్లిన నాకు ఫిట్స్ వచ్చాయి. ఆ సమయంలో నా ఫోన్ ఎవరో దొంగిలించారు. దాంతో అధికారులు ఫోన్ చేస్తే ఎత్తలేకపోయాను. ఆ తర్వాత తహసీల్దార్, ఆర్ఐలకు వివరణ ఇచ్చాను. ఫిట్స్ కారణంగా ఫోన్ ఎత్తలేదని, తప్పయితే క్షమించాలని వేడుకున్నాను. అయినా వారు వినకుండా.. 'నిన్ను కలెక్టర్ ఆఫీసుకు సరెండర్ చేస్తే ఇక్కడికెందుకు వచ్చావు. నువ్వు మనిషివైతేగా.. నువ్వు గొడ్డువి అని దుర్భాషలాడారు. నోటికి ఏది వస్తే అది తిట్టారు. నా చావుకు కారణం తహసీల్దార్, ఆర్ఐలే' అని లేఖలో సురేష్ పేర్కొన్నారు. కాగా, సూసైడ్ లేఖ రాసి ఇంటి నుంచి అశోక్ వెళ్లిపోయి 24 గంటలు గడిచినా ఆయన ఆచూకీ తెలియరాలేదు. అశోక్ లేఖ రాసి అదృశ్యమవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అశోక్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భర్త ఏమయ్యాడో అని భార్య ప్రియాంక, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు తీవ్రంగా వెతుకులాడుతున్నారు.

తిట్టలేదు... పనిచేయమన్నాం : తహసీల్దార్, ఆర్ఐ

అశోక్ సూసైడ్ లేఖపై ఇబ్రహీంపట్నం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రసాద్‌లు వివరణ ఇస్తూ.. పని చేయమని చెప్పామే తప్ప అశోక్‌ను తాము దూషించలేదని స్పష్టం చేశారు. ఈ నెల 5నే అతడ్ని కలెక్టరేట్‌కు సరెండర్ చేశామని, దూషించలేదని తహసీల్దారు చెప్పారు.

నచ్చితే కోరినంత మేత!

(మొదటి పేజీ తరువాయి)

మాత్రం కళ్లుచెదిరే చెల్లింపులు చేశారు. అంతకు ముందు నుంచి అమల్లో ఉన్న నియమ నిబంధనలు, మార్గదర్శకాలను జగన్ తనదైన శైలిలో తొక్కిపెట్టి, తాను ఏది చెబితే అదే రూల్, ఏది చేస్తే అదే న్యాయం అన్నట్లుగా వ్యవహరించారు. ముఖ్యమంత్రిగా తనొక్కడే నిర్ణయం తీసుకుంటే చాలు, ఆర్థిక, ఇతర శాఖల ఆమోదం, న్యాయబద్ధమైన పరిశీలనలతో పనిలేదన్నట్లుగా న్యాయవాదులకు ఫీజులు చెల్లించారు. నిజానికి ఒక పీపీ హైకోర్టులో ప్రభుత్వం తరఫున కేసులో హాజరయి వాదనలు వినిపించినా, లేదా కనీసం కనిపించినా రూ.5వేలు చెల్లించాలన్నది నిబంధన. జగన్ దీన్ని తిరగరాశారు. తనకు నచ్చినట్లుగా ఫీజులు చెల్లింపులకు జీవోలు ఇచ్చేశారు. చింతల సుమన్.. ఇందుకు ఓ ఉదాహరణ!

జగన్ చెబితే శాసనమే..

చింతల సుమన్‌ను ప్రత్యేక ప్రభుత్వ ప్లీడర్ (స్పెషల్ జీపీ)గా 2021 సెప్టెంబరు 30న జగన్ ప్రభుత్వం నియమించింది. ఆ సమయంలో పురపాలక శాఖపై 132 దాకా ధిక్కార కేసులు నమోదయ్యాయి. శాఖ తరఫున ఆ కేసుల విచారణలో స్పెషల్ జీపీగా సుమన్ హాజరవ్వాలి. ఇందుకు ఆయనకు ఒక్కో సిట్టింగ్‌కు నిబంధనల ప్రకారం రూ.5వేల చొప్పున ఇవ్వాలి. ఇందుకు ఆయన ఫీజుకయ్యే మొత్తం రూ.6,60,000. కానీ ఇది జగన్‌కు నచ్చలేదు. ఒక్కో సిట్టింగ్‌కు రూ. 44వేలు ఇవ్వాలని పురపాలక శాఖను ఆదేశించారు. 132 కేసుల్లో వాదనలు వినిపించినందుకు ఆయనకు ఏకంగా రూ.58,08,000 ఫీజు చెల్లించాలని ఈ ఏడాది ఫిబ్రవరి 16న పురపాలక శాఖ పరిపాలన అనుమతి ఇస్తూ జీవో 208 ఇచ్చింది. ఆ తర్వాత 23న బిల్లు చెల్లింపునకు ఆమోదం తెలుపుతూ, న్యాయశాఖ జీవో 91 జారీ చేసింది. ఇదంతా ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి కొద్దిరోజుల ముందు సాగిన పరంపర. ఈ ఫీజుల ప్రతిపాదన 2021లో న్యాయశాఖ విడుదల చేసిన జీవో 279కు విరుద్ధంగా, ఆర్థికశాఖ ఆమోదం లేకుండా ముందుకు తీసుకొచ్చారు. స్పెషల్ జీపీలకు కేసు విచారణలో హైకోర్టుకు హాజరయినందుకు ఎంత ఫీజు ఇవ్వాలో జీవో 279 చెబుతోంది. దీనికి ఆర్థికశాఖ ఆమోదం ఉంది. కానీ జగన్ నిర్ణయంతో వెలువడిన జీవో 208కి ఆర్థికశాఖ ఆమోదం లేనేలేదు. నిజానికి ఆ జీవోను ఆర్థికశాఖ ఆమోదానికి పంపించాలి. కానీ సీఎం స్థాయిలోనే నిర్ణయం తీసుకున్నారు. ఫీజుల చెల్లింపునకు జీవోలు ఇచ్చినా ఆర్థికశాఖ వాటిని ప్రాసెస్ చేయలేదు. దానిపై కొన్ని ఒత్తిళ్లు వచ్చినా అప్పటికే ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అదికాస్తా ఆగిపోయింది.

జీవో రద్దు...

కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లుల చెల్లింపు ప్రతిపాదనను పరిశీలించగా, దానికి సంబంధించిన జీవోకు తమ ఆమోదం లేదని ఆర్థికశాఖ అభ్యంతరం తెలిపింది. ఎవరి ఆమోదంతో ఈ జీవోలు ఇచ్చారో ఆరాతీసింది. సీఎం స్థాయిలో నిర్ణయం తీసుకొని జీవోలు ఇచ్చారని నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో జీవో 208, దాని ఆధారంగా న్యాయశాఖ ఇచ్చిన జీవో 91ని రద్దుచేస్తూ తాజాగా న్యాయశాఖ కార్యదర్శి వి.సునీత ఉత్తర్వులు (జీవో. 415) జారీ చేశారు. ఇదిలా ఉండగా, ఇలాంటి ఖరీ చెల్లింపులు చాలానే జరిగాయన్న విమర్శలు రావడంతో ప్రభుత్వం వీటిపై సమగ్ర విచారణ చేపట్టినట్టు తెలుస్తోంది.

ఎంపీ అవినాశ్‌రెడ్డికి సుప్రీం నోటీసులు

(మొదటి పేజీ తరువాయి)



అసెంబ్లీ ప్రాంగణంలో సునీత దంపతులు

తీసుకెళ్లారు. ప్రైవేటు వైద్యుడిగా ఉన్న చైతన్యరెడ్డి జైలుకు వెళ్లి సాక్షులను ప్రభావితం చేయడానికి ప్రయత్నించారని తెలిపారు. ఆయన రెగ్యులర్‌గా జైలుకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించే వైద్యుడా అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. కాదని.. జైలు నిబంధనలకు విరుద్ధంగా జైల్లోకి వెళ్లారని లూథ్రా బదులిచ్చారు. అవినాశ్‌రెడ్డి కీలక నిందితుల్లో ఒకరని, ఆయన బెయిల్‌పై ఉండడం వల్లే ఇటువంటివి జరుగుతున్నాయని తెలిపారు. ఈ కేసులో చైతన్యరెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ప్రతివాదులుగా చేర్చాలని కోరారు. లూథ్రా వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. చైతన్యరెడ్డిని, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదులుగా చేర్చడానికి అంగీకరించి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 3వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వారానికి వాయిదా వేసింది.

దర్యాప్తును అడ్డుకునేందుకే ప్రైవేటు ఫిర్యాదులు..

కాగా.. వివేకా మాజీ పీఏ ఎంవీ కృష్ణారెడ్డి ఈ హత్య కేసు దర్యాప్తు పురోగతిని అడ్డుకునేందుకే సునీతారెడ్డి, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌లపై ప్రైవేటు ఫిర్యాదులు చేశారని లూథ్రా ధర్మాసనానికి నివేదించారు. రాజకీయ దురుద్దేశాలతో కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని తెలిపారు. తమపై పెట్టిన కేసులను కొట్టి వేయాలని(క్వాష్ చేయాలని) కోరుతూ ఈ ముగ్గురూ వేర్వేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ మూడు పిటిషన్లూ మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. దర్యాప్తు అధికారిపై ప్రైవేటు ఫిర్యాదు చేసి, తద్వారా విచారణను ప్రభావితం చేశారని లూథ్రా తెలిపారు. వాదనల అనంతరం.. కృష్ణారెడ్డికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 24వ తేదీకి వాయిదా వేసింది.

అసెంబ్లీకి వచ్చిన సునీతారెడ్డి

- వివేకా కేసుపై సీఎంవోలో ఆరా
- హోం మంత్రి అనితతో భేటీ

అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీతారెడ్డి మంగళవారం రాష్ట్ర అసెంబ్లీకి వచ్చారు. భర్త నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కలిసి అసెంబ్లీ ప్రాంగణంలోని ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లారు. చంద్రబాబు లేకపోవడంతో సీఎంవో అధికారులతో తన తండ్రి హత్య కేసు విచారణ పురోగతిపై చర్చించారు. అప్రూవర్‌గా మారిన దస్తగిరి జైలు అధికారులకు రాసిన లేఖపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని ఆమె కోరినట్లు తెలిసింది. అలాగే ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దుకు సంబంధించి సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేయాలని కూడా అభ్యర్థించినట్లు సమాచారం. అంతకుముందు హోం మంత్రి అనితతో సునీత సమావేశమయ్యారు. సునీత, భర్త రాజశేఖర్‌రెడ్డి, సీబీఐ అధికారి రాంసింగ్‌పై వేసిన ప్రైవేటు కేసులో కడప పోలీసులు ఇటీవల వివేకా మాజీ పీఏ కృష్ణారెడ్డి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. ఆ కేసు విచారణ వేగవంతమైంది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ప్రాంగణానికి వచ్చిన సునీతను చూసిన కొందరు ఎమ్మెల్యేలు.. 'అన్న ఎమ్మెల్యేగా గెలిచి ప్యాలెస్‌లో కూర్చున్నాడు.. చెల్లెలు ప్రజాప్రతినిధి కాకపోయినా అసెంబ్లీకి వచ్చారు' అని సరదాగా వ్యాఖ్యానించారు.

విశాఖలో న్యాయ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

- బాధితురాలి ఆత్మహత్యాయత్నం.. నిందితుల అరెస్టు

విశాఖపట్నం, మహరాణిపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విశాఖలో న్యాయవిద్య అభ్యసిస్తున్న ఒక యువతిపై నలుగురు సహచర విద్యార్థులు సామూహిక అత్యాచారం చేశారు. ఓ పథకం ప్రకారం ప్రేమికుడితోపాటు, మరో ముగ్గురు స్నేహితులు ఆమెను బ్లాక్ మెయిల్ చేసి ఈ దురాగతానికి పాల్పడ్డారు. బాధితురాలు ఆత్మహత్యాయత్నం చేయడంతో ఈ దారుణం బయటపడింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపారు. ఆయన కథనం మేరకు.. గాజువాక ప్రాంతానికి చెందిన బాధిత యువతితో పాటు వన్‌టౌన్ రంగిరీజు వీధికి చెందిన బాత వంశీ, జాలారిపేటకు చెందిన బొడ్డు జగదీశ్, కృష్ణాగార్డెన్స్‌కు చెందిన పోలిపల్లి ఆనంద్, చేపలుప్పాడకు చెందిన దవులపల్లి రాజేష్ నగర శివారులోని ఒక కళాశాలలో ఎల్ఎల్‌బీ మూడో సంవత్సరం చదువుతున్నారు. బాధిత యువతికి వంశీ ప్రేమ పేరుతో చేరువై పెళ్లిచేసుకుంటానని నమ్మించాడు. పెళ్లికి ఆమె ఒప్పుకోవడంతో ఆగస్టు 13న యువతికి ఫోన్ చేసి డాబాగార్డెన్స్‌కు రావాలని కోరాడు. ఆమె వచ్చాక, టూటౌన్ పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న పోలిపల్లి ఆనంద్ రూమ్‌కు తీసుకువెళ్లాడు. వంశీ ఇచ్చిన సమాచారం మేరకు బొడ్డు జగదీశ్ వారిద్దరూ ఏకాంతంగా ఉన్న దృశ్యాలను రహస్యంగా వీడియోలో చిత్రీకరించాడు. జగదీశ్ ఆ వీడియోను వంశీకి షేర్ చేయగా, వంశీ ఆ వీడియోను ఆనంద్, రాజేష్‌కు షేర్ చేశాడు. వారంతా ఆ వీడియోలను యువతికి చూపించి బెదిరించి పలుమార్లు సామూహికంగా అత్యాచారం చేశారు. ఇంకా తమతో గడపాలంటూ వేధిస్తుండడంతో బాధితురాలు 18న ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యువతి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి నిందితులను అరెస్టు చేశారు. పార్ట్ టైమ్‌గా వంశీ, జగదీశ్‌లు స్విగ్గీ డెలివరీ బాయ్స్‌గాను, ఆనంద్ ఒక కంపెనీలో క్యాషియర్‌గా, రాజేష్ రాడ్ బెండింగ్ పనులు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోండి: మంత్రి డోలా

గ్యాంగ్ రేప్ ఘటనపై పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చితో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి మాట్లాడారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించగా, ఫిర్యాదు వచ్చిన గంటలోనే నిందితులను అరెస్టు చేసినట్టు సీపీ తెలిపారు.

విశాఖ జైల్లోకి గంజాయి

- లంచ్ బాక్సులో తరలిస్తూ పట్టుబడిన ఫార్మసిస్టు
- 95 గ్రాముల గంజాయి స్వాధీనం

విశాఖపట్నం/ఆరిలోవ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారం లోపలకి గంజాయిని తీసుకువెళ్తున్న జైలు ఆస్పత్రి ఫార్మసిస్టును ఆరిలోవ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖలో కడియం శ్రీనివాసరావు ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారు. డిప్యూటేషన్‌పై విశాఖ కేంద్ర కారాగారంలోని ఆస్పత్రికి వచ్చారు. రిమాండ్ ఖైదీ గుర్రాల సాయి చికిత్స కోసం జైలు ఆస్పత్రికి వచ్చినప్పుడు శ్రీనివాసరావుతో పరిచయం ఏర్పడింది. ఇంటి నుంచి డ్యూటీకి వచ్చేటప్పుడు తన సోదరుడు గంజాయి ఇస్తాడని, దాన్ని తీసుకొచ్చి తనకు అందజేస్తే డబ్బులు ఇస్తానని ఆశచూపాడు. అప్పటి నుంచి శ్రీనివాసరావు డ్యూటీకి వచ్చే సమయంలో తన లంచ్ బాక్స్‌లో గంజాయి తీసుకొచ్చి సాయికి ఇస్తున్నాడు. జైలు ప్రధాన ద్వారం వద్ద అధికారులు నిర్వహించిన ర్యాండమ్ తనిఖీలో శ్రీనివాసరావు లంచ్ బాక్స్‌లో 95 గ్రాముల గంజాయిని గుర్తించారు. దీంతో శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వాన్‌పిక్ కేసులో వైవీ పిటిషన్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అక్రమాస్తుల వ్యవహారానికి సంబంధించి 'వాడరేవు, నిజాంపట్నం పోర్ట్స్ అండ్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాజెక్ట్(వాన్‌పిక్)' భూముల కేసును సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. తనను నిందితుడిగా చేర్చడంపై వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం దానిని కొట్టివేసింది. దీనిని సుప్రీంకోర్టులో సవాల్ చేయగా మంగళవారం జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్ కుమార్‌తో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. కేసును మరోరోజు విచారిస్తామని ధర్మాసనం తెలిపింది. డిసెంబరు 19న విచారణకు వచ్చే అవకాశముంది.

అభ్యంతరకర పోస్టులపై కొరడా

- తునిలో 17 మంది అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు
- శ్రీసత్యసాయి జిల్లాలో నలుగురిపై కేసులు నమోదు

తుని రూరల్/గుర్ల/పెనుకొండ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో ప్రభుత్వంపైనా, కూటమి నేతలకు వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్న వారిపై కాకినాడ జిల్లా తుని పట్టణ, గ్రామీణ పోలీసులు కొరడా ఝుళిపించారు. 17 మందిని మంగళవారం అరెస్టు చేసి పలువురిని రిమాండ్‌కు తరలించారు. కాగా, సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టిన నలుగురు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేశామని శ్రీసత్యసాయి జిల్లా రొద్దం ఎస్ఐ నరేంద్ర మంగళవారం తెలిపారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బాలాజీరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రెడ్డిపల్లికి చెందిన అశోక్‌రెడ్డి అనుచిత పోస్టులు పెట్టారని పెద్దగువ్వలపల్లి పవన్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని చెప్పారు. చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఫొటోలు మార్ఫింగ్ చేసి అసభ్యకర పోస్టులు పెట్టిన షేక్ గౌస్‌పై చర్యలు తీసుకోవాలని విజయనగరం జిల్లా చీపురుపల్లికి చెందిన టీడీపీ నేతలు నాగులపల్లి నారాయణరావు, కె.విమలారాణి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గుంటూరు మేయర్ కేసు వివరాలు ఇవ్వండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడుపై నమోదు చేసిన కేసు పూర్తి వివరాలను కోర్టు ముందు ఉంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌లను మనోహర్ నాయుడు అసభ్య పదజాలంతో దూషించారని టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు కొట్టివేయాలని మనోహర్ నాయుడు హైకోర్టును ఆశ్రయించారు.

విచారణకు వర్మ డుమ్మా!

- షూటింగ్ ఉందని గడువుకు విన్నపం
- ఇంకోసారి నోటీసులకు పోలీసులు రెడీ
- మరోసారి హైకోర్టుకు దర్శకుడు
- ముందస్తు బెయిల్ కోరుతూ పిటిషన్



ఒంగోలుక్రైం/అమరావతి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సినీ దర్శకుడు రాంగోపాల్‌వర్మ పోలీసు విచారణకు డుమ్మాకొట్టారు. మంగళవారం ప్రకాశం జిల్లా ఒంగోలు రూరల్ సర్కిల్ స్టేషన్‌లో విచారణకు హాజరుకావాల్సిన ఆయన.. తనకు షూటింగ్ ఉన్నందున నాలుగు రోజులు గడువు కావాలని కోరుతూ విచారణాధికారికి వాట్సాప్ ద్వారా మెసేజ్ చేశారు. అదేవిధంగా తన తరఫు న్యాయవాది ఎన్. శ్రీనివాసరావు ద్వారా లేఖ పంపారు. ఈ నేపథ్యంలో మరోసారి వర్మకు నోటీసులు జారీ చేసేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. సామాజిక మధ్యమాలలో అనుచిత, అసభ్యకరమైన పోస్టులు పెట్టారంటూ వర్మపై రెండు తెలుగు రాష్ట్రాలో 10 కేసులు నమోదైనట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌లపై అసభ్యకరంగా సోషల్ మీడియాలో వర్మ పోస్టులు పెట్టారు. మద్దిపాడు పోలీసు స్టేషన్‌లో టీడీపీ మండల కార్యదర్శి ముత్తనపల్లి రామలింగయ్య ఫిర్యాదుచేయడంతో వర్మకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచారు. దీంతో కేసును కొట్టివేయాలని వర్మ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని న్యాయమూర్తి తోసిపుచ్చారు. వర్మ మంగళవారం విచారణకు రావాల్సి ఉండగా, ముందుగా నిర్ణయించుకున్న షెడ్యూలు ప్రకారం సినిమా షూటింగ్‌లు ఉన్నాయని, నాలుగు రోజులు గడువు కావాలని కోరుతూ విచారణాధికారి ఎన్. శ్రీకాంత్‌బాబుకు వాట్సాప్ సందేశం పంపించారు. మంగళవారం మరోసారి వర్మ హైకోర్టును ఆశ్రయించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు. మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు.

తెలియదు.. గుర్తులేదు..!

- వీడియోలు, ఫొటోలు తీసినందుకే 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడి చేశా
- రెండో రోజూ బోరుగడ్డ పొంతన లేని సమాధానాలు

తుళ్లూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తుళ్లూరులో నమోదైన రెండు కేసుల్లో నిందితుడు బోరుగడ్డ అనిల్‌ను రెండోరోజు మంగళవారం కూడా పోలీసులు విచారించారు. పీటీ వారెంట్‌పై రాజమండ్రి జైలు నుంచి బోరుగడ్డను తుళ్లూరు స్టేషన్‌కు తీసుకొచ్చారు. విచారణ అనంతరం మంగళగిరి కోర్టులో హాజరుపరిచి తిరిగి రాజమండ్రి జైలుకు తరలించారు. మొదటిరోజు విచారణలో అసలు తాను తుళ్లూరు రానేలేదని చెప్పినట్టు బోరుగడ్డ... రెండోరోజు విచారణలో తుళ్లూరు వచ్చానని పొంతన లేని సమాధానాలు చెప్పినట్టు తెలిసింది. 'ఆంధ్రజ్యోతి' విలేకరిపై దాడి తనకు సంబంధం లేని విషయమని, వీడియోలు, ఫొటోలు తీస్తుంటే గొడవ పడిన మాట వాస్తవమని, ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వచ్చి సర్దిచెప్పి పంపినట్లు అంగీకరించారని సమాచారం. ఫ్లయింగ్ స్క్వాడ్‌పై దౌర్జన్యం చేసి దుర్భాషలాడడం గురించి ప్రశ్నించగా... 'ఏమో.. గుర్తులేదు' అని సమాధానం చెప్పినట్టు తెలిసింది. 2024 మే 8న రాత్రి 10.30 గంటలకు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్‌పై బోరుగడ్డ అనిల్ దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఆ ఘటనను వీడియో తీస్తున్న 'ఆంధ్రజ్యోతి ఏబీఎన్' విలేకరిపై దాడి చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఫిర్యాదు మేరకు బోరుగడ్డ, అతని అనుచరులపై కేసు నమోదు చేశారు. టీడీపీ వాళ్లు ఓట్లు కొనుగోలుకు దాబాలో డబ్బులు పంచారని చెప్పాలంటూ తుళ్లూరు ఊరు చివర ఉన్న దాబాలో పనిచేసే వారిని కత్తులతో బెదిరించి, కొట్టి... అదేరోజు రాత్రి 12 గంటల సమయంలో వీడియోలు రికార్డు చేశారు. దాబా వారి ఫిర్యాదు మేరకు అప్పుడే విచారణ జరిపిన పోలీసులు బోరుగడ్డపై మరో కేసు నమోదు చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.